# ప్రజా విముక్తి


మోదీ దుష్ట పాలన ... 6
సీబీఐ ... 10
దిగజారుతున్న రూపాయి ... 12
అర్బన్ నక్సల్స్ ... 15
రైతు బంధు ... 16
స్త్రీని వ్యాపార వస్తువుగా ... 19
మావో వ్యాసం ... 21
సంస్మరణ ... 24
పోరాట వార్తలు ... 32



భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక

సంపుటి:3 సంచిక:1 జూన్-డిసెంబర్, 2018


## బూటకపు ముందస్తు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించండి!

## "ప్రజాస్వామిక తెలంగాణ" కోసం పోరాడండి!

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) గడువు కంటే 9 నెలల ముందుగానే అసెంబ్లీని రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు సిద్ధమైనాడు. దీనితో తెలంగాణ రాష్ట్రంలో బూర్జువా రాజకీయ కోలాహలం పెరిగింది. అధికారమే పరమావధిగా కేసీఆర్ తీసుకున్న నిర్ణయం ప్రజలపై పెనుభారం మోపింది. ఈ ఎన్నికలు ప్రజలు కోరుకొన్నవి కావు. టీఆర్ఎస్, తక్కిన బూర్జువా పార్టీలే వారిపై రుద్దాయి.

కాంగ్రెస్ మా ప్రభుత్వంపై చేస్తున్న అవినీతి ఆరోపణలు ఎలా తప్పుడువో ప్రజల వద్దకు వెళ్ళి తేల్చుకోవాలనే ఉద్దేశంతో తను ముందస్తు ఎన్నికలకు వెళ్ళడానికి సిద్ధపడ్డానని కేసీఆర్ చెబుతున్నాడు. 2014 నాటి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చలేదు. 2019 మే వరకు ఆగి లోక్‌సభ ఎన్నికలతో పాటు తెలంగాణా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తే టీఆర్ఎస్ పార్టీ మరింత బలహీన పడిపోతుందని కేసీఆర్‌కు భయం పట్టుకుంది. తనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సంఘటితం కాకముందే ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్ళడానికి నిర్ణయం తీసుకొన్నాడు.

కేసీఆర్ ముందుగానే చేసుకొన్న నిర్ణయం మేరకు అసెంబ్లీ రద్దు కోసం ప్రధానమంత్రి మోడీనీ కలవడంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా కలిసి మంతనాలు జరిపాడు. ఇలా పక్కా ఏర్పాటు చేసికొని కేసీఆర్ నియంతలాగా ఒక్క పెన్నుపోటుతో అసెంబ్లీని రద్దు చేయడం ద్వారా బూర్జువా 'ప్రజాస్వామ్యాన్ని' కూడా అపహస్యం పాలు చేసాడు. తన పరిపాలనలో గత నాలుగు సంవత్సరాలుగా అనుసరిస్తూ వచ్చిన నియంతృత్వ పోకడలకు ఈ చర్య పరాకాష్టగా నిలుస్తోంది.

రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలుగా కేసీఆర్ కుటుంబ పరిపాలన కొనసాగుతున్నది. రాష్ట్ర మంత్రివర్గం 'నామ్‌కేవాస్తే'గా ఉంది. మంత్రివర్గంలో మహిళలకు చోటు లేదు. ప్రభుత్వ నిర్ణయాలన్ని ప్రగతి భవన్‌లోనే జరుగుతాయి. ముఖ్యమంత్రి ఏ ఒక్కరోజు సెక్రెటరియేట్ గడప తొక్కలేదు. అధికార మీటింగ్‌లు అన్ని ప్రగతి భవన్‌లోనే జరుగుతాయి. ఇది గడీల పాలనను పోలి ఉంది. కేసీఆర్ దొరతనపు వ్యవహారిక శైలి స్పష్టంగా కనబడుతోంది. తనకు తోచిన వాటిని మంత్రివర్గ నిర్ణయాలు లేకుండానే ప్రకటిస్తాడు.

రాష్ట్ర ప్రభుత్వం అన్ని నిర్ణయాల్లో ముఖ్యమంత్రి కుటుంబం, వారి బంధువైన పెట్టుబడిదారుడు మైహెూం రామేశ్వర్రావు లాంటివాళ్ళ భాగస్వామ్యం అలాగే గురువు చిన్నజీయర్ స్వామి 'వాస్తు సలహా' ఉంటుంది. రాష్ట్రంలో వెలమ, కమ్మ, రెడ్డి కాంబినేషన్‌తో కుల సమీకరణ జరగడంతో పాటు ఈ కులాల వారికే ప్రభుత్వ కాంట్రాక్టులు, 'అభివృద్ధి' కార్యక్రమాలపై జరిగే ఖర్చులు, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో, భారీ ప్రాజెక్టు నిర్మాణాల్లో, ఇతర ప్రభుత్వ ఖర్చుల్లో వాటాలు దక్కాయి. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం పెద్ద మొత్తంలో జరుగుతున్నది. మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులు మొదలు రాష్ట్రంలో జరుగుతున్న నీటి పారుదల ప్రాజెక్టులు కోస్తాంధ్ర బడా కాంట్రాక్టర్లకు ఇచ్చారు. ఉద్యమకాలంలో ఎవరికి వ్యతిరేకంగానైతే తెలంగాణ ప్రజలు పోరాడారో ప్రస్తుతం వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనితో సిటీలో స్థిరపడిన ఆంధ్ర ప్రాంతపు ప్రజలను టీఆర్ఎస్ పార్టీకి దగ్గరగా తెచ్చుకున్నాడు.

కొంతకాలం క్రితం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ అని కొద్దిరోజులు దేశంలో హల్‌చల్ చేసాడు. అనతి కాలంలోనే ఇది ఒక ప్రహసనం అని తేలిపోయింది. గుట్టుగా బీజేపీతో అంటకాగుతూ, ప్రజలను మభ్యపెట్టడానికి చేసిన ఈ ప్రయత్నం తొందర్లోనే బహిర్గతమైంది. పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదాపైన అవిశ్వాస తీర్మాణం సందర్భంగా బాహాటంగా బీజేపీని సమర్ధించాడు. నోట్ల రద్దు సమయంలో బీజేపీని సమర్ధించాడు. పోలవరం ప్రాజెక్టుల కోసం 8 మండలాలను, 2.75 లక్షల ప్రజల జీవితాలను ఫణంగా పెట్టిన ఈ ఘనాపాటి పూర్తిగా బీజేపీ పక్షంలోకి వెళ్ళాడు. అందుకే అవిశ్వాస తీర్మాణం సందర్భంగా మోడీ పార్లమెంటులో ప్రసంగిస్తూ కేసీఆర్‌ను ఆకాశానికెత్తాడు. ప్రస్తుతం ముందస్తు ఎన్నికల ప్రకటనలో బీజేపీ, టీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సందర్భంగా రాష్ట్రంలో నీళ్ళు, నిధులు, నియామకాలు, భూమి, వికేంద్రీకరణ, స్వావలంబన, సామాజిక న్యాయం అనే ఎన్నో ప్రజాస్వామిక డిమాండ్లపై ఉద్యమం జరిగింది. కేసీఆర్ ఎన్నికల్లో గెలవడానికి ఉద్యమ కాలం నాటి డిమాండ్లనన్నింటినీ, తన ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి 2014 ఎన్నికల్లో ప్రచారం చేసాడు. సాధారణ మెజారిటీతో (63/119 సీట్లతో) అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రపంచ బ్యాంకు ఆదేశానుసారం 'బంగారు తెలంగాణ' సాధన తన లక్ష్యం అని చెప్పుకొచ్చాడు. మంత్రి పదవులు, కోట్లాది రూపాయలు ఆశచూపించి ఎమ్మెల్యే, ఎంపీలను కొనుగోలు చేసిన కేసీఆర్ యితర పార్టీల నుండి ఫిరాయింపులకు పాల్పడి తన బలాన్ని (90/119 సీట్లకు) పెంచుకుని అధికారాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన ఎమ్మెల్యేలను కలుపుకొని మంత్రి పదవులను అప్పగించాడు. రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని బలహీనపరచి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి కేసీఆర్ కొత్త ఒరవడి తెచ్చాడు.

అధికారానికి వచ్చిన వెంటనే సామ్రాజ్యవాదుల ప్రపంచబ్యాంకు ఎజెండాను దూకుడుగా అమలు చేయప్రూనుకున్నాడు. పారిశ్రామికరణలో 'టీ–పాస్' పేరిట హైటెక్ పరిశ్రమలకు, ప్రైవేట్ పరిశ్రమలకు పెద్ద పీట వేయడం జరిగింది. అందుకు సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడులను ఆకర్షించడానికి లక్షల ఎకరాల భూములు, నీళ్ళు, విద్యుత్ లాంటి ఉచిత సదుపాయాలతో పాటు అనేక రాయితీలు ఇవ్వడం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నెలకొల్పబడిన ఇలాంటి పరిశ్రమలకు, బడా వ్యాపార సంస్థలకు రెండు చేతులా దండుకోవడానికి రాయితీలు ఇవ్వడం జరిగింది. హైదరాబాద్ చుట్టుపక్కల భూములను విదేశీ పెట్టుబడిదారులకు కారుచౌకగా యిచ్చి పెట్టుబడులకు ద్వారాలు తెరిచాడు. తన కొడుకు సారధ్యంలో ఈ కార్యక్రమాలను ప్రధానంగా చేపడుతూ సాఫ్ట్‌వేర్ రంగంపై కేంద్రీకరించాడు. పారిశ్రామిక ఉత్పత్తి జరిగే ఏ పరిశ్రమలను నెలకొల్పడానికి ప్రయత్నించలేదు. వరంగల్, సిరిసిల్ల టెక్స్‌టైల్స్ ప్రాజెక్టులు కూడా ఉద్యోగాలకు ఉపాధి కల్పించే పరిశ్రమలు కాదు. ప్రపంచ బ్యాంకు పాలసీలో భాగంగా ఎరువుల కర్మాగారాలను మళ్ళీ తెరవాలనే దానిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రామగుండం ఎరువుల కర్మాగారాన్నీ ప్రారంభించాయి. సర్‌సిల్క్ లాంటి పరిశ్రమను తెరవడం తప్ప మూతబడిన పరిశ్రమలను తెరవాలనే ఉద్యమకాలం నాటి డిమాండ్‌ను కేసీఆర్ పక్కకు పెట్టాడు.

తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం కారణంగా నాలుగు వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతుల ఆత్మహత్యల విషయంలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో వుంది. ఆత్మహత్యల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా కేసీఆర్ చేతులెత్తేశాడు. రైతులు గిట్టుబాటు ధర కావాలని ఖమ్మం మార్కెట్‌లో పోరాడితే రైతులను చిత్రహింసలకు గురి చేసి రైతుల చేతికి బేడీలు వేసి తప్పుడు కేసులు పెట్టి జైల్లో బంధించారు.

రైతులకు ఏమీ ఇవ్వకుండా రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేసి నేరుగా గ్రామ స్థాయిలో కూడా రైతులను దోచుకోవడానికి తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే పదవులు కట్టబెట్టాడు. రైతాంగానికి హామీ ఇచ్చిన రుణ మాఫీ ఇంకా పూర్తి చేయలేదు.

భూమి రీసర్వే పేరుతో దళితులు, ఆదివాసులు, పీడిత ప్రజలు పోరాటాల ద్వారా సాధించుకున్న భూములను బలవంతంగా లాక్కొని భూస్వాములకు కట్టబెట్టారు. దళితుల, ఆదివాసీల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సబ్ ప్లాన్ చట్టాన్ని తుంగలో తొక్కి సబ్‌ప్లాన్ నిధులను రోడ్ల నిర్మాణానికి, హుస్సేన్ సాగర్ శుద్ధి వగైరా పనులకు ఖర్చు చేసింది. 5వ షెడ్యూల్డ్ ఏరియాలో 1/70 చట్టం, 2006 అడవి హక్కుల చట్టం, పెసా చట్టాలను అమలు చేయకుండా కేసీఆర్ ప్రభుత్వం హరితహారం పేరుతో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌బాద్, జయశంకర్, భూపాలపల్లి, వరంగల్, ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లలో పోలీసులు, ఫారెస్టు అధికారులతో దాడులు చేయించి ఆదివాసుల పంట చేల్లను ధ్వంసం చేశారు. ఆదివాసుల గూడాలను తగులబెట్టారు. చిత్రహింసలకు గురిచేసి జైళ్ళో పెట్టారు. జలగలంచ గ్రామంలో ఆదివాసులను, ఆదివాసీ మహిళలను చెట్లకు కట్టివేసి నైజాం సర్కార్‌ను మరిపించేలా బట్టలు ఊడబెర్కి కొట్టారు.

కొత్త రాష్ట్రంలో ఉపాధి దొరుకుతుందని, కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగాల భర్తీ జరుగుతుందని ఆశించిన విద్యార్థులకు, నిరుద్యోగులకు నిరాశ మిగిలింది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే లక్షన్నర ఉద్యోగాలు అందుబాటులో ఉండగా కేసీఆర్ 15వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చి అనేక సాకులతో ఉద్యోగ కల్పనను పక్కనబెట్టాడు. ఆందోళనలు చేపట్టిన విద్యార్థి, యువజనులపై అణచివేత దాడులు కొనసాగించి జైళ్ళకు పంపాడు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర చాల గొప్పది. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో 15 వేల ఉద్యోగాలు ఖాళీ చేసారు. సింగరేణిలో ఓపెన్‌కాస్ట్ గనులకు ప్రాధాన్యత ఇస్తున్నాడు. దీనితో నిరుద్యోగ యువకులకు ఉపాధి దొరకడం లేదు.

తెలంగాణ పిల్లలందరికి కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అని చెప్పిన కేసీఆర్ తిరిగి ఆ మాటే ఎత్తడం లేదు. విద్య ప్రైవేటీకరణ వలన చదువుకోవడం విపరీతమైన ఖర్చుగా మారింది. నేడు సామాన్యులకు 'నాణ్యమైన' విద్య అందుబాటులో లేదు. ఇప్పటికీ హైస్కూల్ చదువుల నుండే డ్రాప్‌అవుట్స్ ఎక్కువ శాతం ఉన్నాయి. నూతన రాష్ట్రంలో కూడ నారాయణ, చైతన్య కాలేజీల్లో సకాలంలో ఫీజులు కట్టలేని పక్షంలో వారిపై కొనసాగించే నిర్బంధ విధానాల వలన మధ్య తరగతి పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ఉద్యమ కాలంలో ఒక ప్రధాన నినాదంగా ముందుకు వచ్చిన తెలంగాణకు నీళ్ళందించే కార్యక్రమంలో విపరీతమైన అవినీతి, ముడుపులు, కమీషన్లు, వాటాలు పెరిగాయి. బడా కాంట్రాక్టర్లకు, సామ్రాజ్యవాదులకు లాభాలు చేకూర్చే విధానాలు అమలు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ చిన్న స్థాయి డ్యాంల నిర్మాణంపై కేంద్రీకరించకుండా పెద్ద ప్రాజెక్టులకు ప్లానులు వేసారు. రీ డిజైనింగ్ పేరిట ఖర్చును విపరీతంగా పెంచారు. మేడిగడ్డ కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు 10 వేల కోట్ల నుండి 80 వేల కోట్లకు పెంచారు. మేడిగడ్డ ప్రాజెక్టు ద్వారా నీళ్ళు ఎగువ ప్రాంతాలకు తరలించే కార్యక్రమంలో కేసీఆర్ కోటరీకి విపరీతమైన లాభాలు పండుతున్నాయి. పైపులు, శక్తివంతమైన మోటార్లు, విద్యుత్తు కొనుగోలు చేయడంలో దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి, సామ్రాజ్యవాదులకు పెద్దెత్తున లాభాలు దక్కుతున్నాయి.

కేసీఆర్ నాయకత్వంలో మియాపూర్ వద్ద 587 కోట్ల రూపాయల విలువచేసే 693 ఎకరాల భూములు, ఇబ్రహీంపట్నంలో కే. కేశవరావు రిజిస్ట్రేషన్ చేయించుకున్న 38 ఎకరాల భూములు, కొంగర్ కలాన్ భూధాన యజ్ఞ భూములు ఇంకా హైదరాబాదు చుట్టుపక్కల గల వందలాది ఎకరాల భూములు కలిపి మొత్తం 15వేల కోట్ల రూ॥ల భూకుంభకోణాలు జరిగాయి.

నీటి విధానంలో ఒకదాని కొకటి పొసగని విధానాలు కొనసాగుతున్నాయి. కాకతీయ మిషన్, భగీరథ మిషన్‌లు కమీషన్లతో కాంట్రాక్టర్లకు, కేసీఆర్ కుటుంబానికి, రాజకీయ నాయకులకు జేబులు నిండుతున్నాయి. టీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసుకోవడం కోసం ఈ కార్యక్రమాలను వాడుకుంటూ గ్రామాల్లో తమ పార్టీ నాయకులకు కాంట్రాక్టులు ఇచ్చి వారికి లాభాలు చేకూర్చుతున్నారు. ఒక పథకం ప్రకారం గ్రామాల్లో తమకు అనుకూలమైన ఒక దోపిడీ వర్గ సెక్షన్‌ను తయారు చేసుకున్నాడు.

కేసీఆర్ కోటి ఎకరాల భూమికి నీటిని అందిస్తానని ప్రగల్బాలు పలికాడు. ఇంటింటికి పంపుల ద్వారా నీటిని అందిస్తానని, రాష్ట్రంలో 49వేలకు పైగా ఉన్న గొలుసుకట్టు చెరువులను పునర్నిర్మిస్తామని చేసిన వాగ్దానాలు పూర్తిచేయలేదు. వివిధ సామాజిక గ్రూపులకు, వృత్తులవారికి కొంత ఆర్థిక లబ్ధి చేకూర్చినట్లు ప్రచారం చేసుకున్న నేపథ్యంలో వీటిపై ఆధారపడి టిఆర్ఎస్ ఎన్నికల్లో గెలవవచ్చనే అంచనాతో ఉంది. కానీ ఆపథకాలన్నీ అవినీతి, అక్రమాలతో నిండిపోవడంతో ప్రజలు కేసీఆర్‌ను వ్యతిరేకిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా పాలకవర్గ పార్టీలన్నీ కలిసి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తెలంగాణలోని 7 మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పజెప్పడం వలన ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణం మూలంగా 2,75,000 (రెండు లక్షల డెబ్బై అయిదువేలు) మంది ఆదివాసులు నిర్వాసితులు కావడం జరిగింది. ఆదివాసుల జీవితాలను చిన్నాభిన్నం చేయడంలో కేసీఆర్ ఆంధ్ర రాష్ట్ర పాలకవర్గాలతో కుమ్మక్కు అయినాడు.

దళితులపై దాడులు చెప్పనలవి కాని విధంగా సాగుతున్నాయి. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని ఉద్యమ కాలంలో ప్రగల్బాలు పలికిన చంద్రశేఖరరావు పాలనలో దళితులపై దాడులు ఎక్కువైనాయి. నేరెళ్ళలో దళితులపై పోలీసులు చేసిన దాడి పరమ నిరంకుశమైనది. మూడు ఎకరాల భూమి పంపకం పేరుతో ప్రతి దళిత కుటుంబానికి భూమి అనే కార్యక్రమం ముందుకు సాగిందిలేదు. కాని ఎంతో కొంత చేస్తున్న ఈ కార్యక్రమంలోనే జరుగుతున్న అక్రమాల వలన దళితుల్లో చెలరేగిన అసంతృప్తి వారి ఆత్మహత్యలకు దారి తీసింది. తెరాస అధికారంలోకి వచ్చాక 20కి పైగా కులదురహంకార (పరువు) హత్యలు జరిగాయి. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను కాపాడుతున్న కేసీఆర్ ప్రభుత్వం సామాజిక న్యాయం చేయదు. ఈ నాలుగు సంవత్సరాలలో కె.చంద్రశేఖరరావు పాలన దళితులు, ఆదివాసులకు వ్యతిరేకంగా ఫాసిస్టు పద్ధతులలో సాగింది.

కాంగ్రెస్, టీడీపీలు తమ పాలనలో లంబాడీ, ఆదివాసీల మధ్య వివక్ష పాటించి లంబాడీలకు లాభాలు చేకూర్చాయి. వీరి మధ్య వైరుధ్యాలను ఉపయోగించుకుని, ఓట్లు సంపాదించుకొని అధికారానికి వొచ్చే కుటిల ఎత్తుగడల వలన ప్రజల మధ్య తీవ్రమైన ఘర్షణకు దారితీసింది. లంబాడీల ప్రయోజనాలకు పెద్ద పీటవేస్తూ, తన బిడ్డ గెలవడానికి ఓట్లకోసం కాయిత లంబాడీల లాంటి వాళ్ళను ఆదివాసీల్లో కలపడానికి కేసీఆర్ ప్రయత్నిస్తున్నాడు.

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న ముస్లింలకు ఈ ప్రభుత్వం చేసింది ఏమిలేదు. ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ కోసం తెలంగాణ అసెంబ్లీలో ఆర్డినెన్స్ రూపొందించి కేంద్రానికి పంపింది. ఈలోగా హైకోర్టు ఈ ఆర్డినెన్స్‌ను కొట్టి వేసింది. ప్రభుత్వం చేసిన ఈ అరకొర నిర్వాకం వలన అప్పటికే అమల్లో ఉన్న 4శాతం రిజర్వేషన్ కూడా కోల్పోతామేమోనని ముస్లింలు భయాందోళనలో ఉన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, రాజకీయ పాలసీలను పూర్తిగా సమర్థిస్తున్నది. హిందూ మతోన్మాద ఫాసిస్టు చర్యలను సమర్థిస్తున్నది. రాష్ట్రంలో రోహిత్ వేముల సంఘటనలో బీజేపీకి సహకరించింది. కేసీఆర్ స్వయంగా యజ్ఞ, యాగాలు, వాస్తు లాంటి మూఢనమ్మకాలు, గురువుల సలహాలతో నడుచుకోవడం ద్వార రాష్ట్రంలో హిందూ మతోన్మాద చర్యలకు ఊతం కల్పిస్తున్నాడు.

చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలో మాట, పాట, సభలు అన్ని బందు అంటున్నాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రారంభించడంతో పాటు సరిహద్దు రాష్ట్రాల్లోకి తరచుగా గ్రేహౌండ్స్ బలగాలను పంపి ఆదివాసులపై దాడులు చేయడంతో పాటు ఎన్‌కౌంటర్లు జరిపిస్తున్నాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే ఆదిలాబాద్ నుండి చర్ల వరకు గ్రేహౌండ్స్ బలగాలను పంపి, దళాలపైన కాల్పులు జరిపించాడు. సమైఖ్య ఆంధ్ర పరిపాలన కంటే అధికంగా ఫాసిస్టు పరిపాలన చేస్తున్నాడు. విప్లవోద్యమంపై అప్రకటిత నిర్బంధాన్ని కొనసాగిస్తూ రాష్ట్రంలో బూటకపు ఎన్‌కౌంటర్లతో హత్యలు చేస్తున్నాడు. శ్రుతి, సాగర్, వివేక్ లాంటి విద్యావంతులైన తెలంగాణ బిడ్డలను బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేసాడు. ఛత్తీస్‌గఢ్‌లోకి చొచ్చుకొని వెళ్ళి గ్రేహౌండ్స్ బలగాలు బొట్టెం, పూజారి కాంకేర్‌లలో తెలంగాణ, డీకే విప్లవకారులను బూటకపు ఎన్‌కౌంటర్లతో పొట్టన బెట్టుకున్నాయి. అండర్ ట్రయిల్ ఖైదీలుగా ఉన్న వికారుద్దీన్‌తో సహా నలుగురిని కోర్టుకు తీసికెళ్ళే మార్గంలో బస్సులోనే తుపాకులతో కాల్చి చంపారు. హైదరాబాద్ లో 'ధర్నా చౌక్'ను ఎత్తేసి ప్రజల నిరసన గళాన్ని కూడా నొక్కేశాడు.

నరహంతక గ్యాంగ్‌స్టర్ నయీంను పెంచి పోషించిన పాలకులే షాబుద్దీన్ కేసులో అమిత్ షా వ్యవహారం బయటపడుతుందన్న భయంతో నయీంను హత్యచేసి, వాడు ఈ దందాలో కూడబెట్టిన ఆస్తులను స్వాహా చేసారు. ఇందులో కేసీఆర్‌ది కీలక పాత్ర

సెప్టెంబరు 2న కేసీఆర్ కొంగర్ కలాన్‌లో ప్రగతి నివేదన సభను 25 లక్షల మందితో నిర్వహించాలని భారీ కల కన్నాడు. ఆ సభకు అతిబలవంతంగా 5,6 లక్షల మంది ప్రజలు మాత్రమే రావడంతో అది తుస్సుమంది. 1990లో విప్లవోద్యమం వరంగల్‌లో నిర్వహించిన రైతుకూలీ మహాసభలకు వచ్చిన ప్రజలతో పోలిస్తే సగం కూడాలేరని

ప్రజలు చెప్పుకుంటున్నారు. ఆ కల విఫలమైనట్లే. కొన్ని నెలల క్రిందట ఫెడరల్ ఫ్రంట్ అనే బీజేపీ అనుకూల రాజకీయ విన్యాసం అనే మరో కల కూడా కేసీఆర్ పట్ల దేశంలో ఉన్న అవిశ్వాసం కారణంగా అచరణరూపం దాల్చలేక కొట్టుమిట్టాడుతుంది.

అధికారానికి రాగానే పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాడు. ప్రభుత్వ పాలసీలను, పాలనను వ్యతిరేకించి, నిరసనలు కొనసాగించే అన్ని వర్గాల ప్రజలపైన నిషేధాజ్ఞలు, అరెస్టులు, చిత్రహింసలు కేసులు పెట్టి జైళ్లలో బంధించాడు. ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు, హక్కుల నాయకులు, ప్రజాస్వామిక నాయకులను, మేధావులను, విరసం నేతలను మావోయిస్టు ముద్రలు వేసి, అక్రమ కేసులు బనాయించి జైళ్లలో బంధించాడు. మీటింగ్స్ పెట్టవద్దని మాటి మాటికి సెక్షన్ 144ను, సెక్షన్ 151, సెక్షన్ 30లను విధిస్తున్నాడు.

పది జిల్లాల తెలంగాణను 31 జిల్లాలుగా పెంచాడు. ప్రభుత్వ శాసనాన్ని బందోబస్తుగా చేసి ప్రజలపై కంట్రోల్ తెచ్చుకోవడానికి ఈ విభజనను ఉపయోగించుకుంటున్నాడు. ఒకే రోజు తెలంగాణ అంతా నిర్వహించిన కుటుంబ సర్వే, భూసర్వే లాంటి విధానాల ద్వారా బలమైన అడ్మినిస్ట్రేషన్‌ను తయారు చేసుకుంటున్నాడు. ఇవన్నీ పాలకవర్గాలు తమ ఫాసిస్టు పాలన కొనసాగించడానికి అనువైన విధానాలుగా చేసుకుంటున్నవే. కమాండ్, కంట్రోల్ ద్వారా జన జీవితాన్ని పోలీసు బాసుల చేతిలో పెట్టాడు. ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాన్ని హరించి వేశాడు. 50 వేల కోట్ల రూపాయలకు పైగా మిగులుతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించగా, ఈ నాలుగు ఏండ్ల కేసీఆర్ అవినీతి పాలనా కాలంలో అస్తవ్యస్థ ఆర్థిక విధానాలతో రాష్ట్ర అప్పు 2018 మార్చి నాటికి ఒక లక్షా 83వేల కోట్లకు చేరింది. ఆర్థిక అరాచకత్వం మీద కాగ్ కూడా ప్రభుత్వంపై అక్షింతలు వేసింది. ఈ ఆర్థిక భారమంతా నూతన తెలంగాణ రాష్ట్ర ప్రజలు మోయాల్సిందే.

1969 నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి చెన్నారెడ్డి విద్రోహం చేసాడు. మలిదశ ఉద్యమం సాధించిన విజయాల్ని ప్రజాద్రోహి కేసీఆర్ వ్యక్తిగత విజయంగా మార్చుకుని స్వప్రయోజనాలకు వాడుకుంటున్నాడు. మొదటి నుండి సీపీఐ (మావోయిస్టు) ప్రజాస్వామిక తెలంగాణా పట్ల స్పష్టమైన అవగాహనతో కృషి చేస్తున్నది. కోదండరాం లాంటి వారికి భ్రమలు చాలాకాలం కొనసాగాయి. మన పార్టీ మొదటి నుండి కేసీఆర్ లాబీయింగ్ రాజకీయాలను ఎండగడుతూ ఉన్నది. ప్రజాస్వామిక తెలంగాణా ఉద్యమం కొనసాగిస్తూనే ఉన్నది. కేసీఆర్ 4 సం॥ నియంతృత్వ పాలన మధ్యతరగతిలో మిగిలి ఉన్న భ్రమల్ని పూర్తిగా తొలగించింది. గతం నుండి ప్రజాస్వామిక తెలంగాణ కేంద్ర నినాదంగా మనం చేపట్టిన ఉద్యమం రాజకీయంగా ప్రజల్లో విశ్వాసాన్ని నింపింది.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని ఎక్కువ కాలం పాలించింది. సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వాముల కొమ్ముగాసే ఈ పార్టీ పేదలకు వ్యతిరేకమైనది. ప్రజా ఉద్యమాలను అణచడంలో ముందు భాగాన ఉంది. విప్లవకారులను బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేసింది. తెలంగాణ ప్రజల పోరాట తెగువ చూసి, దిక్కులేని స్థితిలో చివరలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పరిచింది. అతివిశ్వాసం, నాయకత్వం మధ్య కుమ్ములాటలు కారణంగా 2014 ఎన్నికల్లో ఓడిపోయింది. నూతన రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ రాష్ట్రంలో అధికారానికి దగ్గర కాలేకపోతున్నది. అందుకు టీడీపీ, సీపీఐ, తెలంగాణ జనసమితులతో కలిసి మహాకూటమిని ఏర్పాటు చేసింది. ఈ పార్టీ కూటమి అధికారానికి వచ్చినప్పటికీ ప్రజలకు ఒరిగేదేమి ఉండదు. ఉద్యమకాలం నాటి ప్రజా డిమాండ్లను ఈ పార్టీ ఏ రోజు ఖాతరు చేయలేదు. రాష్ట్రంలో ప్రతిపక్షంగా తన బాధ్యతను విస్మరించింది.

బీజేపీ రాష్ట్రంలో అధికారమే మా లక్ష్యం అంటూ ఎప్పటినుండో సన్నాహాలు చేసుకుంటున్నది. బీజేపీ నాయకులైన మోడీ, అమిత్‌షాలు రచించిన వ్యూహంలో భాగంగా తదుపరి అధికార సాధన కొరకు కేంద్రీకరించిన రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంది. అయితే రేపు కేంద్రంలో టీఆర్ఎస్ సహకారం అక్కరకు రావచ్చు అనే వ్యూహంతో టిఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంతో పని చేస్తున్నది. రాష్ట్ర ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని ప్రకటించింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అణచివేస్తున్నది. రాష్ట్రంలో ప్రజాస్వామికవాది, విప్లవ రచయిత వరవరరావుతో పాటు దేశ వ్యాపితంగా హక్కుల కార్యకర్తలను 'అర్బన్‌నక్సల్స్' పేరున అరెస్టులు చేస్తున్నది. 'సమాధాన్' పేరుతో ఆదివాసీలను, విప్లవకారులను హత్య చేస్తున్నది. దేశంలో ప్రజాస్వామిక మేధావులను, రచయితలను హత్యలు చేస్తుంది. ఆదివాసులు, దళితులు, మైనారిటీలు, మహిళలకు వ్యతిరేకంగా దాడులు, హత్యలు గావిస్తుంది. బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదాన్ని ప్రేరేపిస్తుంది. నవభారత నిర్మాణం పేరుతో సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారీ, బడా భూస్వామ్య వర్గాలకు సేవ చేస్తున్నది.

తెలుగు ప్రజల ఆత్మగౌరవం అంటూ అధికారానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంకుకు తెగనమ్మింది. సమైఖ్య ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో విపరీతమైన హత్యకాండ కొనసాగించింది. ఇప్పుడు ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని రాంగూడ గ్రామం దగ్గర 31 మంది విప్లవకారులను హత్య చేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంపై నిర్బంధాన్ని కొనసాగించింది. తన రెండు కళ్ళ సిద్ధాంతంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అడ్డం తగిలింది. ప్రస్తుతం తెలంగాణలో తన బలం తగ్గిపోయి తన ఆజన్మ శతృవైన కాంగ్రెస్‌తో జతకట్టి ఎన్నికల్లో పాల్గొంటున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా పేరుతో నాటకాలు ఆడుతూ ప్రజల ఓట్లు సంపాదించడానికి పడరాని పాట్లు పడుతుంది.

సీపీఎం పార్టీ మొదటి నుండి భాషా ప్రయుక్త రాష్ట్రం పేరిట తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించింది. కొత్తగా తెలంగాణ రాష్ట్రంలో తన బలాన్ని పెంచుకొనడానికి పాదయాత్రలకు, జన సమీకరణలకు పూనుకొన్నది. బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ (బిఎల్ఎఫ్) అనే సంస్థను నిర్మించి దళిత, వెనుకబడిన తరగతుల ఓట్లకోసం ప్రయత్నిస్తున్నది. లాల్-నీల్ జండా పేరుతో అంబేద్కర్ భావజాలం ప్రభావంతో ఉన్నవారిని, దళిత, అంబేద్కర్ సంఘాలను కలుపుకొని రావడానికి కృషి చేస్తున్నది. ఈ పార్టీ రివిజనిస్టు రాజకీయాలతో అట్టడుగు వర్గాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నది. బెంగాల్‌లో, త్రిపురలో

అధికారాన్ని కోల్పోయి కోలుకోలేని స్థితిలోకి చేరింది.

సీపీఐ రివిజనిస్టు రాజకీయాల్లో తలపండింది. అది ఎప్పుడు కాంగ్రెస్ పార్టీ తోకగానే వ్యవహరిస్తుంది. కాంగ్రెస్‌తో కలిసి మహాకూటమిలో చేరింది. బస్తర్‌లో తన అభ్యర్థినీ గెలిపించుకొనే లక్ష్యంతో మావోయిస్టు పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నది. జనతన సర్కార్ నిర్మించుకొని తమ స్వయం ప్రతిపత్తిని నిలబెట్టుకొంటున్న ఆదివాసీల పోరాటాలను వ్యతిరేకిస్తున్నది. ఈ పార్టీలు కేంద్రంలో పాలకవర్గాల్లో ఏదోఒక ముఠాతో అంటకాగి, భారత పాలకవర్గాలు సంక్షోభం నుండి బయటపడటానికి దోహదం చేస్తున్నాయి.

భౌగోళిక తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమ శక్తులలో చాలా మంది టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోగా, కోదండరాం నాయకత్వంలో జెఏసిలో ఒక భాగం అధికారంలో భాగస్వామ్యం తీసుకోకుండా బయట ఉండిపోయింది. ఈ శక్తులు ఇప్పుడు కొత్తగా టీజేఎస్ (తెలంగాణ జనసమితి) పేరిట ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. వీరు టీఆర్ఎస్ విధానాలను వ్యతిరేకిస్తున్నట్లుగా చెబుతున్నారు. టీజేఎస్ నాయకుడు కోందండరాం కాంగ్రెస్ రాజకీయాలకు అనుకూలంగా ప్రస్తుతం ఎన్నికల ద్వారా పార్లమెంటరీ విధానంలో భాగస్వామి కావాలనుకుంటున్నాడు. ఈయన కొన్ని ఉద్యమ శక్తులను పాలకవర్గాల్లో కోఆప్ట్ చేయబోతున్నాడు. ఈ పార్టీ అంతిమంగా కాంగ్రెస్‌తో ఐక్యం కావడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం తెలంగాణ జనసమితి కాంగ్రెస్ ఏర్పాటు చేసిన మహాకూటమిలో చేరింది. ఇలా భౌగోళిక తెలంగాణ కోసం పోరాడిన శక్తులు పార్లమెంటరీ రాజకీయాల్లో కోఆప్ట్ అవుతున్నారు.

***ప్రియమైన ప్రజలారా!***

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాలుగు సంవత్సరాల్లోనే ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కేస్తున్నారు. బూర్జువా పార్టీల మధ్య అధికార కుమ్ములాటలే ప్రధానంగా జరుగుతున్నాయి. అందులో ప్రజల ఆకాంక్షలు, తెలంగాణ అభివృద్ధి మరుగున పడిపోయింది. 50 ఏళ్ళుగా తెలంగాణ కోసం విద్యార్థులు, యువజనులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, కార్మికులు, కర్షకులు, కవులు, కళాకారులతోపాటు యావత్తు ప్రజానీకం పోరాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు బూర్జువా వర్గం చేసిన ద్రోహాన్ని బహిర్గతం చేయాలి. నేడు దోపిడీవర్గ పార్టీలు (టీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ) తెలంగాణ రాష్ట్ర వనరులను కొల్లగొట్టి సామ్రాజ్యవాదులకు దారాధత్తం చేయడాన్ని వ్యతిరేకించాలి. బడా భూస్వాములు, దళారీ నిరంకుశ బూర్జువా వర్గం, రాష్ట్రంలో కొనసాగిస్తున్న దోపిడీ పీడనలను వ్యతిరేకించాలి.

మావోయిస్టు పార్టీ కింద ప్రజలు పోరాడి సాధించుకున్న భూములను మళ్ళీ భూస్వాములు లాక్కోవడం, కార్మికులపై అధిక శ్రమ భారాలు వేయడం, విద్యావ్యవస్థను పూర్తిగా ప్రైవేటీకరణ చేయడం, తెలంగాణ సమాజాన్ని మళ్ళీ విస్తృత అణచివేత, దోపిడీకి గురిచేస్తున్న దోపిడీవర్గ పార్టీలను వ్యతిరేకించాలి. ప్రజలకు ఎన్నికల ద్వారా న్యాయం జరగదనీ, గత 70 ఏళ్ళుగా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ, ప్రజల సమస్యలు ఏవి పరిష్కరించకపోగా, బూర్జువా పార్టీల నాయకులు ధనవంతులుగా మారిపోయిన వాస్తవాన్ని బయటపెట్టాలి. బూటకపు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలి. ప్రజాస్వామిక తెలంగాణ కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు కదలాలి.

దళితులు సామాజిక న్యాయం కోసం పోరాడటం ద్వారానే వారికి ఆత్మగౌరవం లభించింది. ఆదివాసీలు ఉద్యమ కదనరంగాన పురోగమించడం ద్వారానే వారి హక్కులు కాపాడబడినాయి. ప్రజలు అనన్య త్యాగాలతో సాధించుకున్న విజయాలను ఈ పాలకవర్గాలు అధికారంలోకి వచ్చి అణగద్రొక్కుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటంలోకి రావాలి. అందుకు ప్రజలు ఎక్కడికక్కడ సంఘటితం కావాలి, ఉద్యమాలు చేపట్టాలి. సంఘటితమవ్వడం ద్వారానే విజయాలు సాధించగలరు. బూర్జువా, పెటీ బూర్జువా, రివిజనిస్టు పార్టీల ప్రభావం నుండి బయటకు రావాలి. ప్రజలు స్వతంత్ర కార్యాచరణకు పూనుకోవాలి. ప్రజాస్వామిక తెలంగాణ కోసం ప్రజలందరూ ఐక్యంగా మిలిటెంట్ ఆందోళనలు చేపట్టి పోరాడాలి.

***ప్రియమైన ప్రజలారా!***

మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ఎజెండాను దూకుడుగా తీసుకొని పోవడం ద్వారా దేశ ఆర్థిక పరిస్థితి ఘోరంగా వుంది.

నోట్ల రద్దు, జీఎస్‌టీ లాంటి నిర్ణయాలతో సామాన్య ప్రజలపై పెనుభారం పడింది. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయి. రూపాయివిలువ ఘోరంగా పడిపోయింది. డాలర్‌తో రూపాయి మారకంలో వ్యత్యాసం రోజురోజుకు పెరిగి అది ఒక డాలర్‌కు 74 రూ॥గా ఉంది. ప్రజలపై మోయరాని ఆర్థికభారం పెరిగింది. ఈ ప్రజా వ్యతిరేక విధానాల వలన ప్రజల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఈ పరిణామాలతో మోడీ రాజకీయ ప్రభావం దేశంలో క్రమంగా తగ్గుతోంది.

ప్రపంచంలో సామ్రాజ్యవాదం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో వుంది. 2008 ప్రారంభమైన ఆర్థిక, ద్రవ్య సంక్షోభం సామ్రాజ్యవాద దేశాలను అతలాకుతలం చేస్తున్నది. ఈ సంక్షోభం నుండి బయటపడటానికి భారతదేశం వంటి దేశాలపై ఆ సంక్షోభ భారాన్ని వేయడానికి సామ్రాజ్యవాదులు అనేక నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నారు. దాని ఫలితంగా భారత పాలకవర్గాలు ప్రజలను, దేశ వనరులను కొళ్ళగొట్టడానికి తీవ్ర దోపిడీ విధానాలను అమలు చేయడంతో పాటు తీవ్ర ఫాసిస్టు నిర్బంధాన్ని కొనసాగిస్తున్నాయి. పాలకవర్గాల మధ్య అధికార కుమ్ములాటలు కూడా పెరుగుతున్నాయి. ఈ కారణాలు అన్ని దేశంలో విప్లవ పరిస్థితులు పెరగడానికి దోహదం చేస్తున్నాయి. సామ్రాజ్యవాదుల దన్నుతో పాలకవర్గ పార్టీలు దేశంలో అమలు చేసిన నూతన ఆర్థిక సంస్కరణలు ప్రజలకు దిన దినం గుదిబండగా మారాయి. భ్రమల్లో చిక్కుకున్న మధ్య తరగతి కూడా అసంతృప్తిగా వుంది. అన్ని వర్గాలు, సెక్షన్లు తీవ్ర అసంతృప్తిలో ఉన్న ఈ సమయంలో "వివిధ రంగాలకు చెందిన ప్రజలను సంఘటితం చేయడం" ప్రధాన కర్తవ్యంగా స్వీకరించాలి. ఈ రాజకీయ క్యాంపెయిన్‌లో పాలక వర్గాలను బహిర్గత పర్చాలి." "ప్రజాస్వామిక తెలంగాణ" కోసం ప్రజల్ని సమీకరించాలి.

ప్రజలంతా ఐక్యంగా పాలకవర్గాలకు–పార్లమెంటరీ పార్టీలకు వ్యతిరేకంగా పోరాడాలి. ఎన్నికలను బహిష్కరించాలి. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలి. ✦

# హిట్లర్, ముస్సోలినిల సరసన మోడీ దుష్ట పాలన
# సంఘ్ పరివార్ శక్తుల "రామరాజ్య" పాలనతో శంభూకుల హత్యలు

మోదీ పాలనలో దేశం సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ధ్వంసమయింది. పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి, పెట్రోల్ ధరల పెంపు, కుంభకోణాలు, బ్యాంకుల లూటీలు, వ్యవసాయ సంక్షోభం కారణంగా రైతాంగ ఆత్మహత్యలు, విప్లవ కారుల, హేతువాదుల, దళితులు ఆదివాసులు, మైనార్టీల, మహిళల హత్యలు, కాశ్మీర్ ప్రజల హత్యలు తదితర అంశాలు దేశ ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. బీ.జే.పి. గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. దీంతో ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. ఈ సమస్యలను పక్క దారి పట్టించడానికి అయోధ్యలో రామమందిరం, ట్రిపుల్ తలాక్, అర్బన్ నక్సల్స్ అనే అంశాలను ముందుకు తెస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక కార్మిక చట్టాలకు తూట్లు పొడిచింది. కుంభకోణాల్లో బీ.జే.పి.గత కాంగ్రెస్‌ను మించిపోతున్నది. దేశ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా రాఫెల్ వెలుగుచూస్తుంది. వేల కోట్ల రూపాయల బ్యాంకు కుంభకోణాల్లో నేరస్థులు నీరవ్‌మోదీ, లలిత్‌మోదీ, విజయ్‌మాల్యాలను విదేశాలకు సాదరంగా పంపించారు. డాలర్‌తో పోల్చినపుడు రూపాయి విలువ నానాటికి పడిపోతున్నది. జాతిని, మతాన్ని బీ.జే.పి. రెచ్చగొడుతున్నది. మతం కులం పేరిట దేశంలో మూక దాడులు కొనసాగిస్తున్నది.

2014లో అధికారాన్ని చేపట్టిన వెంటనే బీజేపి, సంఘ్‌పరివార్‌లు రాజ్యాంగంపై బహుముఖ దాడులకు దిగాయి. లౌకికం అన్న మాట తొలిగించాలని ప్రకటించారు. భరించలేని అసహనహంతో బ్రాహ్మణిజం ఊగిపోతున్నది. ప్రపంచ ప్రజల శత్రువు అమెరికా సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అయిన బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదులు తమ బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు రాజ్యాన్ని స్థాపించే లక్ష్యంతో బూటకపు దేశభక్తిని సృష్టించి రెచ్చగొడుతున్నది. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, బడా భూస్వామ్యం దేశంలో అగ్రకుల బ్రాహ్మణీయ హిందూ భావజాలంతో కొనసాగిస్తున్న దోపిడీకి నియంతృత్వానికి రాజకీయ ముఖంగా బీజేపి అధికారంలో ఉంది. అఖండ భారతం అనే సిద్ధాంతం ద్వారా దేశీయ వైవిద్యాలను, భిన్నత్వాలను కౄరంగా అణచివేస్తున్నది. 'నవభారత నిర్మాణం' పేరుతో హిందూ రాజ్యస్థాపనకు పథకాలు కొనసాగిస్తున్నది.

ప్రపంచాన్ని సర్వ నాశనం చేసిన జాత్యహంకారి హిట్లర్ స్ఫూర్తితో సాగుతున్న హిందూ ఫాసిస్టుల పాలన తన లక్ష్యాలను ఇక ఎంత మాత్రము రహస్యంగా ఉంచదలచుకోలేదు. రాజకీయ శత్రువులుగా మావోయిస్టులను, ప్రజాస్వామిక వాదులను, లౌకిక వాదులను మరియు సామాజిక వర్గాలైన ముస్లీంలు, క్రైస్తవులు, ఆదివాసులు, దళితులు, మహిళలను ప్రకటించి హత్యలు చేస్తున్నది. బ్రాహ్మణీయ సంస్కృతికి అడ్డుగా వున్న శ్రామిక వర్గ పీడిత ప్రజా సమూహాల సంస్కృతిని ధ్వంసం చేస్తూ బ్రాహ్మణీయ హిందూ సంస్కృతిని ప్రవేశ పెడుతున్నారు. బ్రాహ్మణీయు హిందూయిజం అనేది స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు గొడ్డలిపెట్టు. భిన్నాభిప్రాయాన్ని భరించలేనంత అసహనంతో గోవింద్ పన్సారే, కల్బుర్గీ, దబోల్కర్, గౌరీలంకేశ్‌లను హత్య గావించారు.

బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదం ఎల్‌కేజీ పిల్లవాని పాఠ్యపుస్తకాల్లోకి ప్రవేశించింది. విశ్వవిద్యాలయాల్లోకి ప్రవేశించింది. పీడిత ప్రజల సంస్కృతిలోకి ప్రవేశించింది. తినే తిండిలోకి, కట్టు బొట్టులోకి, ఆడపిల్లల దుస్తుల్లోకి ప్రవేశించింది. అందుకే అణచివేతకు గురవుతున్న పీడిత సమూహాలన్నీ పోరాడాలి. అవి వర్గ పోరాటం కొనసాగించాలి.

వర్గాలు ఏర్పడ్డప్పట్టి నుండి వర్గ పోరాటాలు చేస్తూనే అభివృద్ధి నిరోధకమైన దాన్ని ధ్వంసం చేస్తూ అభివృద్ధి కరమైన దాన్ని నిర్మిస్తూ మానవ జాతి వికాసం చెందుతూ వస్తున్నది. అందుకే కారల్ మార్క్స్ "మానవ జాతి చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర" అని చెప్పాడు. పోరాడలేని జీవులు, జాతులు, ప్రజలు మనుగడ సాగించలేవని, నశిస్తాయని చరిత్ర మనకు చెపుతున్నది.

**ఈ నాలుగు సంవత్సరాల మోదీ పాలన గురించి మరింత వివరంగా చూద్దాం:**

మోడీ నాలుగేళ్ళ పాలన సంబరాలను అట్టహాసంగా జరుపుకున్నాడు. పేదల పక్షపాతిగా ఎన్నో విజయాలను సాధించినట్టుగా తన పాలన గురించి ప్రచారం చేసుకున్నాడు. మోడీ ప్రచారానికే ప్రజల సొమ్ము 4 వేల కోట్ల రూపాయలు పైగా ఖర్చు చేసారు. ధనికులను మరింత ధనికులుగా చేసే అభివృద్ధి నామూనాను మోదీ కొసాగించాడు. పారిశ్రామిక ప్రగతి సాధిస్తానని, స్వచ్ఛమైన పాలన అందిస్తానని, "సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్" అని ప్రగల్బాలు పలికాడు. నాలుగేళ్ళ తర్వాత ఈ వాగ్ధానాలలో ఏ ఒక్కటి అమలు కాలేదు. దేశ సర్వభౌమత్వాన్ని అమెరికా సామ్రాజ్య వాదులకు తాకట్టు పెట్టి దక్షిణాసియాలో అమెరికా దోపిడీ ప్రయోజనాలను నెరవేర్చే నమ్మకమైన ఏజెంటుగా పనిచేస్తున్నాడు. కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని పూర్తిగా కుదువపెట్టాడు. మోదీ నాలుగేళ్ళ పాలనలో ముస్లీంలు, దళితులు, ఆదివాసులు, మహిళలు, ప్రజాస్వామికవాదులు, హేతువాదులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు హత్యలకు గురయ్యారు. మావోయిస్టులను నిర్మూలించే లక్ష్యంతో "సమాధాన్" పేరుతోమోడీ బూటకపు ఎన్‌కౌంటర్స్, హత్యలు కొనసాగిస్తున్నారు.

ఎన్నికల సమయంలో తనకు ఉదారంగా సహాయం చేసిన కార్పొరేట్ శక్తులు అపరిమితంగా దేశాన్ని దోచుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తున్నది. పర్యావరణాన్ని నాశనం చేస్తుంటే చూసి చూడనట్లు మిన్నకుంది. లక్షల కోట్ల రుణబకాయిలు (పారుబకాయిలు) వసూలు కాకపోతే వాటిని రద్దు చేసింది. విదేశీ పెట్టుబడిదారులకు ఎర్రతీవాసి పరిచి ఆహ్వానించింది. నయా ఉదారవాద విధానాలకు కట్టుబడి ఉంది. రక్షణ రంగం లాంటి సున్నితమైన రంగాలలో కూడా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అనుమతించబడింది.

భారత దేశంలో ఒక శాతంగా ఉన్న ధనవంతుల చేతుల్లో 73 శాతం ప్రజల సంపదకు సమానమైన సంపద పోగుబడి ఉంది. ఒక్క సంవత్సరంలోనే వీరి సంపద 21 లక్షల కోట్ల రూపాయలు పెరిగింది. ఒక సంవత్సరంలోనే దేశంలో 17 మంది కొత్తగా శతకోటీశ్వర్లు (బిలియనీర్లు) పెరిగారు. దీనితో దేశంలో బిలియనీర్ల సంఖ్య 101కి పెరిగింది. 67 కోట్ల మంది పేదల సంపద కేవలం ఒక శాతం మాత్రమే

పెరిగిందని పేర్కొన్నది. ఇలా కార్పొరేట్ రంగం విస్తృతంగా విస్తరిస్తూ ప్రజల ప్రయోజనాలను నిర్మూలిస్తున్నది. భూమి, నీరు, సహజ వాయువు, చమురు, ఖనిజాలపై కార్పొరేట్ రంగం నియంత్రణ చేస్తున్నది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఝార్ఖండ్ మొదలైన రాష్ట్రాలలో ఖనిజాలు, చమురు నిక్షేపాలు కార్పొరేట్ రంగం చేతులోకి వెళ్లిపోతున్నాయి. అంబాని, ఆదానీ, వేదాంత మొదలైన కార్పొరేట్ సంస్థలకు పూర్తి అనుకూలంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

కార్పొరేట్ల లాభాల కోసం చేపట్టిన నోట్ల రద్దు, జి.ఎస్.టి మూలంగా ఆర్థిక వ్యవస్థ కుదేలైపోయింది. లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. వేలాది చిన్నపరిశ్రమలు మూత పడ్డాయి. నోట్ల రద్దు వందమందికి పైగా ప్రజల ప్రాణాలను హరించింది. వేలాది కుటుంబాల ఆర్థిక పరిస్థితిని అస్థవ్యస్థం చేసింది. చాలా మంది ఆర్థిక వేత్తలు చూపించినట్లు నోట్ల రద్దు స్థూల జాతియోత్పత్తిని 2 శాతం దిగజార్చింది. పారిశ్రామిక వస్తు ఉత్పత్తి రంగ అభివృద్ధి 7.9 శాతం నుండి. 4.6శాతం తగ్గిపోయింది.

పరోక్ష పన్నుల వ్యవస్థలో గొప్ప సంస్కరణ అని చెప్పి తీసుకవచ్చిన జి.ఎస్.టి. ఉపాధి కల్పనకు చోధక శక్తిగా వున్న చిన్న, మధ్య తరహా వ్యాపారాలను చావుదెబ్బకొట్టింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ.లు) భారత దేశ చిల్లర వ్యాపారంలో ప్రవేశించి దేశీయ వాణిజ్యాన్ని హస్తగతం చేసుకోవడం వల్ల మన జనాభాలో సుమారు 5వ వంతు జనాభా నష్ట పోతున్నది. దేశంలో చిల్లర వ్యాపారం నాలుగు కోట్ల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నది. దేశీయ వనరులను మున్నెన్నడు ఎరుగని రీతిలో కొల్లగొడుతున్నారు. క్రోని క్యాపిటలిజం (అశ్రిత పెట్టుబడిదారి విధానం) పెత్తనం చలాయిస్తున్నది.

మోడీ నాలుగేళ్ళ పాలనలో దేశ అభివృద్ధికి మూలస్తంభంగా ఉన్న వ్యవసాయ రంగం మూలనపడింది. సంక్షోభంలో కూరుకుపోయింది. వ్యవసాయ రుణాలు బంద్ చేయబడ్డాయి. గిట్టుబాటు ధరలు లేవు. దీనితో రైతాంగం తాము పండించిన పంటలను తావే తగులబెడుతున్నారు. రోడ్ల మీద పారేస్తున్నారు. మార్కెట్లలో వదిలేసి వెళుతున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాలలో పూర్తి స్థాయి రుణమాఫీ కోసం, కనీసం గిట్టుబాటు ధరలు, ఉచిత కరెంట్ తదితర డిమాండ్ల కోసం పోరాడుతున్నారు. రైతాంగపు బతుకులు దుర్భరంగా మారడంతో రెండు సంవత్సరాల నుండి రైతాంగం సమరశీల పోరాటాలు సాగిస్తున్నది. మార్చి 1న మహారాష్ట్రలోని నాసిక్ నుండి మొదలయి 12న ముంబాయి చేరిన 180 కి.మీ.లు లక్షకు పైగా రైతుకూలీల, ఆదివాసుల లాంగ్‌మార్చ్, అలాగే ఢిల్లీలో సెప్టెంబర్‌లో 70 వేల మందితో జరిగిన రైతుల ర్యాలీ, నవంబర్‌లో మనోసారి ముంబాయిలో జరిగిన 2 రోజుల ఆదివాసీ రైతాంగ ప్రదర్శన దేశంలోని రైతాంగాన్ని మరో సమరశీల ఉద్యమానికి కదిలిస్తున్నది. సంఘటితం చేస్తున్నది.

ఆహార భద్రత–2017 ప్రపంచ ఆకలిసూచి ప్రకారం 119 దేశాలలో భారతదేశం 100వ సాన్థంలో ఉంది. ఒక్కో కుటుంబానికి సబ్సిడీ ధరలపై నెలకు 35 కేజీల ఆహార ధాన్యాలను సరఫరా చేయడానికి బదులు ,ఈ చట్టం ఒక్కో వ్యక్తికి 5 కేజీలకే పరిమితం చేసింది. డిజిటలైజేషన్ పేరుతో, రేషన్ కార్డులను లక్షల సంఖ్యలో తొలగించారు. పెద్ద సంఖ్యలో కుటుంబాలు కార్డులు కోల్పోయి, రేషన్ పొందలేకపోతున్నారు.

**ఆరోగ్యం పేరుతో అనారోగ్యాలు:**

ఈ నాలుగేళ్ళ పాలనలో మోడీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ అనే స్కీమును ప్రకటించింది. స్వచ్ఛభారత్ అంటే ఆరోగ్యవంతమైన భారత్, సమృద్ధ భారత్ అంటే సౌభాగ్యవంతమైన భారత్ అని ప్రకటించారు. కాని మోదీ మాయమాటలకు అందమైన ఊహలకు వాస్తవానికి పొంతనలేదు. ఆరోగ్యరంగానికి బడ్జెట్‌లో కేటాయించినది మొత్తం జీడీపీలో 1.4శాతం మాత్రమే. దానిలో కేంద్రం వాటా కేవలం 0.3 శాతమే. మిగతాదంతా రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తున్నాయి.

తల్లి బిడ్డల ఆరోగ్యపథకానికి 30 శాతం, అంటువ్యాధుల నివారణకు 27 శాతం, గర్భిణీ స్త్రీలకు 7.5 శాతం, జిల్లా ఆసుపత్రులకు 12శాతం, నిధులు చొప్పున తగ్గించారు. బీజేపీ నేతృత్యంలోని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇదే దారిలో నడుస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పరిరక్షణ పథకానికి 50 కోట్ల పేదప్రజలకు 5 లక్షల రూపాయల వరకు ఆరోగ్యభీమా లభిస్తుందని మోడీ ప్రకటించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ పథకానికి కేవలం 2000కోట్లను మాత్రమే కేటాయించారు. ఈ పథకం వల్ల లాభపడేది అత్యధికంగా ప్రైవేట్ ఆస్పత్రులు, ఇన్సురెన్స్ కంపెనీలు మాత్రమే. ఈ పేరుతో పేషెంట్లకు అవసరానికి మించిన చికిత్సలు చేస్తారు. అధిక ఛార్జీలు వసూలుచేస్తారు. ఈ పథకాలన్నీ ఉన్నప్పటికి ప్రజలు ఆరోగ్యంపై స్వంతంగా పెట్టే ఖర్చు పెరిగింది తప్ప తగ్గలేదు.

**పెరుగుతున్న నిరుద్యోగ సైన్యం**

2014సాధారణ ఎన్నికల ప్రచారంలో రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మోడీ చేసిన వాగ్దానం మోడీకి పెద్ద ఎత్తున ప్రజల మద్దతును చేకూర్చి పెట్టింది. కానీ ఈ నాలుగేళ్ళ పాలనలో ఈ విషయంలో అత్యంత దారుణంగా విఫలమైంది. ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టింది. అంతర్జాతీయ కార్మికసంస్థ ప్రకారం 2017 వరకు మన దేశంలో 10.83కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారు. 2019 నాటికి ఈ సంఖ్య 1.89 కోట్లు అదనంగా పెరుగుతుంది. మేకిన్ ఇండియా పేరిట స్వదేశంలో తయారయ్యే వస్తువులకు పెద్దపీట వేస్తున్నట్లుగా డంబాచార ప్రచారం చేస్తున్నారు. రైల్వేలో లక్ష ఉద్యోగ ఖాళీలున్నాయని ప్రకటిస్తే రెండు కోట్ల ధరఖాస్తులు వచ్చిచేరాయి. అనేక పరిశ్రమలు, సేవారంగాలలో గిరాకి లేక కార్మికులను ఇంటికి పంపిస్తున్నారు. ఇందులో టెలికం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, లోహాలు, చర్మ ఉత్పత్తులు, ఆభరణాలు, ఆటోమొబైల్స్ మొదలైన రంగాలలో ఉద్యోగ అవకాశాలు పూర్తిగా తగ్గిపోతున్నాయి. నాలుగేండ్లలో మోడీ 40 దేశాలు తిరిగి భారత్‌లో పెట్టుబడులు పెట్టండని దేవురించినా పెట్టుబడులు రాలేదు. మేక్‌ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి పథకాలు ద్వారా ఉపాధి అవకాశాలు ఉంటాయని ఊదరగొట్టినా ఉపాధి అవకాశాలు రాలేదు. నిరుద్యోగ యువతకు పోరాటమే నిజమైన మార్గం.

**ఉద్యోగాలు కోల్పోతున్న కార్మికులు. కార్మిక హక్కులకు తూట్లు**

నిజ వేతనాలు తగ్గుతున్నాయి. క్రమబద్ధమైన పనులు కాంట్రాక్టు పనులుగా మారుతున్నాయి. ప్రభుత్వం కార్మిక చట్టాలను ధ్వంసం చేస్తుంది. ప్రభుత్వరంగం ప్రైవేటీకరిచబడింది. కార్మికులలో మహిళల శాతం గణనీయంగా తగ్గింది. కార్మికులను బెదిరించడానికి నిరుద్యోగ సైన్యాన్ని సిద్ధంగా ఉంచుతుంది. పెట్టుబడిదారులకు అనువైన

వాతావరణం కల్పిస్తున్నది. పెద్దపెద్ద కార్మిక సమ్మెలు జరిగినా కనీసం వేతనం18 వేలకు పెంచడానికి ఒప్పుకోలేదు. చాలామందికి కనీస వేతనం 10 వేలలోపు మాత్రమే ఉండిపోతున్నది. ఇప్పుడు ప్రభుత్వ సంస్థలలో మూడోవంతు కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలోనే పని చేస్తున్నారు. స్టీల్, కోల్, గ్యాస్, టెలికాం, పోర్ట్, డాక్, వస్త్రరంగాలలో, తోటలలో, సమాచార శాఖలలోని ప్రైవేట్ రంగంలో 40శాతం నుండి 60శాతం కాంట్రాక్టు కార్మికులను నియమించుకుంటున్నది. 2016లో సుప్రీం కోర్టు కాంట్రాక్టు పనివారికి కూడా పర్మినెంట్ కార్మికులతో సరిసమాన వేతనాలు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నా కూడా ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేదు. మన దేశంలో 93 శాతం అసంఘటిత కార్మికులు వున్నారు. వీరు నిర్మాణరంగంలోనూ, రవాణారంగం, హోటల్‌లలో ఇంటి పనులలో ఉన్నారు. వారి జీతాలు దయనీయంగా ఉన్నాయి. జీవన పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి. వీరిలో అత్యధికులు వలస కార్మికులు. గ్రామాలలో వ్యవసాయ సంక్షోభం కారణంగా పనులు లేక ఉపాధికరువై పొట్టచేతపట్టుకొని బలవంతంగా ఊరు వదిలినవారు వారికి సామాజిక భద్రత కల్పించడంలేదు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు వేతనాలు పెంచడం లేదు. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా లాంటి నినాదాలు ఎన్ని ఉన్నా మోడీ ప్రభుత్వం ఉద్యోగాలను కల్పించడంలో తీవ్రంగా విఫలమయింది. ప్రభుత్వం 1.96 లక్షల కోట్ల రూ॥ ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మివేసింది. ఇది యుపిఎ ప్రభుత్వం పదేళ్ళలో అమ్మిన దానికంటే ఎక్కువ.

కేంద్రలో నేడు మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను కార్మిక కోడ్‌లలోకి కలిపివేసింది. దీని వల్ల యజమానులు ఉద్యోగులను అవసరానికి తీసుకోవడం, అక్కరలేనపుడు తొలిగించడం చేయవచ్చు. కార్మికులు ఎప్పుడు ఉద్యోగాలు పోతాయో అన్న భయంతో గడపాల్సి వస్తోంది.

### దళితులు, మైనార్టీ , ఆదివాసులు, మహిళలు, విద్యార్థులు, మేధావులులపై దాడులు, అక్రమ అరెస్టులు-హత్యలు

నాలుగేళ్ళ మోడీ పాలనలో భావస్వేచ్ఛ కరువయ్యింది. పురోగామి భావాలపై కన్నెర్ర జేస్తున్నారు. భావస్వేచ్ఛను త్రిశూలాలు చిదిమి వేస్తున్నాయి. కుల, మత వైషమ్యాలను పెంచిపోషిస్తూ దళిత, మైనార్టీలపై దాడులు పెరిగాయి. మత స్వేచ్ఛ, వాక్ సభా స్వాతంత్రాలులేవు. మహిళల కట్టుబొట్టులపై ఆంక్షలు పెరిగాయి. దేశంలో హక్కుల హననం తీవ్ర స్థాయిలో జరుగుతున్నది. సంఘ్‌పరివార్, మోడీ ప్రభుత్వం మనుస్మృతి సిద్ధాంతాన్ని అమలు చేస్తూ దళితులకు సమాన హక్కులు కావాలని, అస్పృశ్యత తొలగించాలని ఉద్యమించే దళితుల జీవనంపై, వ్యక్తిత్వంపై, వారి ఆత్మగౌరవంపై, విద్య, ఉద్యోగాల రిజర్వేషన్, హక్కులపై దాడులు జరుగుతున్నాయి. గో రక్షకుల పేరుతో దేశవ్యాప్తంగా ముస్లీంలపై దాడులు చేస్తున్నారు. ఉనా, భీమా కోరేగాంలలో దాడులు జరిపి దళితులను హత్యచేసారు.

గణాంకాల ప్రకారం ఈ మధ్యకాలంలో 40 వేలమందిపై అత్యాచారాలు నమోదు అయ్యాయి. వీటిలో అత్యధిక కేసులు బిజేపి పాలిత రాష్ట్రంలో ఉత్తరప్రదేశ్‌లోనే నమోదయాయి. ఈ పరిస్థితులలో మోడీ ప్రభుత్వం అత్యాచారాలకు పాల్పడుతూనే అగ్రవర్ణాలను, అధికారగణాన్ని కాపాడడానికి సుప్రీం కోర్టు ద్వారా తిరోగమన తీర్పును ఇచ్చి అత్యాచార నిరోధక చట్టంలోని నిబంధనను నీరుగార్చింది. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా దళితులు, ఆదివాసులు ఉద్యమిస్తే బిజేపి పాలిత రాష్ట్రాలలో పోలీసులు, సంఘపరివార్ మూకలు కాల్పులు చేసి 11 మంది దళితుల ప్రాణాలు తీశారు. వందలాది మందిని గాయపర్చారు. ప్రజల వ్యతిరేకత తీవ్రం కావడంతో ఇటీవలనే తిరిగి ఈ చట్టాన్ని పునరుద్ధరించారు.

మోడీ నాలుగేళ్ళ దుష్ట పాలనలో ఆదివాసులు తీవ్రమైన దాడులను ఎదుర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్ర, ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్రలలో అడవిని నమ్ముకొని దాదాపు 3 కోట్ల మంది ఆదివాసులు నివసిస్తున్నారు. జల్, జంగల్, జమీన్‌పై అధికారం కొల్పోతుండడంతో స్వయం పాలన కోసం దశాబ్దాలుగా పోరాడుతున్నారు. వీరు నివసించే ప్రాంతంలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను బహుళ జాతి సంస్థలకు మోడీ సర్కార్, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టబెడుతుండడంతో ఆదివాసులు నిర్వాసితులు అవుతున్నారు. ఈ విధానాలను ప్రతిఘటిస్తున్నందుకు గ్రీన్‌హంట్ పేరుతో, ఇప్పుడు 'సమాధాన్' పేరుతో పారామిలటరీ బలగాలను దించి మావోయిస్టులుగా ముద్రలు వేసి ఆదివాసులను కాల్చి చంపుతున్నారు. ఆదివాసి మహిళలపై నిరంతరం అత్యాచారాలు కొనసాగిస్తున్నారు. అక్రమంగా జైళ్ళలో బంధిస్తున్నారు. గిరిజన సబ్‌ప్లాన్ నిధులలో తీవ్రమైన కోతలు విధించారు. ఘర్‌వాపసి పేరుతో ఆదివాసుల, క్రిస్టియన్ల మధ్య విభేదాలు సృష్టిస్తూ హిందూ మతంలోకి ఆదివాసులు రావాలని ప్రచారం చేస్తున్నారు. మత మార్పిడులు చట్ట విరుద్ధం అని చెప్తున్నారు. ఆదివాసులకు సహకరిస్తున్న హక్కుల నాయకులపై, జర్నలిస్టులపై, మేధావులపై మావోయిస్టు ముద్రలు వేసి జైళ్ళలో పెడుతున్నారు. ఆదివాసి పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీని "సమాధాన్" పేరుతో 2022 నాటికి పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో దాడులు కొనసాగిస్తున్నారు.

### మత మైనార్టీలపై దాడులు

మోడీ తాను గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 3 వేల మంది ముస్లింలను హత్య చేసిన ఘనుడు. ముస్లింలకు సామాజిక భద్రతలేదు. ముస్లీంలు అంటేనే దేశద్రోహులు, ఉగ్రవాదులుగా ముద్రలు వేసి అరెస్టులు, హత్యలు చేస్తున్నారు. ఈ మూడేళ్ళ కాలంలో దాదాపుగా 3 వేల మతోన్మాద ఘటనలు జరిగాయి. ఈ ఘటనల్లో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 9 వేలకుపైగా ప్రజలు గాయపడ్డారు.

గో సంరక్షణ పేరుతో 78 మూకుమ్మడి దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 29 మంది చనిపోగా 273 మంది గాయపడ్డారు. హక్‌లాక్‌ను గోరక్షణ పేరుతో హత్య చేశారు. ఈ ప్రమాదకరమైన హిందూ చాందసుల వ్యూహం మైనారిటీ ప్రజలను మైనార్టీ చాందసవాదుల వైపుకు నెడుతున్నది.

### మహిళలపై హింస

మహిళకు 33 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామన్న మోడీ పాలనలో మహిళలకు భద్రత లేదు. మహిళలపై హింస పెరిగింది. సంఘ్‌పరివార్ సిద్ధాంతంలో మహిళలు పురుషులతో సమానం కాదు. మహిళల స్వతంత్రను గుర్తించరు. అత్యధిక అత్యాచారాలు బీజేపి పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలోనే జరిగాయి. సంఘ్‌పరివార్ విధానాలను ప్రశ్నించినందుకు రచయిత, అభ్యుదయవాది గౌరీలంకేశ్‌ను హత్య చేశారు. జమ్మూలో బాకర్వాల్

(మిగతా 13వ పేజీలో....)

# విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని ఓడిద్దాం!

అవినీతి, టెర్రరిజం, కులతత్వం, మతతత్వం లేని భారతాన్ని అభివృద్ధి చేయడం 'నవభారత' నిర్మాణం లక్ష్యమని మోదీ ప్రకటించాడు. మోదీ మాత్రం 4 సం॥లు సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల దోపిడీ ప్రయోజనాలను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేసాడు. దేశంలో ఒక శాతంగా ఉన్న సంపన్నుల చేతుల్లోకి 70% ప్రజల సంపదల మొత్తంతో సమానమైన సంపదను సమకూర్చి పెట్టాడు. దళితులను, ఆదివాసులను, మత మైనారిటీలను అణచివేసి, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి పట్టం కట్టాడు.

వర్గపోరాటాన్ని, సాయుధ పోరాటాన్ని నడిపే మావోయిస్టులను అణచివేయటం పాలకవర్గాల లక్ష్యం. ప్రకృతి సంపదలను, కార్మిక, రైతాంగ తదితర శ్రమజీవుల శ్రమను కొల్లగొట్టేందుకు ప్రజల ప్రతిఘటనను పాశవికంగా అణచివేస్తున్నారు. అమెరికా ప్రయోజనాలకోసం చైనాను ఎదుర్కోవటంలో భాగంగా దక్షిణ ఆసియాలో విస్తరించడానికి మోదీ ప్రభుత్వం పీడిత జాతుల్ని, ప్రజల్ని అణచివేస్తుంది. "నవభారత నిర్మాణ లక్ష్యం" బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు రాజ్యాన్ని స్థాపించటం. ఈ లక్ష్యం నెరవేర్చుకోవడానికి ఆటంకంగానున్న మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించేందుకు "సమాధాన్" అనే దాడిని మోదీ ప్రభుత్వం చేపట్టింది. సమాధాన్ దాడి పథకం తిరుగుబాటు వ్యతిరేక, గెరిల్లా యుద్ధ వ్యతిరేక ఎల్ఐసీలో భాగంగా రూపొందినదే.

**భారత విప్లవోద్యమ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న బహుముఖ దాడి ఎత్తుగడలు:**

విప్లవోద్యమ ప్రాంతాల్లో కార్పెట్ సెక్యూరిటీని బలోపేతం చేయటానికి ఇప్పటికే వేల సంఖ్యలో పారామిలటరీ, కమాండో, స్పెషల్ పోలీసు బలగాలను మోహరించారు. ఒక సంవత్సర కాలంలో 16 కొత్త క్యాంపులను వేసి మరో 28 క్యాంపుల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ బలగాలు చాలక ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మరో 3 బెటాలియన్‌లను ఏర్పాటు చేస్తున్నది. నాలుగు ఐఆర్‌బీ, ఒక సీఆర్‌పీఎఫ్‌కు చెందిన బస్తారియా బెటాలియన్‌లను నిర్మించి ఫీల్డ్ ఆపరేషన్స్‌లో మోహరించారు. వీటికి తోడు ఎస్‌టీఎఫ్, డీఆర్‌జీలను వినియోగిస్తున్నారు. గ్రేహౌండ్స్ తరహాలో మరో బ్లాక్ పాంథర్స్ (నల్ల చిరుతలు) పేరుతో కొత్త కమాండో బెటాలియన్‌ను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్మిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రెండు రాష్ట్ర పోలీసు బెటాలియన్‌లను నిర్మించి (ఛత్తీస్‌గఢ్) సరిహద్దుల్లో మోహరించింది. 2018 జూన్‌లో ఆపరేషన్ ప్రహార్-3 పేరుతో 50 వేల మంది పోలీసు బలగాలతో ఒక దాడి నిర్వహించారు. కార్పెట్ సెక్యూరిటీ ఆధారంగా మావోయిస్టులను చుట్టుముట్టి, వెతికి, నిర్మూలించే (కార్డన్, సెర్చ్ అండ్ కిల్) ఆపరేషన్‌లను మరింత తీవ్రతరం చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. గెరిల్లా బేస్‌లపై దాడిచేసి, విస్తరణ ప్రాంతాలపై దాడుల్ని పెంచి ఉద్యమానికి కేంద్రం లేకుండా, వెసులుబాటు లేకుండా చేయాలని చూస్తున్నారు. ఇంటలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేసుకొని అన్ని ప్రాంతాలకు విస్తరింపచేసి కౌంటర్ గెరిల్లా ఆపరేషన్స్‌కు ప్రయత్నిస్తున్నారు. ఇజ్రాయిల్ సహాయంతో ఒక సౌత్‌లైన్‌ను నిర్మిస్తున్నారు. ఇన్‌ఫార్మర్‌లను, కోవర్టులను తయారు చేసి ఉద్యమాన్ని దెబ్బ తీస్తున్నారు.

ఆదివాసీ ప్రాంతాల్లోని పెటీబూర్జువా సెక్షన్లను ఆర్థికంగా లోబరుచుకొని విప్లవోద్యమంలోకి వెళ్లకుండా నిరోధించడంతో పాటు ప్రతీఘాతుక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. వివిధ రకాల పుకార్లు, గోబెల్స్ ప్రచారం చేస్తూ విప్లవోద్యమానికి ప్రజల మద్దతు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. పార్టీకి నిధులు అందకుండా చేయడం, విప్లవోద్యమానికి సహకరించే వారిపై నిఘాపెట్టడం, తునికాకు, వెదురు పనులు బందు పెట్టించడం చేస్తున్నారు.

దండకారణ్య ఉద్యమ ప్రాంతంలో ఎన్నికల నిర్వహణకు 1,25,000 సైన్యాన్ని మోహరించినా కూడా పీఎల్‌జీఏ బలగాలు-విప్లవ ప్రజలు ఎన్నికల బహిష్కరణ విజయవంతం చేసారు. శత్రు బలంలోని బలహీనతను అర్థంచేసుకున్న ప్రజలు ఈ విజయం సాధించారు. 15 రోజుల్లో 10 మంది పోలీసులను చంపి, 33 మందిని గాయపరచడమే కాకుండా ఒక ఎల్ఎమ్‌జీ, ఒక ఏకే ఆయుధం స్వాధీనం అయ్యాయి.

శత్రువు అనుసరిస్తున్న "సమాధాన్" దాడిని ఓడించటం కోసం విప్లవోద్యమం ప్రతిదాడి ఎత్తుగడలను చేపట్టి పురోగమించాలి. వాస్తవ పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించుకొని గడ్డుపరిస్థితిని అధిగమించటంకోసం గెరిల్లా యుద్ధ నియమాలననుసరించి మన కదలికల రహస్యాన్ని పాటించడం, బలమైన శత్రువుకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం అన్న స్పృహతో ఆత్మరక్షణ ఎత్తుగడలను సరిగ్గా అమలు చేయటం, ప్రజా ఇంటలిజెన్స్‌ని మెరుగుపర్చుకోవాలి. ప్రజామిలీషియాను శక్తివంతంగా తయారు చేయటం, ధైర్య, సాహసాలతో శత్రువును ప్రతిఘటించేలా సిద్ధంచేసి ఉద్యమ శక్తుల్ని సంఘటిత పర్చుకోవాలి. గెరిల్లా బలగాలు యదాలాపాన్ని, పెటీబూర్జువా బలహీనతలను విడిచి పెట్టి గెరిల్లా జీవన శైలిని, కార్మికవర్గానికుండే కష్టపడే తత్వాన్ని పెంచుకోవాలి. రోజు రోజుకు మారుతున్న పరిస్థితులకు తగినట్లుగా ప్రతిదాడి సన్నద్ధతను పెంచుకోవాలి. ప్రజల దైనందిన సమస్యలు పట్టించుకుంటూ, ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రజల్ని చైతన్యవంతం చేస్తూ వర్గపంథా-ప్రజాపంథాలలో ప్రజాపునాదిని పెంచుకుంటూ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయాలి. విశాల ప్రజారాశులను సామ్రాజ్యవాద భూస్వామ్య వ్యతిరేక వర్గపోరాటంలో తర్ఫీదు చేసి నాయకత్వ శక్తులను ఎదిగించుకోవాలి. దాడికి ప్రతిదాడే సమాధానం కావాలి.

సల్వాజుడుం, గ్రీన్‌హంట్ ఆపరేషన్స్‌ను అందులో భాగంగా "మిషన్-2016, 2017లను" విప్లవోద్యమం ఓడించింది. ఎన్నో అనుభవాలను సంపాదించింది. రాంగూడ, కసనూరు లాంటి ఘటనల్లో

(మిగతా 17వ పేజీలో....)

# సీబీఐ పైనే అవినీతి నేరారోపణల విచారణ

## కేంద్ర సంస్థలను పావులుగా వాడుకుంటున్న పాలకులు

సీబీఐ భారతదేశపు ప్రధాన దర్యాప్తు సంస్థ. అగ్రగామి పోలీసు విచారణసంస్థ. ప్రధానమంత్రి, ప్రతిపక్షనాయకుడు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండే కమిటీ సీబీఐ డైరెక్టర్‌ను నియమిస్తుంది. సీబీఐని ప్రభుత్వం, ప్రతిపక్షాలు, ప్రజలు, కోర్టులు చాలా ప్రతిష్టాత్మకంగా చూస్తాయి. సాధారణంగా సీబీఐకి కేటాయించే కేసులు సున్నితమైనవి. జాతీయ ప్రాధాన్యత కలవి.

ఒకప్పుడు రాజకీయాల 'పంజరంలో చిలక'గా ఉన్న సీబీఐ నేడు రాజకీయనాయకుల నుండి డబ్బులు తీసుకుని శిక్షలు లేకుండా చేయగల స్థాయికి ఎదిగింది. సీబీఐ సాగించిన 'సాక్ష్యాలు లేని తరహా కుంభకోణాల ఉన్మాదం' టెలికాం నుండి మైనింగ్ దాకా భారత ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది. సీబీఐ కార్యాలయంలో అపరిమితాధికారం ఉంది. కానీ చాలా తక్కువ జవాబుదారీతనం ఉంది.

స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించాల్సిన సీబీఐ రాజకీయ చట్రంలో బంధీ అయిపోయింది. నిక్కచ్చిగా వ్యవహరించి న్యాయం అందించాల్సింది పోయి రాజకీయాల జోక్యం వలన పక్షపాత ధోరణిని అలవరచుకుంది. దేశంలో దర్యాప్తు సంస్థల, విచారణ సంస్థల పనితీరు మారిపోయింది. సుప్రీంకోర్టు ఒక సందర్భంలో సీబీఐని 'పంజరంలో చిలక' అని అభివర్ణించింది. 'ఈ చిలక ఎప్పుడూ తన ప్రభువు మాటనే పలుకుతుంది' అని కూడా అన్నది. దర్యాప్తులు దారి తప్పడం, ఆశ్రిత పక్షపాతం, అవినీతి సీబీఐలోకి వచ్చి కీలక స్థానాల్లో కూర్చుని పాలకులకు అనుగుణంగా తీర్పులు చెబుతుంది.

దేశంలో ప్రముఖుల కేసు దర్యాప్తు చేస్తున్నప్పుడు మందకోడిగా వ్యవహరించి పీవీ నరసింహారావు, జయలలిత, లాలూ ప్రసాద్‌యాదవ్, మాయావతి, ములాయంసింగ్ యాదవ్ వంటి నాయకుల కేసుల్లో విచారణ జరపకుండా లేదా నిర్దోషులుగా బయటపడేలా సీబీఐ సహకరించింది. 1986 బోఫోర్స్ కుంభకోణంలో కూడా కాంగ్రెస్ హయాంలో ప్రధాన నిందితుడు అట్టావియోక్రోచిని, అతని బ్యాంక్ అకౌంట్స్‌ను కాపాడింది. పెద్ద పెద్ద కుంభకోణాల్లో దోషులు ఎల్‌కే అద్వానీ, వీసీ శుక్లా, అర్జున్ సింగ్, మాధవరావు సింధియా, ఎన్‌డీ తివారీ, ఆర్‌కే ధావన్, మదన్‌లాల్ ఖురానా లాంటి హేమాహేమీలను కూడా సులభంగా కేసుల నుండి తప్పించింది.

భోపాల్ గ్యాస్ ఘటనకు బాధ్యుడైన యూనియన్ కార్బైడ్ సీఈఓ వారెన్ అండర్సన్‌ను కేసు నుండి తప్పించడానికి వెనుక ఉన్న రాజకీయ ఒత్తిడి తెలిసిందే. 2జీ స్పెక్ట్రమ్ కేసులో సీబీఐ పనితీరును సుప్రీం కోర్టు అనేక సార్లు మందలించింది. ఆ కేసును రాజకీయ సమీకరణల కోసం నీరుకార్చిన విషయం కూడా మనకు తెలిసిందే.

సీబీఐ ఒక్కటే కాదు. ఇన్‌కంటాక్సు డిపార్ట్ మెంటు, సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ లాంటి కేంద్ర ఉన్నత సంస్థల పనితీరు చూస్తే, పాలకవర్గాల చేతిలో మంత్రదండాల్లా ఆయా సందర్భాలలో ఉపయోగపడినవే. కేంద్రమే అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడుతుంటే ఆ పంజరంలోని చిలకలు నీతిమంతంగా ఉంటాయా?

పాలక పార్టీ, కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి తమ ప్రత్యర్థుల మీద కక్ష సాధించడానికి సీబీఐని జేబుసంస్థగా వాడుకోవడం గతం నుండి కొనసాగుతున్నదే. ప్రస్తుతం బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని పదవికి మోదీనే సర్వం. ఆవ్యక్తికి నమ్మకం ఉన్న గుజరాత్‌లో అనుబంధం ఉన్న రాకేష్ అస్థానాను స్పెషల్ డైరెక్టర్‌గా చేసుకున్న తీరు, ఈ మధ్య కాలంలో అస్థానాను అవినీతి కేసుల నుండి తప్పించేందుకు పీఎమ్ఓ నుండి దొరికిన మద్దతు, అస్థానాపై అవినీతి కేసును దారిమళ్లించడానికి, దానితో పాటు రాఫెల్ యుద్ధ విమానాల కుంభకోణంను సీబీఐ డైరెక్టర్ అలోకవర్మ విచారించడంతో కలిగిన భయాందోళనలు అన్నీ కలిసి పార్లమెంటు ఎన్నికలు ముందు పెద్దఎత్తున దేశరాజకీయాలు వేడెక్కి పోవడంతో మోదీ అర్ధరాత్రి సీబీఐ డైరెక్టర్‌ను తొలగించి తనకనుకూలమైన మరో అవినీతి అధికారి నాగేశ్వర్రావును సీవీసీకి చెప్పి నియమించుకున్నాడు. ఈ వ్యవహారం అంతా సీబీఐ జేబు సంస్థ అన్న విధంగానే ప్రధాని మోదీ చేస్తున్నాడు. దీనితో సీబీఐ డైరెక్టర్, మరికొద్ది మంది సుప్రీంకోర్టును ఆశ్రయించక తప్పలేదు.

గోద్రా రైలు దహనం కేసు, లాలూ ప్రసాద్‌పై దాణా కుంభకోణం కేసు, అగస్టా వెస్ట్ లాండ్ కేసు వంటి పరిశోధనలు చేసిన అస్థానా గుజరాత్ కేడర్‌కు చెందిన ఐపిఎస్ అధికారి. మోదీకి నమ్మిన బంటు.

ఇది వర్గసమాజం. దోపిడీ వర్గాలు ఈ వ్యవస్థను దోపిడీ అణచివేతల నిలయంగా మార్చి వేశారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, మోసం, దగా తప్ప మరొకటి కానరాకుండా పోయాయి. ఈ వ్యవస్థలో విశ్వసించే, గౌరవించే సంస్థ ఒక్కటి కూడా కానరాదు. ఏ రాజ్యాంగ బద్ద సంస్థ కూడా ప్రజలకు, రాజ్యాంగానికి జవాబుదారీగా లేవు. ఈ వ్యవస్థ కుళ్ళి పోయింది. దీనిని నాశనం చేయాలి.

బీహార్, తమిళనాడు ప్రాంతీయ పార్టీలను బీజేపీ తన చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి వాళ్ళపై నున్న అవినీతి కేసుల్ని ఏవిధంగా వాడుకుని లొంగదీసుకునే ప్రయత్నం చేసిందో మనకు తెలుసు. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా కేంద్ర దర్యాప్తు సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకోవడం చూస్తే ప్రజలను మాయ చేయడానికి, ప్రతిపక్షాల్ని లొంగదీసుకోవడానికి పాలకపార్టీ చేతిలో ఆ కేంద్ర సంస్థలు ఆయుధాలుగా తప్పమరో రకంగా చెప్పలేం. సీబీఐ లాంటి సంస్థలు రెండు వైపుల పదునున్న కత్తులు. వీటితో సరిగా వ్యవహరించక పోతే తమకే ప్రమాదం అని ప్రధానికి తెలిసివచ్చింది. గుజరాత్‌లో గడించిన అనుభవం ఢిల్లీలోఎదురు తిరుగుతోంది. ఒక రాష్ట్రంలో గుట్టుగా ఉన్నది ఇప్పుడు దేశం అంతా బాహాటమయిపోయింది. ఇప్పుడు అవినీతి వ్యతిరేక పోరాటం మోదీపైనే జరగాల్సి ఉంటుంది.

అవినీతి వర్గ సమాజపు నీతిగా ఉంది. వర్గ పోరాటం ద్వారానే వర్గ సమాజాన్ని అంతంచేద్దాం. ✦

# కార్పొరేట్ కింగ్ అంబానీ, ప్రధాని మోదీల అనుబంధం

# రాఫెల్ కొనుగోళ్ళలో 58 వేల కోట్ల అవినీతి

భారత ప్రధాని కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు అనుగుణంగా పాలిస్తున్నారని బలంగా నిరూపించే రాఫెల్ కొనుగోళ్ళ ఉదంతం ఇప్పుడు రాజకీయాల్లో పెద్ద చర్చగా నడుస్తున్నది. బోఫోర్స్ కన్నా ఎన్నో రెట్లు పెద్ద కుంభకోణం ఇది.

ప్రతిపక్ష కాంగెస్ నుండి, అధికారపక్ష సభ్యుల నుండి దర్యాప్తు సంస్థలకు, కాగ్‌కు రాఫెల్ కొనుగోళ్ళపై విచారణ కోరుతూ అభ్యర్థనలు అందాయి. ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కూడా దర్యాప్తును డిమాండ్ చేసారు.

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు, ఒప్పందం నిర్ణయాల ప్రక్రియకు సంబంధించిన వివరాలను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఒప్పంద వివరాలతో పాటు యూపీఏ, ఎన్‌డీఏ ప్రభుత్వ కాలంలో విమాన కొనుగోలు ధరలను పోల్చుతూ వివరాలను కూడా అందజేయాలని కోర్టు కోరింది. విచారణ జరుపుతున్న నేపథ్యంలోనే కొన్ని వాస్తవాలు బయటకొచ్చాయి. అనీల్ అంబానీకి చెందిన రిలయెన్స్ డిఫెన్స్ సంస్థను భారత్‌లో ఆఫ్‌సెట్ పార్టనర్‌గా చేసుకోవడం తప్పనిసరి (మ్యాండెటరీ) అని చెప్పే అంతర్గత ఒప్పంద పత్రం బయట వెలుగుచూసింది. ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు ఫ్రాన్స్‌వో హోలన్ ఈ విషయాన్ని గతంలోనే వెల్లడించాడు. అది నిజమని ధృవపడింది. అలాగే ఫ్రెంచి కార్మిక సంఘాల నివేదికల్లో కూడా రిలయెన్స్ డిఫెన్స్ సంస్థనే ఆఫ్‌సెట్ పార్టనర్‌గా తీసుకోవడం తప్పనిసరి అయినట్లు పేర్కొన్నారు.

రక్షణ రంగ ఉత్పత్తులలో 70సం॥లకు పైగా అనుభవం ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) సాంకేతిక పరిజ్ఞానం, సామర్థ్యంతో సుఖోయ్, మిరజ్ లాంటి యుద్ధ విమానాలను తయారు చేసిన హాల్‌ను కాదని రిలయెన్స్ డిఫెన్స్ సంస్థను ఎన్నుకోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? నిజానికి ఈ సంస్థకు రిఫ్రిజిరేటర్ లాంటి చిన్న పరికరాలను తయారు చేసేందుకు కూడా స్థలం, కర్మాగారం, పెట్టుబడి లేని పరిస్థితి. మోదీ ఆశీస్సులతోనే మహరాష్ట్ర ప్రభుత్వం నాగపూర్ దగ్గర మిహాన్‌లో 289 ఎకరాల స్థలాన్ని ఈ సంస్థకు కేటాయించిన విషయం తెలిసినదే. 64 కోట్ల రూ॥లకే ఇప్పించడంలో ఎంత అవినీతి, అధికార దుర్వినియోగం ఉన్నాయో చెప్పనక్కరలేదు. అంబానీకి చెందిన 2జీ స్పెక్ట్రమ్ లాంటి పలు కంపెనీలు, లక్షల కోట్ల మేర అప్పుల్లో కూరుకుపోయి కోలుకోలేని స్థితిలో ఉన్న సందర్భంలో వీరి డిఫెన్స్ సంస్థతో ఒప్పందం చేసుకోవడంతో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

126 యుద్ధ విమానాలు అవసరముందన్నది రక్షణశాఖ ప్రతిపాదన. 36 యుద్ధ విమానాల కొనుగోలు చేయాలని మాత్రమే కొత్తడీల్‌లో నిర్ణయించారు. మరోడీల్‌లో మిగిలిన హెచ్‌ఓ యుద్ధ విమానాల తయారీని ఒక సీరిస్ కంపెనీకి అప్పగించి అందులో గౌతమ్ అధానీని ఇండియా పార్టనర్‌గా చేర్చేందుకు మోదీ పథకం ఉందంటున్నారు. 'మోదీగారి మేక్‌ఇన్ ఇండియా' ఎవరి అభివృద్ధికి? సాంకేతికత బదలాయింపు, అభివృద్ధి ప్రైవేటు కంపెనీలకేనా?

పాత డీల్ 95% పూర్తయ్యింది. పాత డీల్ ప్రకారం ఒక్కో యుద్ధ విమానం ఖరీదు 526 కోట్ల రూ॥ ఉంది. ఇప్పుడు కొత్తడీల్ ప్రకారం అది 1670 కోట్ల రూ॥ అంటే 3 రెట్లు అధనం. ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా రక్షణమంత్రి పాల్గొన లేదు. మోదీ బృందంలో అంబానీ ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. ఈ కొత్త డీల్ గురించి రక్షణ మంత్రికి తెలియదు. కేబినేట్‌కు కూడా చెప్పలేదు. ఇది మోదీ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం. కాంట్రాక్టర్‌ను, సబ్ కాంట్రాక్టర్‌ను మార్చాలంటే కూడా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలనే మార్గ దర్శకాలను మోదీ కాలరాసివేస్తూ హాల్‌ను తీసి రిలయెన్స్ సంస్థను ఎంపిక చేసాడు.

భారత రక్షణ రంగ వ్యవస్థ రాజకీయ అవినీతితో కార్పొరేట్ శక్తుల ప్రాభల్యానికిలోనై దేశ సార్వభౌమత్వానికే ప్రమాదం ఏర్పడుతున్నది. రక్షణ రంగాన్ని ప్రైవేటీకరించడం వలన కలిగే దుష్పరిణామాలను కళ్ళకు గడుతూ వెలుగు చూస్తున్న ఈ కుంభకోణాన్ని వ్యతిరేకించాలి.

రాఫెల్ ఒప్పందంపై ఆరోపణ, ప్రత్యారోపణలు, మీడియా కథనాలు దేశ రాజకీయాలపై బలమైన ప్రభావాన్ని వేస్తున్నాయి. 5 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, ఫెడరల్, సెక్యులర్ ఫ్రంట్‌ల నేర్పరిచే జిమ్మిక్కులు నడుస్తున్న సమయంలో, త్వరలోనే సార్వత్రిక ఎన్నికలు ఉన్నందు వలన కూడా రాఫెల్ డీల్ ప్రముఖమైనదిగా మారుతున్నది. అవినీతిని అంతమొందిస్తామని ప్రగల్భాలు పలికిన ప్రధాని మెడకే అవినీతి ఉచ్చు బిగుసుకుంటుంది.

రాఫెల్ కుంభకోణాన్ని విచారించేందుకు సిద్ధపడుతున్న సీబీఐ చీఫ్‌ను అర్ధాంతరంగా అర్ధరాత్రి ఆర్డర్లతో తొలగించడాన్ని, కేంద్ర సంస్థలను మోదీ రాజకీయాలకు పావులుగా వాడుకోవడాన్ని అందరూ ప్రశ్నిస్తున్నారు. సుప్రీం కోర్టులో కేసులు వేయడంతో పాటు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేసి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ డీల్ విషయంలో ప్రధానిమోదీ, రక్షణశాఖ మాజీ మంత్రి మనోహర్ పారికర్‌లు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అభియోగాలున్నాయి. ఫ్రాన్స్ నుండి 36 రాఫెల్ యుద్ధ విమానాలు కొనుగోలు చేస్తున్నట్లు 2015 ఏప్రిల్ 10న మోదీ ప్రకటించాడు. అప్పుడే అంబాని సంస్థ (ఆర్‌డీఎల్), ఫ్రెంచి కంపెనీ (డస్సాల్ట్ ఏవియేషన్)ల మధ్య జాయింట్ వెంచర్‌గా ఏర్పాటయ్యేందుకు ఆఫ్‌సెట్ పార్టనర్ ఒప్పందం జరిగింది. మోదీ ప్రకటనకు 12 రోజులు ముందు మాత్రమే ఆర్‌డీఎల్ ఒక కంపెనీగా రిజిష్టర్ అయ్యింది. అప్పటికి కొత్తగా పుట్టిన శిశువుకు స్థలం కూడా లేదు. ఇంకా పొత్తిళ్ళలోనే (కాగితాల్లోనే) ఉంది. ఆర్‌డీఎల్ కంపెనీకి ఏమీ లేవు. ఒక్క మోదీ ఆశీస్సులు తప్ప.

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారాన్ని 2007 నుండి నేటి వరకు క్షుణ్ణంగా ధర్యాప్తు జరిపితే పాలకవర్గాల అవినీతి లోతు స్పష్టం అవుతుంది. బీజేపీ అవినీతి వ్యతిరేకత ఎంతో కూడా నిగ్గుతేలుతుంది. అవినీతి లేని నూతన వ్యవస్థ నిర్మాణానికై పోరాడుదాం. ✦

# దిగజారిపోతున్న రూపాయి విలువ

# భారత దోపిడీ పాలక వర్గాల రాజకీయ, ఆర్థిక విధానాల ఫలితం

భారత పాలక వర్గాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల కారణంగా మన రూపాయి విలువ రోజు రోజుకు దిగజారిపోతుంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం, ట్రంప్ అనుసరిస్తున్న రక్షిత విధానాలు-సుంకాల పెంపు, అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న చమురు ధరలు, ఇరాన్ నుండి ఆయిల్ కొనుగోలు పై ఉన్న ఆంక్షలు, టర్కీలో లీరా సంక్షోభం లాంటి అనేక అంశాలు రూపాయి మరింతగా బలహీనపడటానికి కారణమవుతున్నాయి.

2014 పార్లమెంటరీ ఎన్నికల నాటికి ఒక డాలర్‌కు 61 రూపాయలు ఉన్న విలువ ఇప్పుడు 74 రూపాయలకు చేరుకున్నది. 2018 సంవత్సరంలోనే 9 నెలల్లో పదిరూపాయలు బలహీనపడింది. ఎన్నికలు పూర్తయ్యే నాటికి రూపాయి విలువ మరింతగా బలహీనపడే సూచనలు కనపడుతున్నాయి.

2008లో మొదలైన ఆర్థిక సంక్షోభం నుండి బయటపడలేక ట్రంప్ నాయకత్వంలోని అమెరికా సామ్రాజ్యవాదం ఏకపక్షంగా అంతర్జాతీయంగా రూపొందించుకున్న వాణిజ్య ఒప్పందాలకు భిన్నంగా అమెరికా రక్షిత విధానం పేరుతో దిగుమతులపై అధిక సుంకాలు వేయటం మొదలుపెట్టింది. అమెరికా, చైనాల మధ్య మొదలైన వాణిజ్య యుద్ధం ఆ రెండు దేశాలకే పరిమితం కాకుండా అనేక దేశాలపైన ప్రభావం చూపుతున్నది. ట్రంప్ అనుసరిస్తున్న విధానాల కారణంగా వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైపోతుంది. టర్కీ ఇప్పటికే ద్రవ్య సంక్షోభంలో కూరుకుపోయింది.

భారత రూపాయి వేగంగా తరిగిపోతుంది. చమురు ధరలు పెరగటం ఇలాగే కొనసాగితే విదేశీ వాణిజ్య లోటు మరింతగా పెరిగి మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గి మన ఆర్థిక వ్యవస్థ కూడా సంక్షోభంలో పడిపోతుంది. దేశీయంగా కరెంట్ అకౌంట్ లోటు పెరిగి పతనానికి దారి తీస్తుంది. విదేశీ పెట్టుబడుల ప్రవాహానికి బ్రేక్ పడుతుంది. పరిశ్రమల స్థాపన కుంటుపడి ఉపాధికల్పన సంక్షోభం తలెత్తుతుంది. వీటి ఫలితంగా ఆర్థిక మాంద్యం తీవ్రమై అనేక రాజకీయ సామాజిక దుష్పరిణామాలు రాక తప్పవు.

రూపాయి విలువ పతనం దిగుమతులకు ప్రతికూలంగా మారుతుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు క్షీణిస్తున్నాయి. ఇదే దీర్ఘకాలం కొనసాగితే ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉంది. రూపాయి పతనం వలన విదేశీ చదువులు, విదేశీ పర్యటనలు మరింత ఖరీదు అవుతాయి. భారత్ దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరుగుతాయి. అభివృద్ధి రేటు పడిపోతుంది. ఉద్యోగ అవకాశాలు క్షీణిస్తాయి. వాణిజ్య లోటు రోజు రోజుకు పెరిగిపోతుంది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతాయి.

ఆర్థిక వ్యవస్థను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), ఎగుమతులు, దిగుమతులపై, ఆధారపడేలా చేసి దేశ, విదేశీ కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోకుండా రూపాయి మారకపు విలువను పటిష్టం చేయటం సాధ్యం కాదు.

ద్రవ్యోల్బణాన్ని అదుపుచేయటానికి రిజర్వు బ్యాంకు వడ్డీరేట్లు పెంచవచ్చు. దానివల్ల ప్రభుత్వానికి బడ్జెట్ లోటు పెరుగుతుంది. దానికి పరిష్కారంగా పన్నులు పెంచటం, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు కోత విధించడం తప్పనిసరి. దీనితో సామాన్యుని జీవన ప్రమాణాలు మరింత ఘోరంగా దెబ్బతినడం జరుగుతుంది.

మన దేశ స్టాక్ మార్కెట్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐ ఇక్కడ లాభాలను ఆర్జించి వారి దేశాల్లో ఆర్థిక వ్యవస్థలను పటిష్ట పరుచుకుంటున్నాయి.

ప్రపంచ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి స్థితి వలన విదేశీ పెట్టుబడులు వెనక్కిమల్లుతున్నాయి. నవంబర్ 4 నాటికి ఇరాన్ చమురు దిగుమతులను అంతం చేయటానికి అమెరికా, దాని మిత్ర రాజ్యాలు తీసుకున్న నిర్ణయంతో పాటు లిబియా, కెనడాల్లో చమురు సరఫరాను నిలిపివేయటం లాంటి ఆంక్షల కారణంగా తలెత్తిన ఆందోళనకర పరిస్థితులు చమురు ధరలు వేగంగా పెరగటానికి కారణమయ్యాయి.

ఇంధన అవసరాలు (81%) కోసం దిగుమతుల పైననే ఆధారపడిన భారత్‌కు ప్రపంచ చమురు ధరల పెరుగుదలతో దిగుమతుల భారం పెరిగి కరెంట్ ఖాతాలోటు, ద్రవ్యలోటు మరింతగా పెరుగుతాయని, భారత్‌లో ఆందోళన పరిస్థితి ఏర్పడుతుందని స్పష్టమవుతుంది. వాణిజ్య లోటు జీడీపీలో 3% దాటితేనే ప్రమాద సూచికగా ఆర్థిక వేత్తలు భావిస్తారు. అది ప్రస్తుతం 5.3 శాతానికి పడిపోయింది. వాణిజ్యలోటు 71% పెరిగింది. వీటికి తోడు ద్రవ్యలోటు అధికమయ్యింది. ఉత్పత్తి రంగం వృద్ధి చెందలేదు. దిగుమతులు తగ్గిపోయాయి. రూపాయి విలువ క్షీణించింది. రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్లలో తీవ్ర అనిశ్చితి కారణంగా బంగారం కొనుగోలు డిమాండ్ పెరగటంతో ప్రతికూల ప్రభావం పడుతుంది.

మన ప్రభుత్వాలు షేర్ మార్కెట్ తలుపులు బార్లా తెరిచాయి. అమెరికాలో బ్యాంకు వడ్డీరేటు బాగా తక్కువ ఉండటంతో అక్కడి మదుపరులు డాలర్లు తెచ్చి మన షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టారు. సాధ్యమైనంత మేరకు లాభాలు జుర్రుకున్నారు. ఇటీవల అమెరికా ఫెడరల్ బ్యాంకు వడ్డీరేట్లు పెంచటంతో ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న డాలర్లన్నీ అమెరికా బ్యాంకుల్లోకి చేరిపోతున్నాయి. మన షేర్ మార్కెట్లలో పెట్టిన పెట్టుబడులు కూడా డాలర్ల రూపంలోనే వెనక్కి వెళ్లిపోతున్నాయి. ఆ విధంగా డాలర్లకు డిమాండ్ పెరిగి వచ్చే డాలర్ల కన్నా వెనక్కి వెళ్లే డాలర్లు అనేక రెట్లు ఉంటున్నాయి. 2018 ప్రారంభంలో 530 కోట్ల డాలర్లు మన దేశానికి వస్తే మన దేశం నుండి 1850 కోట్ల డాలర్లు వెనక్కి వెళ్లాయి. అమెరికా వడ్డీ రేట్లు మరింతగా పెంచే ఎత్తుగడతో ఉంది. అలా జరిగే క్రమంలో మన దేశం నుండి ఇంకా కూడా అనేక రెట్లు డాలర్లు వెనక్కి పోయే ప్రమాదం ఉంది. విదేశీ మారక ద్రవ్య సంక్షోభం తీవ్రమవుతుంది.

ఇతర దేశాల నుండి చేసుకునే దిగుమతులకు, విదేశీ అప్పులకు, విదేశీ పర్యటనలకు, చదువుకు, విదేశీ వైద్యానికి చెల్లించే డాలర్లు మనం చేసే ఎగుమతుల ద్వారా, విదేశాల్లో ఉద్యోగులు పంపించే

డాలర్ల ద్వారా ఈ చెల్లింపులు జరుగుతాయి. మనకువచ్చే వాటికన్నా చెల్లించేవి అధికంగా ఉండటం కారణంగా వాణిజ్య లోటు ఏర్పడుతున్నది. ఉదాహరణకు 2018 మార్చ్‌లో ఎగుమతులు విలువ 2,900 కోట్ల డాలర్లు, దిగుమతుల విలువ 4, 200 కోట్ల డాలర్లు. వాణిజ్య లోటు 1300 కోట్ల డాలర్లు. అదే రూపాయిల్లో 1300×74= 96,200 కోట్ల రూ॥. విదేశీ సరుకుల ఖరీదు రూపాయి విలువ తగ్గడంతో ఒక డాలరుకు 1947లో 1రూపాయి. 2004లో 61 రూపాయలు చెల్లించేవాళ్లం. ఇప్పుడు 74 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే 1 డాలరు ఖరీదుగల వస్తువు భారతదేశంలో రూపాయి విలువకనుగుణంగా అనేక మార్పులకు గురవుతుంది.

ఇరాన్ నుండి భారత్ భారీగా ముడి చమురు దిగుమతి చేసుకుంటుంది. దీనిపై అమెరికా ఆంక్షలు విధించటంతో మన దేశానికి చౌకగా దొరికే నాణ్యమైన చమురుకు ఆటంకం ఏర్పడి, ఇతర మార్కెట్‌లలో చమురు కొనుగోలుకు ఇంకా అధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఆ కారణంగా ద్రవ్యలోటు మరింతగా పెరుగుతున్నది. మన దిగుమతుల్లో చమురు దిగుమతులే అత్యధికం. 81% దిగుమతులు ఇంధన అవసరాలే అయినపుడు ప్రపంచ చమురు ధరల పెరుగుదల, అమెరికా విధించిన ఆంక్షలు రెండూ మనకు నష్టదాయకమైనవే.

36 దేశాల కరెన్సీలతో అనుబంధమైన రూపాయి మారకపు విలువ మోదీ పాలనలో 14.5% బలహీనపడింది. ఇంకా మరింత బలహీనపడే దిశలోనే కొనసాగుతుంది. ఆసియాలోనే అత్యంత బలహీనమైన కరెన్సీగా రూపాయి తయారైంది. వీటికి తోడు పప్పు ధాన్యాలు, వంట నూనెల కోసం కూడా దిగుమతులపై ఆధారపడే దుస్థితికి మన పాలక వర్గ విధానాలుండటంతో అనేక వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది.

బంగారం, విలాస వస్తువుల కోసం వెచ్చించే విదేశీ మారక ద్రవ్యం కూడా అధికంగానే ఉంటుంది. డాలర్లు మన దేశం నుండి తరలిపోకుండా బంగారం, విలాస వస్తువుల దిగుమతులపై ఆంక్షలు విధించాలి. పప్పుధాన్యాలు, నూనె గింజలు వంటి వ్యవసాయ ఉత్పత్తులను పెంచడం ద్వారా స్వావలంబన సాధించాలి. అమెరికా అనురిస్తున్న విధానాల వలన టర్కీ కరెన్సీ లీరా సంక్షోభం యూరప్‌కు పాకితే ప్రపంచ ద్రవ్య మార్కెట్ పెద్ద ప్రమాదంలోకి వెలుతుంది. సుంకాల విధింపుల ఎత్తుగడ ప్రపంచ వాణిజ్యంలో అసమానతలు పెంచి 1930ల నాటి పరిస్థితులకు దారితీయవచ్చు. ప్రతి సరుకు మీద పెంచే సుంకం ప్రపంచ దేశాలన్నింటా వాణిజ్యానికి ప్రతిబంధకం.

1991లో తెచ్చిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు, ఐఎమ్ఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశిత ఆర్థిక విధానాలు కారణంగా రూపాయి విలువ ప్రపంచ మార్కెట్ ఒడిదుడుకులకనుగుణంగా బలహీనపడింది. మన పారిశ్రామికోత్పత్తులను అభివృద్ధి చేయకుండా ఎగుమతులను పెంచలేము, ఎగుమతులను పెరగకుండా దిగుమతులే పెరిగినట్లయితే వాణిజ్య లోటు కొనసాగుతుంది. ఉపాధి కల్పించటం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ప్రజల జీవన స్థితిగతులు మారుతాయి. భారత రిజర్వ్ బ్యాంకు వడ్డీరేట్లు పెంచటం ద్వారా తాత్కాలిక పరిష్కారం చూపించినా అది దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకే నెడుతుంది. పాలకులు వినాశకర విధానాలు విడనాడి ప్రత్యామ్నాయ విధానాలు చేపట్టాలి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా, దళారీ రాజకీయ నాయకుల కుటిల రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలి. స్వావలంబన ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలి. నూతన ప్రజాస్వామిక సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో ప్రత్యామ్నాయ విధానాలు అమలు చేసే శక్తులన్నీ ఐక్యమై పోరాడాలి. ✦

---

*(....8వ పేజీ తరువాయి)*

జాతిని భయభ్రాంతులకు గురిచేయడానికి కథువాలో 8 ఏళ్ళ బాలికను అత్యాచారం చేసి హత్య చేశారు. మావోయిస్టుల అణచివేత పేరుతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో పారామిలటరీ బలగాలను పంపించి పదుల సంఖ్యలో అత్యాచారాలు చేసి బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేశారు. పారామిలటరీ బలగాలు ద్వారా కాశ్మీర్‌లో కూడా వందలాది మంది మహిళలపై అత్యాచారాలు, పదుల సంఖ్యలో హత్యలు కొనసాగాయి.

భారత సైన్యం వందలాది మంది కశ్మీర్ యువతను ఊచకోతకోస్తున్నది. హిజ్‌బుల్ ముజాహిద్దీన్ కమాండర్ బురహన్‌వనీ ఎన్‌కౌంటర్‌తో కాశ్మీర్ జాతి పోరాటం మరోసారి వెల్లువెత్తింది. కశ్మీర్ జాతి విముక్తి పోరాటానికి అన్ని వర్గాల, సెక్షన్ల ప్రజల సంపూర్ణ మద్దతు ఉంది. అది మిలిటెంట్ రూపం తీసుకుంటున్నది. యువత సాయుధ పోరాట బాట పడుతున్నది. వందలాది మంది యువత ప్రాణాలు కోల్పోయారు. పిల్లెట్ల కారణంగా సుమారు 500 మందికి పైగా కళ్ళు పోగొట్టుకున్నారు. దాదాపు 6 వేల మందికి పైగా గాయపడ్డారు. దీనితో ప్రజా ప్రతిఘటనలు, కశ్మీర్ జాతి విముక్తి గెరిల్లా దళాల సాయుధ చర్యలు తీవ్రతరం అవుతున్నాయి.

ఈశాన్య జాతుల ప్రజల విముక్తి ఆకాంక్షలకు మోదీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. మణిపూర్, నాగాలాండ్, అస్సాం ప్రజలపై దాడులు ఎన్‌కౌంటర్ల పేరుతో ఉద్యమ కారులను హత్యలు చేసింది.

సమాధాన్‌లో భాగంగానే దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులను, హక్కుల కార్యకర్తలను, అర్బన్ నక్సల్స్ పేరుతో అరెస్టులు చేస్తున్నది. సమాధాన్ పేరుతో ఆదివాసులను, విప్లవకారులను హత్య చేస్తున్నది.

విశాలమైన ప్రజాఉద్యమాల ద్వారానే, దీనికి ప్రజా యుద్ధాన్ని జోడించడం ద్వారానే సమాధాన్ దాడిని ఓడించగలం. చరిత్రలో ప్రజలు అనేక అభివృద్ధి నిరోధకమైన వాటిని ఓడిస్తూనే వస్తున్నారు. దీన్ని కూడా ఓడిస్తారు. 'అజయ్ భారత్–అటల్ భాజాపా అనే నినాదాన్ని ఇచ్చారు. మోడీ బదులు అటల్ బిహారీ వాజ్‌పేయి పేరును వాడుకోవడం ద్వారా సాఫ్ట్ హిందూ ముఖంతో దేశ ప్రజలను మోసపుచ్చవచ్చని ఆర్ఎస్ఎస్ పథకం వేసింది. దేశంలో భాజాపా, ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాల వలన దేశం ఎమర్జెన్సీ కాలం కంటే కూడా ప్రమాదంలో వుంది. దేశ ప్రజలకు భద్రత లేకుండా పోయింది. మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ఎజెండాను దూకుడుగా తీసుకొని పోవడం ద్వారా దేశ ఆర్థిక పరిస్థితి ఘోరంగా ఉంది. ఈ పరిణామాలతో మోడీ రాజకీయ ప్రభావం దేశంలో క్రమంగా తగ్గింది. మోదీ గ్రాఫ్ పడిపోతుంది.

ఫాసిస్టు మోదీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విశాల ప్రజా ఐక్యసంఘటన నిర్మించి పోరాడుదాం. దోపిడీ పాలన అంతం చేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం. ✦

# ప్రపంచ వాణిజ్యంలో సరికొత్త యుద్ధం

# ట్రంప్ తెచ్చిన సుంకాల సమరం

1940 తర్వాత అంతర్జాతీయ ద్రవ్య, వాణిజ్య సంస్థలను నెలకొల్పి వాటిని వ్యవస్థీకృతం చేసి ప్రపంచీకరణ విధానాలు అనుసరించడంతో అవి అమెరికా ప్రపంచాధిపత్యానికి, మార్కెట్ విస్తరణకు ఉపయోగపడ్డాయి. అమెరికా అగ్రరాజ్యంగా ప్రపంచ పోలీసుగా వ్యవహరించింది. డాలర్ చుట్టూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తిప్పుకుంది.

2008లో అమెరికాలో మొదలైన సబ్ ప్రైం క్రైసిస్ ప్రపంచ సామ్రాజ్యవాద సంక్షోభంగా మారింది ట్రంప్ తన దేశ స్వీయ రక్షణకోసం ప్రపంచ వాణిజ్య సంస్థలో (డబ్ల్యూటీఓ) రూపొందించుకున్న, నియమాలకు భిన్నంగా దిగుమతులపై సుంకాలు వేయటం ద్వారా ప్రపంచ వాణిజ్య రంగంలో యుద్ధానికి తెరతీసాడు. ఉక్కు దిగుమతులపై 25%, అల్యూమినియం దిగుమతులపై 10% సుంకాలు పెంచాడు. మార్చ్ 1న డిక్రీస్ జారీ చేస్తూ "వాణిజ్య యుద్ధాలయితేనే మంచిది, సులువుగా గెలవవచ్చు" అని వ్యాఖ్యానించాడు. ట్రంప్‌కు ప్రధాన లక్ష్యం అతివేగంగా దూసుకొస్తున్న చైనా. కానీ ఈ చర్య అన్ని దేశాల్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి ప్రపంచ వ్యాప్తంగానే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. 1950 దశకంలో తానే నిర్మించి నిర్వహించిన అంతర్జాతీయ సంస్థలను నాశనం చేస్తుందని వ్యాఖ్యానించారు.

చరిత్రలో వెనక్కి వెళ్లితే 1930లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మహా మాంద్యం పెద్దది. దాని నుండి బయటపడటానికి సామ్రాజ్యవాద దేశాలు పోటీపడి సుంకాలను పెంచాయి. అమెరికా పరిశ్రమలను, స్వదేశీ మార్కెట్‌ను రక్షించుకునేందుకు స్మూత్-హాలే టారీఫ్ చట్టం (జూన్ 1930) రూపొందించింది. ఆ చట్టం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ దిగజారడంతో పాటు ప్రపంచదేశాలన్నీ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. ఆ సంక్షోభం పునాదిగా వచ్చినదే రెండవ ప్రపంచ యుద్ధం. ఆ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనకుండానే గెలిచి రక్షకుడిగా, నాయకుడిగా అమెరికా ముందుకు వచ్చిన విషయం మనకు తెలుసు. ఇందులో భాగంగానే పెట్టుబడిదారీ పునర్నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ ఆవిర్భవించాయి. ఆ తర్వాత ఏర్పడినదే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ). ఈ సంస్థలు అమెరికా కేంద్రంగా సామ్రాజ్యవాద రాజకీయార్థిక విషయాలను కొనసాగించాయి. ఇప్పుడు మళ్లీ ట్రంప్ వాణిజ్య యుద్ధాలు మొదలుపెట్టి మరో ప్రపంచ యుద్ధానికి బాటలు వేస్తున్నాడు.

నేడు ప్రపంచంలో 2వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అభివృద్ధి చెందిన చైనా సోషల్ సామ్రాజ్యవాదంతో వాణిజ్య యుద్ధం వలన అమెరికాకే నష్టమని ఆర్తికవేత్తలు, వాణిజ్య విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మిగిలిన దేశాలు కూడా అమెరికా సరుకులపై సుంకాలు విధిస్తే దాని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద (అమెరికాతో సహా) తీవ్రంగా ఉంటుందని అంటున్నారు. 1990లో సోవియట్ రష్యా విచ్ఛిన్నం కావటంతో అమెరికా ఆధిపత్యానికి అడ్డులేకుండా పోయింది. ప్రపంచ వాణిజ్యంపై గుత్తాధిపత్యానికి పరుగులు తీసింది. ఇప్పుడు సుంకాల పెంపు ద్వారా ప్రత్యర్థి దేశాలపై ఓ పెద్ద ఆర్థిక క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించినట్లు చెబుతున్న ట్రంప్ అమెరికా ఉత్పత్తుల ధరలు పెరిగి మార్కెట్‌లేక కంపెనీలు మూతపడుతాయని, దాని ప్రభావం ఉపాధి మీద ఉంటుందని, వాణిజ్య లోటు పెరిగిపోతుందని అర్థం చేసుకోలేక పోతున్నాడు.

ఒకపక్కన డబ్ల్యూటీఓ ఒప్పంద నియమావళి ఉండగా మరో పక్కన అమెరికా అనేక దేశాలతో ద్వైపాక్షిక వర్తక ఒప్పందాలు కుదుర్చుకుంది. 1. యూఎస్-కెనడా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, 2. నాఫ్టా (నార్త్ అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్), 3. దక్షిణ కొరియా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, 4. ట్రాన్స్-పసిఫిక్ పార్టనర్ షిప్ (ట్రిపిపి), 5. సెంట్రల్ అమెరికన్ రిపబ్లిక్ ఫ్రీ టేడ్ అగ్రిమెంట్ (సిఎఎఫ్‌టిఎ).

చైనాకు చెందిన 1102 ఉత్పత్తులపై 5000 కోట్ల డాలర్లమేర అమెరికా సుంకాలు విధిస్తే అంతే మోతాదులో చైనా కూడా అమెరికా దిగుమతులపై సుంకాలు విధించింది. 28 దేశాలతో కూడిన యూరోపియన్ యూనియన్ (ఈయూ) అమెరికా దిగుమతులపై సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించింది. వాటి విలువ 4,500 కోట్ల డాలర్లు. తాజాగా భారత్ కూడా 241 మిలియన్ డాలర్ల మేర సుంకాలు విధించింది. ఇదే సమయంలో పారిస్ ఒప్పందం నుంచి వైదొలగటం ద్వారా ట్రంప్ ప్రపంచ పర్యావరణానికే ప్రమాదకారి కాబోతున్నాడనీ అందరూ అంటున్నారు.

అమెరికా దిగుమతులపై సుంకాలు పెంచటంతో ఈయూ దేశాలు తమ స్వంత మార్కెట్‌లను ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో ముఖ్యంగా మధ్య ప్రాచ్యం, చైనా, భారత్ వంటి దేశాల్లో వెతుక్కుంటున్నాయి, బలపడుతున్నాయి. ఇరవై ట్రిలియన్ డాలర్ల జీడీపీతో అగ్రగామి దేశంగా ఉన్న అమెరికాకు చైనా మార్కెట్. చైనా ఆర్థికాభివృద్ధి పెద్ద తలనొప్పిగా తయారైంది. సిల్క్ రోడ్డు అభివృద్ధిలో భాగంగా అనేక దేశాలలో చైనా వాణిజ్యాన్ని పెంచుకుంటున్నది. చైనాతో అమెరికా పోటీపడలేక పోతుంది.

2017లో అమెరికాకు, చైనాకు మధ్య జరిగిన వాణిజ్యంలో 375 బిలియన్ డాలర్లు అమెరికాకు వాణిజ్యలోటు ఉంది. ఇది ప్రతి సం॥20% పెరుగుతున్నది. భవిష్యత్‌లో కూడా చైనా ఎగుమతుల విషయంలో పైచేయి సాధించటం సాధ్యమనీ స్పష్టమవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనే 3 లక్షల కోట్ల డాలర్ల విదేశీ రిజర్వ్ కరెన్సీతో చైనా ఆర్థికవ్యవస్థ బలంగానూ, ఆరోగ్యకరంగా ఉన్నది. అమెరికా ఆర్థికవ్యవస్థ ఇరవై లక్షల కోట్ల డాలర్ల అప్పులతో అనారోగ్యకరంగా ఉన్నది.

కెనడాలో జరిగిన జీ-7 సమావేశం నుండి ట్రంప్ నిష్క్రమించడం చూస్తే. 2008 నుంచి కొనసాగుతున్న పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం నుంచి బయట పడే సమిష్టి వ్యూహం ఏదీ సాధ్యం కాదని స్పష్టమయింది. అమెరికా కంపెనీలు ఉత్పత్తి చేసిన సరుకుల ధరలు పెరిగి ఉత్పాదకత మందగించింది. ఇప్పుడు ఈయూ-అమెరికాల మధ్య పూర్తి స్థాయిలో వాణిజ్య యుద్ధం జరిగే అవకాశాలున్నాయని, ప్రపంచ ఆర్థిక రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడేలా ఉందని విశ్లేషకులు అంటున్నారు.

జర్మనీ, ఫ్రాన్స్, గ్రీస్ దేశాలలో ఆర్థిక కార్యకలాపాలు మందగించాయి. అంతర్జాతీయ మార్కెట్లలోను ఇదే పరిస్థితి రానున్నది. అమెరికా, ఇరాన్‌పై ఆంక్షలు కొనసాగిస్తుంది. టర్కీ కరెన్సీ లీరా పతనం

# దేశాన్ని ఫాసిజం బారి నుండి కాపాడుకుందాం!
# అర్బన్ నక్సల్స్ పేరుతో రచయితలు, మేధావుల అక్రమ అరెస్టులను ఖండిద్దాం!

బీజేపీ అధికారంలోకి వచ్చాక వందల సంఖ్యలో పట్టపగలు హత్యలు జరిగాయి. హంతకులకు సన్మానాలు చేస్తున్నారు. రివార్డులు ఇస్తున్నారు. భారతదేశంలో మహిళలు, ఆదివాసులు, దళితులు, ముస్లీంలు ఎవరికీ రక్షణ లేదు. వారికోసం ఉద్యమ పథాన నిలిచిన రచయితలు, మేధావులు హత్యలకు గురవుతున్నారు. అరెస్టులు చేయబడుతున్నారు. పన్సారే, దబోల్కర్, కల్బుర్గీ, గౌరీ లంకేశ్ లాంటివారు హత్యలకు గురయితే ఉమర్‌ఖలీద్ లాంటి యువ స్కాలర్‌లపై హత్యా ప్రయత్నాలు చేస్తున్నారు. గోరక్షణ పేరుతో గ్రామాల్లో ముస్లీములను, దళితులను కొట్టి చంపుతున్నారు. ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వారిపై తప్పుడు కేసులు, అబద్ధపు సాక్ష్యాలతో జీవిత ఖైదు శిక్షలు విధిస్తున్నారు. జూన్‌లో సోమాసేన్, సురేంద్ర గాడ్లింగ్, రోనా విల్సన్, సుధీర్ ధావ్లే, మహేష్ రౌత్‌లను ఆగస్టు 28న వరవరరావు, గౌతమ్ నవలఖా, సుధా భరద్వాజ్, వెర్నన్ గుంజాల్వేస్, అరుణ్ ఫెరెరా లను మోడీ హత్యకు కుట్ర చేశారనే నేరారోపణతో అరెస్టు చేసారు. ఈ క్రమం ఇలా అంతం లేకుండా కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు కొత్తగా "అర్బన్ నక్సల్స్" అనే మాట వెలుగుచూస్తుంది. అబద్ధపు లేఖలను సృష్టించి పథకం ప్రకారం పోలీసులు దాడులు చేస్తున్నారు.

దేశంలో పీడిత ప్రజల పక్షాన నిలిచిన వారిని, విప్లవ ప్రజాస్వామిక ఉద్యమాలను సమర్ధించిన పట్టణ విద్యార్థులు, యువజనులు, శ్రామిక ప్రజలు, మేధావులు అందరినీ అర్బన్ నక్సల్స్‌గానే దోపిడీ పాలకవర్గాలు ముద్రవేస్తున్నాయి.

భీమా కోరేగావ్ 200వ విజయోత్సావాన్ని జనవరి 1, 2018 నాడు 3 లక్షల మంది దళితులు ఎల్గార్ పరిషత్ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. దీని నిర్వాహకులు రిటైర్డ్ న్యాయమూర్తులు పి.బి. సావంత్, కోల్సేపాటిల్. హిందుత్వ శక్తులు మిలింద ఎగ్బోటీ, శంభాజీ భీడేల నాయకత్వంలో ఆ రోజు హిందూ మతోన్మాదులు హింసకు పాల్పడ్డారు. వారిపై కేసులు నమోదు చేయబడినా కావాలనే అరెస్టు చేయలేదు. కానీ ఆ ఘటనలతో సంబంధం లేని అనేక మందిపై ఒక పథకం ప్రకారం మోడీ పై హత్యకు కుట్ర చేశారని, మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని, వీరంతా అర్బన్ నక్సలైట్స్ అని ఉపా చట్టం కింద, తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసులు నమోదుచేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో దాడులు చేసి నిర్బంధిస్తున్నారు.

దేశంలో ఈ రకమైన రాజ్యహింసకు, పాశవిక దాడులకు అసలు కారణాలు చాలా బలమైనవి. నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నించే మేధావి వర్గాన్ని భయపెట్టి లొంగదీసుకునే కుట్రలో భాగంగానే దీనిని అర్థం చేసుకోవాలి. ప్రజలను విభజించి పాలించటం నేర్చుకున్న పాలకులు ఇప్పుడు ప్రజల దృష్టిని మళ్ళించే ప్రయత్నంలో భాగంగా ఈ రకమైన చర్యలకు పాల్పడుతున్నారు. నోట్ల రద్దు, జీఎస్‌టీ లాంటి ప్రజావ్యతిరేక విధానాలు తెచ్చిన దుష్ఫలితాలు క్రమంగా అన్ని సెక్షన్‌ల ప్రజల నిరసనకు దారితీసాయి. నరేంద్రమోడీ ప్రారంభించిన మేక్ ఇన్ ఇండియా పేరుతో మొదలైన ఉపాధి, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అన్నీ మీడియా ప్రచారమే తప్ప వాస్తవంలో ఏమీ లేదని బట్టబయలయింది. వ్యవసాయ రంగంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సంక్షోభం కారణంగా రైతాంగ ఆత్మహత్యలు మరింతగా పెరిగాయి. ఆదివాసులపై పోలీసు, పారా మిలటరీ దాడులు, ఎన్‌కౌంటర్ హత్యాకాండ కొనసాగుతున్నాగాని విస్థాపన సమస్య ప్రజల పోరాట ఎజెండాగా మొదటి స్థానంలో కొనసాగుతుంది. అధిక ధరలు, నిరుద్యోగంలతో పాటు ప్రజల మౌలిక సమస్యలు ఈ దోపిడీ పాలకవర్గాలు పరిష్కరించవని తేలిపోయింది. ఎన్నికల్లో మరోసారి గెలవటానికి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర తప్ప ఈ అరెస్టుకు వేరే కారణాలు కనబడటంలేదు. ఇది ప్రశ్నించే గొంతుకలను నొక్కివేసే ఎత్తుగడ.

నరేంద్ర మోడీ హత్యకు కుట్ర పేరుతో అరెస్టు చేయబడ్డ వారందరూ పీడిత ప్రజల కోసం, ప్రజాస్వామిక హక్కుల కోసం చట్టబద్ధంగా ఉద్యమాలు చేస్తున్న కార్యకర్తలే. మావోయిస్టుల పాత్ర, వారితో సంబంధాలు అన్నీ కట్టు కథలే. వాళ్ల నోళ్లు మూయించటానికి ఇతరులను భయపెట్టడానికి రాజ్యం నగ్నంగా చేస్తున్న దాడులవి. సుదీర్ఘకాలం జైళ్లలో బందించడానికి, పీడిత ప్రజల నుండి దూరం చేయడానికి వేసిన పథకమే ఇది. ఇలా చేస్తే మోడీ ప్రభుత్వం తన వైఫల్యాల నుండి బయట పడలేదు సరికదా అన్ని రకాల ఉద్యమ శక్తుల్ని తనకు వ్యతిరేకంగా కూడగట్టుకుంటుంది. తన గోతిని తనే తవ్వుకొంటుంది. ఈ అరెస్టులను నిరసిస్తూ హక్కుల కార్యకర్తల విడుదలను డిమాండ్ చేస్తూ దేశంలోనూ, విదేశాలలోనూ మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కదిలారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సుప్రీంకోర్టు ఈ రకమైన అరెస్టులను నిరసిస్తూ ఉత్తర్వులనిచ్చింది. భిన్నాభిప్రాయాలను బంధిస్తే విస్ఫోటిస్తాయని కూడా కోర్టు హెచ్చరించింది. ఈ ప్రతిస్పందనకు భయపడిన ప్రభుత్వం గందరగోళంలో పడింది.

---

అయ్యింది. భారతదేశంలో రూపాయి విలువ బాగా తగ్గి సంక్షోభ తీవ్రతను చెబుతున్నది.

పై నేపథ్యంలో విచక్షణారహితంగా, దూకుడుగా అమెరికా తీసుకుంటున్న నిర్ణయాలు అంతర్జాతీయ సమాజాన్ని యుద్ధోన్మాదం వైపుకు వడివడిగా నడిపిస్తున్నాయి. సామ్రాజ్యవాద దేశాల మధ్య సాగుతున్న భౌగోళిక రాజకీయార్థిక ఆధిపత్య పోటీని, భవిష్యత్‌లో యుద్ధాల్ని నిలువరించేందుకు అంతర్జాతీయ సమాజం క్రియాశీల ప్రత్యామ్నాయ ఉద్యమాలకు సిద్ధం కావల్సి ఉంది. వాణిజ్య యుద్ధం వాస్తవ యుద్ధంగా పరిణమించకుండా నిలువరించాల్సిన బాధ్యత ప్రపంచ దేశాల ప్రజల ముందున్నది. కార్మికవర్గ నాయకత్వాన నిర్మాణమయ్యే బలమైన విప్లవోద్యమం తక్షణ అవసరంగా ముందుకొచ్చింది. ✦

# తెలంగాణలో రైతు బంధు పథకం

# రైతాంగాన్ని మోసం చేసే కేసీఆర్ వర్గ బంధు పథకం

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భూమి యజమానులనే రైతుగా గుర్తిస్తూ, వారికి పెట్టుబడి సాయం అందించడానికి రైతు బంధు పథకాన్ని తీసుకురావడంతో కౌలు రైతుల సమస్య మరొక సారి పెద్దఎత్తున ముందుకు వచ్చింది.

గత 10 ఏళ్లుగా తెలంగాణాలో కౌలు రైతుల సంఖ్య పెరుగుతున్నదని వివిధ క్షేత్రాలలో అధ్యయనాలు చేసి, ప్రభుత్వం విడుదల చేసిన డెవలప్‌మెంటు రిపోర్టు కూడ చెబుతున్నది.

తెలంగాణ రైతులకు స్వర్ణయుగం తెచ్చిందని, ఇక రైతులెవ్వరూ వడ్డీ వ్యాపారుల వద్దకు రుణాలకు పోనక్కరలేదని దేశంలో ఎక్కడా అందని విధంగా రైతులందరికి ఈ పథకం ద్వారా సాయం చేస్తామని కేసీఆర్ ప్రభుత్వం మోసపూరిత ప్రచారం చేసి కౌలురైతులను నట్టేట్లో ముంచింది. రైతుబంధు పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయం రైతులను అప్పుల ఊబిలో నుండి బయటపడేయడానికి రైతులను రక్షించడానికే అని ప్రకటనలు చేసింది. మెజారిటీగా భూమిసాగు చేస్తున్న కౌలు రైతులకు ఈ పథకాలు అందడం లేదు. భూములు చేయని భూ యజమానులకు ఈ డబ్బులు పోవడంతో రాష్ట్రంలో కౌలు రైతులు, అప్పులపాలైన రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ప్రజా ధనాన్ని, పథకాలను ఉన్నవాడికే, భూ యజమానులకే దోచిపెట్టడంతో సన్న, చిన్నకారు రైతులకు గత్యంతరం లేకపోయింది. రాష్ట్రంలో 4 వేల మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారు. అటువంటి వారికి ఉపయోగపడలేదు.

ఇప్పటి వరకు టీఆర్ఎస్ ప్రభుత్వంలో లక్షల ఎకరాల పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీ రైతులకు అటవీ హక్కుల పట్టాలు కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో లక్షన్నర ఎకరాల వరకు దేవాదాయ భూములు, వక్ఫ్‌బోర్డు భూములు ఉన్నాయి. వాటిని సాగుచేస్తున్న సన్నకారు రైతులకు కూడా ఈ పథకం అందటం లేదు. ఈ భూములకు పట్టా ఇవ్వకుండా కేసీఆర్ కుట్రబుద్ధితో కార్పొరేటు సంస్థలకు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాడు.

ప్రతి గ్రామములో కౌలు రైతులు 25 నుండి 40% వరకు ఉన్నారు. కౌలు రైతులలో 30% మంది భూమిలేని పేద రైతాంగంమే. మిగిలిన వారికి స్వంత భూమి ఒక హెక్టార్ మాత్రమే ఉంది.

కౌలుకు తీసుకుంటున్న భూమి సగటున 5 ఎకరాలు, ఎకరానికి సగటున 11,000 రూ॥ కౌలు ధర చెల్లిస్తున్నారు. 80% మంది కౌలు రైతులు భూమిని 3-5 సం॥రాలకు కౌలు తీసుకుంటున్నారు. 20% మంది మాత్రం 1-2 సం॥రాలకు తీసుకుంటారు. రైతు స్వరాజ్య వేదిక టాటా ఇనిస్ట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ సర్వే చేసిన గ్రామాలలో 20% భూమి యజమానులు మాత్రమే స్వయంగా వ్యవసాయం చేస్తున్నారని తేలింది. భూ యజమానులు కౌలు రైతులను మోసం చేయడంలో కేసీఆర్ సర్కార్ అండగా ఉన్నది. కౌలు రైతులకు 25% మందికి అధీకృత సాగుదారుల చట్టం కింద గుర్తింపు కార్డు వచ్చినప్పటికీ వారిలో ఒక్కరికి కూడ బ్యాంకు నుండి పంటరుణాలు అందడం లేదు.

ఎందుకంటే కౌలురైతులు ప్రతిసంవత్సరం మారుతారు కాబట్టి వారిని గుర్తించడం కష్టం అని, కౌలు రైతులను గుర్తిస్తే భూమి పట్టాదారులకు అన్యాయమని వారు భూములు కోల్పోతారని ప్రభుత్వం మోసపూరిత ప్రచారం చేస్తుంది. కౌలు రైతులను గుర్తించడం వలన వారికి భూమిపై హక్కు కల్పించడం ఏ మాత్రం జరుగదు. పంట రుణాలు, పంట భీమా, సబ్సిడీలు తదితర సేవలు కల్పించే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం ఈ విషయంలో కౌలు రైతుల పట్ల చిత్తశుద్ధి ఏ మాత్రం చూపదు. అన్ని విధాల భూ యజమానులకే రుణాలు ఇవ్వడానికి, లావాదేవీలు చేయడానికి టీఆర్ఎస్ మద్దతు ఇస్తుంది.

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మొత్తం రైతుల ఆత్మహత్యలలో 75% మంది కౌలు రైతులు ఉన్నట్లు క్షేత్రస్థాయి అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. రాష్ట్ర విభజన పూర్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో

---

"వాళ్ళు మానవహక్కుల కోసం పాటుబడడం, రచనలు చేయటం, విశ్లేషించటం, బోధించడం, అన్యాయానికి, అసమానత్వానికి నిరసన గళాలని అందించడం చేసారు. అసమ్మతిని, అణచివేయటాన్ని ఖండించారు. తోటి పౌరుల హక్కుల కోసం పనిచేస్తున్న వాళ్లందరితో సంఘీభావం ప్రకటిస్తున్నారు." అంటూ దేశంలోని అనేక రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రముఖ వ్యక్తులు, అనేక ప్రగతిశీల సంస్థలు, బార్ అసోషియేషన్స్, చరిత్రకారులు వివిధరూపాల్లో ప్రకటనలు, ప్రదర్శనలు చేస్తూ వారికి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారు. ఇండియన్ కల్చర్ ఫోరం చేసిన సంఘీభావ ప్రకటనలాగే నేపాల్ దేశంలోనూ, బంగ్లాదేశ్‌లోనూ పదుల సంఖ్యలో కవులు, రచయితలు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. అనేక పత్రికలు ప్రభుత్వ చర్యను ఖండిస్తూ, ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి." అంటూ వ్యాఖ్యానించాయి.

బుద్ధి జీవుల మీద నిర్బంధాన్ని అడ్డుకోవటానికి చూపిన చొరవ గొప్పది. ఇంతకన్నా ఎక్కువ నిర్బంధానికి గురవుతున్న విశాల ప్రజారాశులను ముఖ్యంగా దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, స్త్రీలు హక్కులను, ప్రజాస్వామిక స్ఫూర్తిని పరిరక్షించటానికి ఇది చాలా అవసరం.

మావోయిస్టు రాజకీయాలను, ప్రగతిశీల శక్తుల ప్రభావాన్ని, దళిత, విప్లవ శక్తుల ఐక్యతను మోడీ, అమిత్‌షాల నేతృత్వంలోని బీజేపీ గుర్తిస్తున్నట్లే. సంఘ్ పరివార్‌కు చెందిన బ్రాహ్మణీయ భావజాలం బీజేపీని నడిపించడంతో పాటు ఉద్యమ శక్తుల అణచివేత కుట్రపథకాలను తయారు చేస్తుంది. బ్రాహ్మణీయ హిందూ భావజాలానికి, బీజేపీ ప్రభుత్వ పాశవిక విధానాలకు వ్యతిరేకంగా విశాల ఐక్యసంఘటన నిర్మించి పోరాడుదాం. అక్రమ అరెస్టులను ఖండిద్దాం. వారి విడుదలకు ఉద్యమిద్దాం. ✦

26 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు అధికారిక అంచనా. వీరిలో 10 లక్షల మంది తెలంగాణాలో మిగిలిన 16 లక్షలు ఆంధ్ర, రాయలసీమలో ఉన్నారు. మొత్తం రైతులలో దాదాపు 80% మంది కౌలు రైతులున్నారని రైతు సంఘాలు పరిశోధనా అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

భూమి లేనివారికి భూమిపంచి ఇచ్చే ఉద్దేశంతో ముందుకు వచ్చిన భూసంస్కరణలు విఫలం కావటం వల్ల భూమిలేని రైతులు, రైతు కూలీలు భూస్వాముల వద్ద భూమి కౌలుకు తీసుకోవాల్సిన పరిస్థితి వల్ల కౌలుదారుల సంఖ్య పెరిగిపోయింది.

నిజానికి కౌలుదారులే వాస్తవ సాగుదారులు కానీ వారికి భూమి పట్టాలేక పోవడం చేత సంస్థాగత రుణాలు తదితర రాయితీలు సౌకర్యాలు అందటం లేదు. దీనితో అధిక వడ్డీకి ప్రైవేటు అప్పులు తీసుకొని నష్ట పోతున్నారు. అప్పుల ఊబిలో మునిగిపోతూ జీవచ్ఛవాల్లా బతుకుతూ చనిపోతున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం కౌలు రైతుల కోసం పట్టించుకోకపోవడంతో, రైతుల బతుకులు బలి చేసుకోవల్సిన పరిస్థితులు ఏర్పడినాయి. భూమి యాజమాన్యంలో ఉన్న అసమానతలు, సాగుభూమి కొద్ది మంది భూస్వాముల చేతిలో పోగుబడి పోవటం వలన వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న రైతులు, వ్యవసాయ కూలీలు చేతిలో భూమి లేకపోవటం చేత వారు భూ యజమానుల వద్ద రకరకాల పద్ధతులలో కౌలుకు తీసుకొని సాగుచేయటం చాలా దశాబ్దాలుగా జరుగుతున్నది.

వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గి, సబ్సిడీలు తగ్గి, ఖర్చులు పెరిగి, వర్షాలు సమయానికి పడక, దిగుబడులు రాక, పండిన పంటకు గిట్టు బాటుధరలు లేక రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం కౌలురైతులకు మరింత తీవ్ర స్థాయిలో అనుభవంలోకి వస్తుంది. భూమి యజమానులకు అందుబాటులో ఉన్న బ్యాంకుల రుణాలు, విత్తనాలు, తదితర ఉత్పాదకత సబ్సీడీలు, పంటల భీమా సౌకర్యం మొదలైనవి కౌలు రైతులకు దక్కకపోవటంతో రైతుల బతుకులు కుడితిలో పడిన ఎలుకవలే విల విలా కొట్టుకుంటున్నాయి.

రుణ మాఫీ వంటి పథకాలు భూమి యజమానులకే దక్కుతున్నాయి తప్ప వాస్తవంగా సాగుదారులకు దక్కడం లేదు. పైగా కౌలు రైతులకు నిర్దిష్ట కాలం పాటు భూమి అందుబాటులో ఉంటుందన్న హామీ కూడా లేకుండా పోయింది. ఏదిక్కులేని రైతాంగం ఆకాశం వైపు చూడసాగారు. భూములు పడావపడకుండా దీర్ఘకాలం పాటు కౌలు రైతులకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సహించాలంటే కౌలు పద్ధతిని పరిమితి స్థాయిలో చట్టబద్ధం చేయాలని (కుట్ర బుద్ధితో) 11వ పంచవర్ష ప్రణాళిక ప్రకటించింది. వ్యవసాయ రంగంలో ప్రైవేటు పెట్టుబడులు పెంచడానికి వీలుకలుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వ విధానాలు కూడా దీనివైపు మొగ్గుచూపాయి. అది కూడా సక్రమంగా అమలుకాలేదు.

భూమి యజమానుల ఆస్తి హక్కును ప్రమాదంలో పడకుండా భూములను ఎల్లకాలం కాపాడుకుంటూ కౌలు రైతులను భూయజమానులు నిర్దాక్షిణ్యంగా నిలువుదోపిడీ చేస్తున్నారు. భూసంస్కరణలు వచ్చినా గానీ భూములు పంచకుండా పేద ప్రజానీకాన్ని బూటకపు సంస్కరణలతో ప్రజలను మభ్యపెడుతూ భూస్వాములు, పాలకవర్గాలు వేలాది ఎకరాల భూములను వారి కబంధహస్తాల కింద పెట్టుకొని రాజ్యాధికార జులుంతో పేద ప్రజలపై అధికారాన్ని చెలాయిస్తున్నారు.

ఇక వ్యవసాయంలో 70% పనులు నిర్వహిస్తున్న మహిళలకు భూమిహక్కు లేకపోవడంతో అసలు రైతులుగానే గుర్తించకపోవటం వల్ల భూమి కౌలుకు ఇచ్చే వారిగా గానీ, కౌలుతీసుకుని సాగుచేసే వారిగా గానీ మహిళలను పరిగణిచడం లేదు. ఈ దోపిడీ వ్యవస్థలో వాస్తవానికి కౌలు ఒప్పందాలు చేసుకోవటం, కౌలు నామాలు రాసుకోవడం మొదలైన, వ్యవహారాలలో పురుషులే ప్రధాన పాత్ర వహించినప్పటికీ కొన్ని చోట్ల మహిళలు కూడా కౌలు రైతులుగా భూములుసాగు చేస్తున్నారు. మహిళలు బృందాలుగా ఏర్పడి సమిష్టిగా కౌలు తీసుకొని సాగుచేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కాబట్టి భూమిలేని మహిళలను సహకార సంఘాలుగా ఏర్పర్చి వారికి కౌలు ఇచ్చే విధంగా డిమాండ్ చేయాలి. ఈ మహిళా రైతు బృందాలకు సంస్థాగత రుణాలు తదితర మద్దతు వ్యవస్థలు కల్పించాలి.

నిజానికి సాగుదారులైన ఉన్న కౌలురైతులకు రుణ అర్హత కార్డులు, బ్యాంకు రుణాలు ఇవ్వటం లేదు. ఇవి అన్నీ ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. భూమిలేని పేద రైతాంగానికి భూమి రావాలంటే భూమి భుక్తి కోసం పోరాటం చేస్తూనే వ్యవసాయక విప్లవాన్ని విజయవంతం చేసినప్పుడే భూమి సమస్య పరిష్కారం అవుతుంది. దీనికి నూతన ప్రజాస్వామిక విప్లవ మార్గంలో ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయాలి.

✦

---

**(....౨౧వ పేజీ తరువాయి)**

భారీ నష్టాన్నే పొందినప్పటికి వాటి నుంచి గుణపాఠాలు తీసుకుంటూ బలహీనతల నుంచి బయటపడి ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తుంది. పీఎల్‌జీఏ బలగాలు ప్రజాపునాది పై ఆధారపడి 550కి పైగా వివిధ రకాల గెరిల్లా చర్యలను చేపట్టింది. 200 మంది పోలీసులను హతమార్చి 400 మందిని గాయపర్చాము. 50కి పైగా ఆధునిక ఆయుధాలను, మందుగుండును స్వాధీనం చేసుకుంది. ప్రజావ్యతిరేక రాజకీయ నాయకులను శత్రు ఏజెంట్లను నిర్మూలించి, అనేక సమస్యలపై ప్రజల్ని సమీకరించి ఆందోళనా కార్యక్రమాలు చేపట్టింది.

మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం నాలుగేళ్ళ పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. బ్రాహ్మణీయ హిందూ భావజాలంతో అన్ని సెక్షన్ల ప్రజలపైన దాడులను చేయటం వలన ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కూడగట్టుకున్నది. ప్రతిపక్ష పార్టీలు కూడా అవకాశవాద రాజకీయాల్లో మునిగి తేలుతూ ప్రజల సమస్యల్ని పట్టించుకోలేదు. అందుకే నేటి పరిస్థితులలో మావోయిస్టులు ఒక్కరే ప్రత్యామ్నాయంగానూ, ప్రజల విశ్వాసాన్ని చూరగొని మౌలిక సమస్యల పరిష్కారాలు సాధించే శక్తిగానూ ప్రజలు గుర్తిస్తున్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా విప్లవోద్యమాన్ని విజయవంతం చేయడమే శత్రువు తలపెట్టిన "సమాధాన్" దాడికి విప్లవోద్యమ సమాధాన్ ప్రతిదాడి అవుతుంది. ✦

# సెప్టెంబర్ 21 నుంచి 27వ తేదీ వరకు సి.పి.ఐ. (మావోయిస్టు) 14వ వార్షికోత్సవాలను జయప్రదం చేసిన విప్లవ ప్రజలు

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడి 14 సంవత్సరాలు కావస్తుంది. ఈ వ్యవస్థాపక దినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య దోపిడి వర్గాలను కూల్చడానికి నక్సల్‌బరీలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం బద్ధలై రివిజనిస్టు పంథాను నద్దివిరిచి ఒక నిజమైన విప్లవ పంథాను అనుసరించింది. సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ పార్టీతో పాటు ఎంసీసీఐ, పార్టీ యూనిటీ ఇంకా అనేక పార్టీలు నక్సల్‌బరీ బాట అనుసరించారు. అందరి లక్ష్యం ఈ దోపిడి వర్గాలను కూల్చడమే. కాబట్టి ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఐక్యమై సీపీఐ (మావోయిస్టు) పార్టీగా ఆవిర్భవించింది.

మావోయిస్టు పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ ఎంతో అభివృద్ధి సాధించింది. ఈ అభివృద్ధికి ఎంతో మంది కేంద్ర కమిటీ సభ్యులు, పీఎల్‌జీఏ కమాండర్లు, సభ్యులు సాధారణ ప్రజలు వీరోచితంగా పోరాడుతూ దేశవ్యాప్తంగా మూడు వేలకుపైగా కామ్రేడ్స్ తమ నులువెచ్చని రక్తాన్ని ధారపోశారు.

నక్సల్‌బరీ సాయుధ రైతాంగ వెల్లువ తాత్కాలికంగా వెనుకపట్టు పట్టిన తర్వాత భారత విప్లవోద్యమం అనేక ఆటు-పోట్లను, ఎగుడు-దిగుళ్లనూ ఎదుర్కొంటూ అలలు అలలుగా పురోగమించింది. పార్టీ కాకలుతీరింది. ఐక్య పార్టీ-సీపీఐ (మావోయిస్టు) ఏర్పడింది. మనపార్టీ ప్రతి మలుపులోనూ శత్రు ఎత్తుగడలకు దీటుగా ప్రతిదాడి ఎత్తుగడలు రూపొందించుకుని ధైర్యసాహసాలతో, దృఢసంకల్పంతో, త్యాగనిరతితో పోరాటం చేయడం ద్వారా శత్రు దాడిని తట్టుకొని నిలబడింది. ప్రజాయుద్ధం ద్వారా, ఐక్యసంఘటనా కార్యకలాపాల ద్వారా బలమైన శత్రువును ఎదుర్కొంటూ పురోగమిస్తున్నది.

ప్రజాయుద్ధం-గెరిల్లా యుద్ధంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఉద్యమ ప్రాంతాలంతటా ప్రజలను చైతన్యవంతం చేసే క్యాంపెయిన్లను నిర్వహించాయి. ఈ గెరిల్లా చర్యలు అన్నీ శత్రువును దెబ్బతీస్తూ దూకుడుగా కొనసాగుతున్న 'సమాధాన్' దాడిని నిలువరిస్తూ విప్లవోద్యమాన్ని, గెరిల్లా బేసులలో విప్లవ ప్రజల రాజకీయ అధికారాన్ని నిలబెట్టుకునేందుకు తోడ్పడ్డాయి.

**పార్టీ సైద్ధాంతికంగా, రాజకీయంగా సుదృఢపరుచుకునేందుకు సాగిన కృషి:**

దేశవ్యాప్తంగా జరిగిన బోల్షివీకరణ క్యాంపెయిన్ పార్టీ శక్తులు తీవ్రమైన శత్రుదాడిని ఎదుర్కొంటూనే పార్టీ యూనిట్లను పున:సంఘటితం చేసేందుకు సహకరించింది. పార్టీలో పితృస్వామ్య ధోరణులకు వ్యతిరేకంగా దిద్దుబాటు ఉద్యమం ద్వారా పార్టీని మరింత బోల్షివీకరించేందుకు కృషి జరుగుతున్నది.

నక్సల్బరి 50వ వార్షికోత్సవాన్ని, రష్యా విప్లవ 100వ వార్షికోత్సవాన్ని, మార్క్సిస్టు మహోపాధ్యాయులు కార్ల్‌మార్క్స్ 200వ జయంతిని అటవీ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విప్లవ రాజకీయ క్యాంపెయిన్లుగా నిర్వహించి ప్రధానంగా పార్టీ శ్రేణులలో, విప్లవ ప్రజలలో ఎంఎల్ఎం సిద్ధాంతం పట్ల ప్రపంచ సోషలిస్టు విప్లవం పట్ల దృఢసంకల్పాన్ని, విశ్వాసాన్ని పెంపొందించింది.

పార్టీ ఉద్యమ ప్రాంతాలలో ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ, పర్యావరణ, దైనందిన సమస్యలపై వేలాదిగా ప్రజలను కదిలించి అనేక పోరాటాలు నిర్మించింది. పట్టణ ప్రాంతాల్లో శక్తులు వున్నచోట విశాల ప్రాతిపదికన విద్యార్థులను, కార్మికులను, మేధావులను, మహిళలను, దళితులను, మతమైనారిటీలను సమీకరిస్తూ ఉద్యమాలు నిర్మించింది. ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడంలో భాగంగా భూమి సమతలీకరణ, ఉత్పత్తిని పెంచే కార్యక్రమాలలో ప్రజలలో సహకార ఉద్యమాన్ని అభివృద్ధి చేస్తూ వారి భాగస్వామ్యం పెంచింది. బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తుల దాడులకు వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన ఎక్కడికక్కడ ఐక్య ప్రజావేదికలు నిర్మించేందుకు కృషి చేసింది.

మోదీ నాయకత్వంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ ముఠా 2022 కల్లా 'నవభారతాన్ని' నిర్మిస్తామనీ, దేశంలో అవినీతిని, 'వామపక్ష తీవ్రవాదం'తో సహా 'ఉగ్రవాదాన్ని', కుల-మతతత్వాన్నీ రూపుమాపుతామనీ ప్రకటిస్తున్నది. వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేసేందుకు 'సమాధాన్' వ్యూహాన్ని అమలు చేస్తున్నది.

శత్రువు వ్యూహాన్ని సవాల్‌గా స్వీకరిద్దాం. వర్గ పంథా, ప్రజాపంథాలో పోరాడుదాం. సామాజిక విశ్లేషణ, వర్గ విశ్లేషణ ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ శత్రువులను, మిత్రులను గుర్తిస్తూ తగిన ఎత్తుగడలను రూపొందించుకుందాం. ప్రజా పోరాటాలలో, ప్రతిఘటనా పోరాటాలలో ప్రజలను కదిలిస్తూ వారి భాగస్వామ్యాన్ని, మిలటెన్సీని పెంచుతూ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేద్దాం. శత్రు 'సమాధాన్' దాడిని ఓడించుదాం. నక్సల్బరీ నుంచి నేటి వరకూ విప్లవం కోసం తమ ప్రాణాలు ధారపోసిన అమరులు చూపిన త్యాగాల బాటలో విజయం వైపుగా ముందుకు సాగుదాం. ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు మద్దతుగా ప్రజల్ని కూడగడదాం.

నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేద్దాం. ✦

---

**డిసెంబర్ 2 నుండి 8 వరకు**
**PLGA వారోత్సవాలను జయప్రదం చేయండి**

# స్త్రీని వ్యాపార వస్తువుగా చూస్తున్న ప్రభుత్వాలు

బుడి బుడి అడుగులు వేస్తూ, ఆడుతు పాడుతు అమ్మ, నాన్నల దగ్గర అల్లరి చేస్తూ అలరించే అభం, శుభం తెలియని చిన్నారులపై మానవ మృగాలు దాడులు చేస్తూ అత్యాచారం చేసి, హత్యలు చేస్తున్నారు. వ్యభిచార గృహాలకు తరలించి వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇది ఒక చోట రెండు చోట్ల కాదు. దేశం, రాష్ట్రం, జిల్లా, మండలం, పల్లె ఎక్కడ చూసినా వ్యభిచార గృహాలు దర్శనమిస్తాయి. ఈ వ్యభిచార గృహాలను నడుపుతున్నది మరెవరోకాదు. మాఫియా ముసుగులో వున్న రాజకీయ నాయకులే. దేశంలో ఎక్కడ చూసినా ప్రతిరోజు మహిళలపై, చిన్నారులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, గృహహింస, లైంగిక వేధింపులు, ప్రేమోన్మాదుల దాడులు, యాసిడ్ దాడులతో గుండె పగిలిపోయే విషాదకరమైన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

దేశంలో బాలికలపై పెరుగుతున్న లైంగిక నేరాల నుండి రక్షించటం కోసం 2012లో పోక్సో చట్టాన్ని తీసుకువచ్చారు. దాన్ని అమలు చేయకపోవటంతో మానవ మృగాలు పేట్రేగిపోయి బాలికలపై నిరంతరం లైంగిక దాడులు చేస్తునే వున్నారు. ఢిల్లీలో జ్యోతిసింగ్ అనే విద్యార్థినిపై బస్సులో మానవ మృగాలు అత్యాచారం చేస్తే, ప్రజల్లో దాగివున్న దావాగ్ని బద్దలై వెల్లువ సృష్టించటంతో కేంద్ర ప్రభుత్వం నిర్భయ చట్టాన్ని తీసుకువచ్చింది. ప్రభుత్వాలు కంటితుడుపు చర్యలుగా ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా వాటిని చిత్తశుద్ధితో అమలు చేయకపోవటంతో మహిళలపై దాడులు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి.

కశ్మీర్‌లో కథువాలో సంచార తెగకు చెందిన ఎనిమిదేళ్ల బాలిక అసిఫాపై బి.జె.పి. పార్టీకి చెందిన కార్యకర్తలు అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. అసిఫాను అత్యాచారం చేసిన దోషులను వెంటనే శిక్షించాలని ప్రజలు, మహిళలు ఆందోళనలో భాగంగా బి.జె.పి. దిష్టిబొమ్మలు దహనం చేశారు. అయినా వారిని శిక్షించలేదు. ఈ సంఘటన నుండి తేరుకోక ముందే తెలంగాణలోని పెద్దపల్లిలో నాలుగేళ్ల బాలికపై మానవ మృగం అత్యాచారానికి పాల్పడితే ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం శిక్షించిన పాపానపోలేదు. తెలంగాణ రాజధాని మహానగరంగా పేరు పొందిన హైదరాబాద్‌లో మాఫీయాల పడగనీడలో రాజకీయ నాయకుల అండదండలతో పోలీసు బాసుల కనుసన్నల్లో పేద ముస్లిం మైనర్ బాలికలను అరబ్ వృద్ధ షేక్‌లకు నిఖా పేరుతో అమ్మకాలు చేస్తున్న దళారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దేశంలో సంవత్సరానికి 40 వేల అత్యాచారాల కేసులు నమోదైతే అందులో 18 వేల అత్యాచారాలు బాలికలపైనే జరుగుతున్నాయని 2016 సంIIలో నమోదైన లెక్కలు చెబుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరాలను తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకోకుండా మొద్దునిద్ర పోతున్నాయి.

ప్రపంచంలోని అన్నిచోట్ల బాలికలపై, మహిళలపై, ముసలివాళ్లపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దానికి భారతదేశం మినహాయింపేమికాదు. భారత దేశంలో అధికారంలోకి వచ్చిన బ్రహ్మణీయ హిందూ మతోన్మాద పార్టీ బి.జె.పి., నరేంద్రమోడీ నాయకత్వంలోని ప్రభుత్వం మనువాదాన్ని అమలు చేస్తూ దళితులపై, ముస్లింలపై, ఆదివాసులపై, మహిళలపై అణిచివేతదాడులను తీవ్రతరం చేసింది. "ఎక్కడైతే మహిళలు పూజింప బడతారో అక్కడ దేవతలు అవతరిస్తారని" చెబుతూ, "బేటిబచావో, బేటి పడావో" అంటూనే మహిళలను, బాలికలను వ్యభిచార గృహాలకు తరలిస్తున్న దళారులకు కొమ్ముకాస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని దేవరియా జిల్లాలో వసతి గృహంలో ఉన్న యువతులను వేశ్యలుగా మార్చి చిత్రహింసలు పెడుతూ వ్యభిచారం చేయిస్తున్నారు. సంరక్షణ అంటూ రక్షణ లేకుండా చేస్తున్నారు. బీహార్ రాష్ట్రంలో అనాథాశ్రమాలు, పునరావాస కేంద్రాలు, వితంతు–అభాగ్య మహిళల సంరక్షణ పేరిట వసతి గృహాలు కల్పిస్తామని చెప్పి మహిళలను తీసుకురావటం జరిగింది. మహిళలను వసతి గృహంలో ఉంచి వారిపై భౌతిక దాడులు, లైంగిక హింసలు, అత్యాచారాలు చేస్తున్నారు. ఈ వసతి గృహాలలో 15 నుంచి 18సంవత్సరాల బాలికలే ఎక్కువగా వున్నారు. వసతి గృహాలలో ఒకచోట 30 మంది బాలికలపై నెలల తరబడి అత్యాచారాలు జరుగుతున్నట్లు తెలిసినా ప్రభుత్వం కానీ, పోలీసులు కానీ పట్టించుకోవటం లేదు. ఈ గృహాలను నడుపుతున్నది రాజకీయ నాయకులు కావటంతో, పోలీసులకు లంచాలు అందటంతో చూసిచూడనట్లు వుంటున్నారు.

పేదరికం ఎక్కడవుంటుందో ఆకలి చావులు అక్కడే వుంటాయి. పురుషులతో పోల్చుకున్నప్పుడు మహిళల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంటుంది. కూలీ పనులు దొరకక, తినటానికి తిండి లేక, అనారోగ్యాలను బాగుచేసుకునే స్తోమతులేక, దిక్కుతోచని నిస్సాహాయ స్థితిలో మురికివాడల్లో జీవిస్తున్న పేదల ఇండ్లముందు దళారీలు గద్దల్లా వాలి "బాలికలకు చదువులు చెప్పిస్తామని, మహిళలకు ఉద్యోగాలు కల్పిస్తామని వీటితో పాటు వసతి సౌకర్యం ఉంటుందని" మాయమాటలు చెబుతూ అందరిని అక్రమ రవాణా చేస్తూ వారితో బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారు.

### యాదగిరి గుట్టలో గుట్టుగా వ్యభిచారం నడుపుతున్న మాఫీయా

తెలంగాణ రాష్ట్రంలో యాదగిరి గుట్టతో పాటు 8 ప్రాంతాలలో వ్యభిచార గృహాలు నడుపుతున్నారు. వీధిలో ఆడుకునే చిన్నారులకు చాకెట్లు, బిస్కెట్లు ఆశ చూపి చిన్నారులను వ్యభిచార గృహాలకు తీసుకుపోతున్నారు. కనీసం ఆడుకోవడానికి బయటకు పంపించాలన్నా తల్లిదండ్రులు భయపడుతున్నారు. పేదరికంలో వున్న యువతులకు డబ్బు ఆశ చూపించి వ్యభిచార గృహాలు నడుపుతున్నారు. వస్తు మార్పిడి చేసినంత సులభంగా యువతులను రవాణా చేస్తున్నారు. మంచిర్యాలకు వెళ్లే రహదారిపై ఇరువైపుల 20కి పైగా వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నారు. నిజామాబాద్‌లో పదేళ్లుగా వ్యభిచారం నడుస్తున్నది. ఈ వ్యభిచార గృహాలలో 15 సంIIల వయస్సున్న మైనర్ బాలికలు, 20సంIIల వయస్సున్న యువతులు ఉన్నారు. రాజధాని మహానగరం హైదరాబాద్‌కు, విజయవాడ నుండి యువతులను, చిన్నారులను రవాణా చేస్తున్నారు.

యాదగిరి గుట్ట ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. లక్ష్మినరసింహ స్వామిని

దర్శించుకోవడానికి రోజూ వేలాది మంది వచ్చిపోయే భక్తులతో కిటకిటలాడే దేవస్థానం. రాజకీయ నాయకుల భాగస్వామ్యంతో, పోలీసు బాసుల అండదండలతో వ్యభిచార గృహాలు నడిపిస్తున్న మాఫీయాలకు ఆ ప్రాంతం నిలయంగా మారింది. ఈ మాఫీయాలు అమాయకులైన యువతులకు, పేదరికంలోవున్న యువతులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బు ఆశ చూపించి బలవంతంగా వ్యభిచార గృహాలకు తరలిసున్నారు., వ్యతిరేకించిన మహిళలపై భౌతిక దాడులు చేస్తూ, మత్తు మందులు ఇచ్చి వారిపై అత్యాచారం చేస్తూ వీడియోలు తీసి బెదిరింపులకు గురి చేసి వ్యభిచారులుగా మార్చి లక్షలాది రూపాయలు సొమ్ముచేసుకుంటున్నారు. మహిళల శరీరాలను అమ్ముకొని వచ్చిన డబ్బులను రాజకీయ నాయకులకు, పోలీసు అధికారులకు వాటాలు ఇచ్చి వ్యభిచారాన్ని యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. వీధులలో ఆడుకునే బాలికలకు చాక్లెట్లు, రంగు రంగుల ఆట వస్తువులు ఇచ్చి ఎత్తుకెళ్లి ఆక్సోటోన్ ఇంజక్షన్లు, మందులతో బాలికల శరీర ఆకృతిని పెంచుతూ వ్యభిచారం చేయిస్తున్నారు. ఆ బాలికల అరుపులు వినపించకుండా నేల మాళిగల్లో బంధించి చిత్రహింసలు పెడుతున్నారు. 5 సం॥రాల పిల్లలతో వ్యభిచార గృహాలలో పనులు చేయించుకుంటున్నారు. ఆదాయం కోసం చిన్నారుల జీవితాలను చిదిమేస్తూ, పుట్టిన పాపతో కూడా వ్యాపారం కొనసాగించే దోపిడీ పాలన తెలంగాణలో కొనసాగుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న నేరాలను, హింసలను, మహిళలపై దాడులను అరికడతానని ముఖ్యమంత్రి కే.సీ.ఆర్. వేల సంఖ్యలో పోలీసు బలగాలను ఏర్పాటు చేయటమే కాకుండా ప్రజల డబ్బుతో ఆధునిక పరిజ్ఞానంతో తయారైన సి.సి. కెమెరాలను రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఏర్పాటు చేశారు. కేంద్ర స్థాయిలో కూడా ఏర్పాటు చేశారు. కానీ వాటి వలన ప్రయోజనం శూన్యం. సినిమా, టీ.వి., ఇంటర్నేట్, పేస్ బుక్, వాట్సాప్‌లలో స్త్రీలను కించపరిచే అశ్లీల చిత్రాలను, వీడియోలను ప్రవేశ పెడుతున్నారు. సమాజంలో సామ్రాజ్యవాద విష సంస్కృతికి పాలక వర్గాలే స్వాగతం పలుకుతున్నాయి. మహిళలను ఆట వస్తువుగా, అమ్ముకునే సరుకుగా వ్యక్తిత్వం లేని రెండో పౌరురాలిగా దోపిడీ పాలక వ్యవస్థ చూస్తుంది. "మహిళా అభివృద్ధే దేశ అభివృద్ధి" అని మాట్లాడుతూ మహిళల రక్తమాంసాలతో ఆదాయాన్ని పెంచుకుంటుంది. హిందూత్వ, బ్రాహ్మణీయ, మనువాద పితృస్వామ్య భావజాలంతో మహిళలను బంధించి నిత్యం అణచివేతను కొనసాగిస్తున్నారు. మహిళలను వంటింటికే పరిమితం చేస్తూ పురుషుని కోరిక తీర్చే యంత్రంగా భావిస్తున్నారు.

ఈ దోపిడీ పాలక వ్యవస్థ నుండి మహిళ విముక్తి జరగాలంటే వర్గ పోరాటం ద్వారానే సాధ్యమవుతుంది. వర్గ పోరాటంలో మహిళలు పాల్గొనకుండా నూతన సమసమాజం ఏర్పడదు. నూతన సమాజం ఏర్పడకుండా మహిళా విముక్తి జరగదు. స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం పొందాలంటే వర్గ పోరాటమే ఏకైక మార్గం. ✦

---

## ఛత్తీస్‌గఢ్ మొదటి దశ ఎన్నికలు

## విప్లవోద్యమ ప్రాంతాల్లో విజయవంతమైన ఎన్నికల బహిష్కరణ

ఒక లక్షా 25 వేల పోలీసు, పారామిలటరీ బలగాలతో, హెలికాప్టర్ల పహారాతో, పకడ్బందీ ఏర్పాట్లతో నిర్వహించినప్పటికీ బస్తర్‌లో విప్లవ ప్రజానీకం స్వచ్ఛందంగా ఓట్లు వేయకుండా ఎన్నికలను బహిష్కరించారు. లోతట్టు అటవీ ప్రాంతాలంతటా, పరిసర మైదాన ప్రాంతాలన్నింటిలోను ఎన్నికల బహిష్కరణ విస్తృతంగా ప్రచారం చేసారు. జనతన సర్కార్లు ఉన్న ప్రాంతాల్లోను, విప్లవ ప్రజాసంఘాలు క్రియాశీలకంగా ఉన్నచోట ఎన్నికల బూతులు పెట్టలేదు. కనీసంగా పోలీసు పారామిలటరీ బలగాలు దరిదాపులకు చేరలేదు. అలా ప్రయత్నించిన కొన్ని చోట్ల ప్రతిఘటనలో దెబ్బతిని నష్టపోయి వెనక్కి వెళ్ళారు.

అక్టోబరు 27న జేగురుగొండ ఏరియా మురుదొండ సమీపంలో మైన్‌ప్రూఫ్ వాహనంలో వస్తున్న వారిలో నలుగురు సీఆర్‌పీఎఫ్ పోలీసులు చనిపోయారు. ఇద్దరు గాయపడ్డారు. అక్టోబరు 30న నీలవాయ్ దగ్గర దర్భ డివిజన్‌లో ముగ్గురు డీఆర్‌జీకి చెందిన పోలీసులు చనిపోగా ఒకరికి గాయాలయ్యాయి. (పోలీసులతో రావడం వల్ల కెమెరామెన్ కూడా చనిపోయాడు) పామేడ్ ఏరియా జారంపల్లి దగ్గర ఎన్నికలు రోజున నవంబరు 12న ఐదుగురు కోబ్రా బెటాలియన్ బలగాలు చనిపోగా ఇద్దరు గాయపడ్డారు. (పోలీసుల మోరైల్ దెబ్బతింటుందని బలగాలు చనిపోయిన విషయాన్ని ప్రకటించలేదు) ఈ ఘటనలో పీఎల్‌జీఏకి సంబంధించిన ఒక మహిళా కామ్రేడ్ రోస్సీ (బీఎన్–సీవైపీసీ సభ్యురాలు) గాయపడి తర్వాత అమరురాలైది. మరో ఇద్దరు గాయపడ్డారు. పశ్చిమబస్తర్ డివిజన్ బోపాలపట్నం సమీప మొదుకుపల్లిలో ఆరుగురికి గాయాలయ్యాయి. కాంకేర్ జిల్లా కొయిలబేడా దగ్గర ఒక ఎస్ఐ చనిపోగా, ఒక జవానుకు గాయాలయ్యాయి. ఆరన్‌పూర్‌లో ఇద్దరు, చింతల్‌నార్ దగ్గర ఒక్కరు ఎదురుకాల్పుల్లో గాయపడ్డారు. వివిధ ప్రాంతాల్లో బూబీట్రాపుల్లో 18 మంది గాయపడ్డారు. పీఎల్‌జీఏ చేతికి ఒక ఇన్‌సాస్ ఎల్ఎమ్‌జీ, ఒక ఏకే 47 తుపాకీలతో పాటు మ్యాగ్జిన్స్, తూటాలు దొరికాయి.

వాస్తవాలు ఇలా ఉండగా మావోయిస్టు ప్రాంతాల్లో ఎన్నికలు శాంతియుతంగా జరిగాయని, అత్యధిక పోలింగ్ నమోదయ్యిందని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. అధిక, బలగాలను దించి పోలీసు క్యాంపుల్లో బూతులు పెట్టి ఓట్లు రిగ్గింగ్ చేసారు. ఈ రిగ్గింగ్ ప్రమాదాన్ని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, తెలంగాణ రాష్ట్ర కమిటీలు ముందుగానే హెచ్చరిస్తూ ఇచ్చిన ప్రకటన ఎన్నికల రోజునే టీవీలలోను, పత్రికల్లోను వచ్చింది. ఎన్నికలను బహిష్కరించి విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో భాగంగా లక్షలాదిగా ఉన్న సైనిక బలగాలను ప్రతిఘటిస్తున్న ప్రజా గెరిల్లా విముక్తి సైన్యానికి, విప్లవ ప్రజానికానికి జైజైలు పలుకుదాం.

సిద్ధాంత వ్యాసం

# నేర్చుకోవడంలో నైపుణ్యం సంపాదించడం ముఖ్యం

- కామ్రేడ్ మావో

ఎర్రసైన్యాన్ని ఎందుకు నిర్మించుకున్నాం?

శత్రువులను ఓడించడానికి.

యుద్ధ సూత్రాలు మనం ఎందుకు అధ్యయనం చేయాలి?

యుద్ధంలో వాటిని అన్వయించడానికి.

నేర్చుకోవడం అంత సులభమైంది కాదు. దానిని ఆచరణలో అన్వయించడం అంతకంటే కష్టమైంది. చాలా మంది పాఠశాలల్లోనూ, పుస్తకాల్లోనూ మిలటరీ శాస్త్రంపై చర్చ జరిగేటప్పుడు బాగా రాణిస్తారు. కానీ వాస్తవ పోరాటం దగ్గరకు వచ్చేటప్పటికి కొంత మంది విజయాలు సాధిస్తారు, కొంత మంది ఓడిపోతారు. యుద్ధ చరిత్ర, యుద్ధంలో మన అనుభవం దీనినే రుజువుపరిచాయి.



కనుక ఇందులో కీలక సమస్య ఏంటి?

వాస్తవ జీవితంలో 'ఎప్పుడూ విజయాలు సాధించే సేనానుల' కొరకు ఎదురుచూడకూడదు. చరిత్రలో అలాంటివారు చాలా తక్కువగానూ, అరుదుగానూ లభిస్తారు. ధైర్యస్తులయిన సూక్ష్మ బుద్ధిగల సాధారణంగా యుద్ధంలో విజయాన్ని సాధించగలిగిన తెలివి, ధైర్యం సమ్మిళితం చేయగల సేనానుల కొరకు మాత్రమే మనం వెతకాలి. తెలివితేటలు, ధైర్యం రెండూ ఉండాలంటే నేర్చుకోవడంలోనూ, నేర్చుకున్నది అన్వయించడంలోనూ క్రమ పద్ధతి అనుసరించాలి.

ఆ పద్ధతి ఏమిటి? శత్రువు పరిస్థితిని గురించిన అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఇతరుల యుద్ధ చర్యలకు సంబంధించిన సూత్రాలను కనిపెట్టాలి. వాటిని మన కార్యాచరణలో వుపయోగించుకోవాలి.

'పరిస్థితులను బట్టి సూత్రాలను జాగ్రత్తగా అన్వయించడం'లోను, ఓటమి సందర్భంలో విషయంలోను తీసుకోవల్సిన చర్యల ఆవశ్యకతను గుర్తించాల్సినదిగా అనేక దేశాల మిలటరీ మాన్యుయల్స్ స్పష్టపరుస్తున్నాయి. సూత్రాలను గుడ్డిగా అన్వయించడం ద్వారా స్వీయాత్మకంగా చేసే తప్పుల గురించి కమాండర్‌ను హెచ్చరించడానికి మొదటి విషయం చెబుతున్నారు. స్వీయాత్మక తప్పుల వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితిని తట్టుకోవడానికి భౌతిక పరిస్థితుల్లో అకస్మాత్తుగా, నివారించడానికి వీలుగాని మార్పుల వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులను తట్టుకోవడానికి రెండవ విషయం చెప్పబడింది.

స్వీయాత్మక తప్పులు ఎందుకు జరుగుతాయి? ఒక యుద్ధంలో గానీ, అందులోని ఒక పోరాట రంగంలో గానీ మిలటరీ బలగాల విభజన, వాటి నిర్వహణ నిర్దిష్ట కాలం, స్థలం యొక్క పరిస్థితులకు తగ్గట్టుగా లేకపోవడం వల్లనూ, భౌతిక పరిస్థితులకు స్వీయాత్మక యుద్ధ నిర్వహణకు సమన్వయం కుదరనందువల్లనూ మరొక మాటలో చెప్పాలంటే స్వీయాత్మక పరిస్థితులకు, భౌతిక పరిస్థితులకు మధ్య వైరుధ్యం పరిష్కరించబడకపోవడం వల్ల స్వీయాత్మక తప్పులు సంభవిస్తాయి. ఎవరికైనా అటువంటి పరిస్థితులు తప్పవు. కొంతమంది మిగతా వారికంటే ఎక్కువ సామర్థ్యంతో అటువంటి పరిస్థితులను ఎదుర్కొని పరిష్కార మార్గాలు కనుగొంటారు. ఇతర పనుల్లోలాగే యుద్ధంలో కూడా ఉన్నత స్థాయి శక్తి సామర్థ్యాలు అవసరం. యుద్ధంలో ఎక్కువ విజయాలనూ, తక్కువ ఓటములనూ ఆశిస్తాం. భౌతిక పరిస్థితులకు, స్వీయాత్మక పరిస్థితులకు మధ్య సరైన సమన్వయం వుండడమనేది ఇక్కడ కీలక సమస్య.

ఎత్తుగడల్లో ఒక ఉదాహరణ తీసుకోండి. శత్రు సైన్యం పక్క భాగంలో, ఒక స్థలంలో దాడి చేయదల్చుకున్నప్పుడు, సరిగ్గా ఆ స్థలం శత్రువు యొక్క బలహీన స్థలం అయినప్పుడు, ఆ దాడి విజయవంతం అవుతుంది. అంటే ఇక్కడ భౌతిక పరిస్థితికి, స్వీయాత్మక పరిస్థితికి సమన్వయం కుదిరిందన్నమాట. అంటే స్థావరాల గురించి ముందుగా కమాండర్ సేకరించిన సమాచారం, అతని అంచనా, నిర్ణయం, శత్రువు యొక్క వాస్తవ పరిస్థితికి, శత్రు బలాలు మోహరించిన పరిస్థితికి తగ్గట్టుగా ఉన్నాయన్నమాట. దాడి చేయదల్చుకున్న స్థలం మరొకటి అయినప్పుడు, లేక శత్రు స్థావరంలో అది కేంద్ర స్థానం అయినపుడు ఆ దాడి విఫలమై తీరుతుంది. అపుడు భౌతిక పరిస్థితికి, స్వీయాత్మక పరిస్థితికి సమన్వయం కుదరలేదన్నమాట. సరైన సమయంలో దాడి జరిగితే రిజర్వు సైన్యాన్ని తొందరపడి ముందుగా గానీ, లేక ఆలస్యంగా గానీ ఉపయోగించడం గాకుండా, సకాలంలో ఉపయోగించగలిగితే ఆ పోరాటంలో మిగతా పరిస్థితులన్నీ శత్రువుకు కాకుండా మనకు ఉపయోగపడితే మొత్తం యుద్ధంలో భౌతిక పరిస్థితికి, సీయాత్మక

మార్గదర్శకత్వానికి సమన్వయం కుదిరిందన్నమాట. రెండు పక్షాలు సజీవులైన, సాయుధులైన మానవులతో వ్యవహరించవలసి వుంది. ఒకరి రహస్యం మరొకరికి తెలియదు. అందువల్ల భౌతిక పరిస్థితులకూ, స్వీయాత్మ పరిస్థితులకు, నూటికి నూరుపాళ్లు సమన్వయం కుదరడం చాలా అరుదుగా మాత్రమే జరుగుతుంది. రోజువారీ విషయాలతో లేక ప్రాణంలేని వస్తువులతో, వ్యవహారం ఇందుకు పూర్తిగా భిన్నమైంది. అయినా కమాండర్ దర్శకత్వం ప్రధానాంశంలో భౌతిక పరిస్థితులకు సరిపోయేలాగుంటే, అంటే దర్శకత్వంలోని ప్రధానాంశాలకూ, వాస్తవ పరిస్థితులకు మధ్య సమన్వయం కుదిరితే విజయానికి పునాది ఏర్పడిందన్నమాట.

ఒక కమాండర్ తన సైన్యాలను వివిధ వైపుల మోహరింప చేయడం అనేది అతని సరైన నిర్ణయాలపై ఆధారపడి వుంటుంది. అతని సరైన నిర్ణయాలు, సరైన అంచనాలపై ఆధారపడి వుంటాయి. సరైన అంచనాలు, అవసరమైన గూఢచారి చర్యలపైనా, వాటి ద్వారా సేకరించిన సమాచారాన్ని కూర్చుకోవడం పైన ఆధారపడతాయి. శత్రు పక్షం వైపు 'సమాచారం సేకరణకు అన్ని రకాల పద్ధతులు అవలంభించాలి. శత్రు పక్షం నుండి సేకరించిన సమాచారాన్ని గురించి జాగ్రత్తగా ఆలోచించుకోవాలి. పనికి రాని అంశాలు తోసివేసి ముఖ్యమైన అంశాలు తీసుకోవాలి. అవాస్తవిక విషయాలు తోసివేసి వాస్తవ విషయాలు తీసుకోవాలి. ఒకదాని నుండి ఇంకొక దానిని, బయటి విషయాల నుండి లోపలి విషయాలను పరిశీలించాలి. అపుడు స్వంత పక్షంలోని పరిస్థితులను అంచనాలోకి తీసుకోవాలి. రెండు పక్షాల వైపు పరిస్థితులనూ, వాటి పరస్పర సంబంధాలను అధ్యయనం చేయాలి. కమాండరు దానిపై ఆధారపడి సరైన అంచనాలు వేసుకుంటాడు. వాటిపై సరైన నిర్ణయాలు తీసుకుంటాడు. వీటిపై ఆధారపడి ప్లానులు తయారు చేసుకుంటాడు. ఒక కమాండరు వ్యూహాత్మక ప్లాన్లను తయారు చేసుకోవడంలో కానీ, ఒక పోరాటానికి సంబంధించిన ప్లాను తయారు చేసుకోవడంలో గానీ పై విధానాన్నంతా అనుసరించాలి. ఈ పద్ధతి అనుసరించకుండా మిలటరీ అధికారి తన స్వంత వ్యూహాలపై ఆధారపడి తన మిలటరీ ప్లాను తయారు చేసుకుంటే, అవి ఊహాగానంపై ఆధారపడినవి తప్ప వాస్తవ పరిస్థితులపై ఆధారపడినవి మాత్రం కావు. కేవలం తన స్వంత ఉత్సాహం పైననే ఆధారపడిన, నిగ్రహంలేని మిలటరీ ఆఫీసరు శత్రువు చేత సులభంగా మోసగించబడతాడు. అననుకూల పరిస్థితుల్లో యుద్ధానికి దించబడగలుగుతాడు. శత్రు పక్షంలో పైకి మాత్రం కానవచ్చే కొన్ని బలహీనతలు గానీ, పాక్షిక అంశాలను చూసి గానీ లోతైన జ్ఞానమూ, దూర దృష్టి లేని కింది ఆఫీసర్ల బాధ్యతా రహితమైన ప్రోత్సాహం వల్ల గానీ, తొందరపాటు చర్యలకు దిగుతాడు. ఫలితంగా గోడకు గుద్దుకొని తల బద్దలు చేసుకుంటాడు. సరైన శత్రు సమాచార సేకరణపైన శత్రు పరిస్థితి, తన పరిస్థితి మధ్యగల సంబంధాలను జాగ్రత్తగా పరిశీలించడం పైన ప్రతి మిలటరీ ఆఫీసరు తన ప్లానును తయారు చేసుకోవలసి వుంటుంది. పైన చెప్పిన నిగ్రహంలేని మిలటరీ ఆఫీసరుకు ఈ విషయాలు తెలియవు. కనీసం తెలుసుకోవడానికి ప్రయత్నం కూడా చేయడు.

ఒక పరిస్థితిని తెలుసుకునే క్రమం మిలటరీ ప్లాను తయారు చేసుకోవడంతోనే ఆగిపోదు. ఆ తర్వాత కూడా కొనసాగుతుంది. ఆ ప్లానును ప్రారంభించి, తుదిదాకా అమలుజరిపే సమయంలో, పరిస్థితిని అర్థం చేసుకునే క్రమం మరొకటి వుంది. అదే ఆచరణ క్రమం. ఈ ఆచరణ క్రమంలో తయారు చేసుకున్న ప్లాను వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తున్నదా లేదా అని పరిశీలించాలి. ఆ ప్లాను వాస్తవ పరిస్థితులకు తగ్గట్లుగా లేకపోతేనో, సంపూర్ణంగా తగ్గట్టుగా లేకపోతేనో, కొత్తగా సంపాదించిన అనుభవాన్నీ, సమాచారాన్ని బట్టి, నూతన అంచనాలు తయారు చేసుకోవాలి. నూతన నిర్ణయాలు చేయాలి. మొదటి ప్లానును మార్చి నూతన పరిస్థితులకు తగ్గ ప్లానును తయారు చేసుకోవాలి. అపుడు అన్ని మిలటరీ చర్యలలోనూ, పాక్షిక మార్పులు జరగక తప్పదు. కొన్ని సందర్భాల్లో ప్లానును మొత్తంగానే మార్చును చేయవల్సి వుంటుంది. అటువంటి మార్పు చేయవలసిన అవసరాన్ని గుర్తించనీ లేక మార్పు చేయడానికి అంగీకరించని గుడ్డిగా ప్రవర్తించే మిలటరీ అధికారి గోడకు గుద్దుకొని తల బద్దలు చేసుకుంటాడు.

పై సూత్రం ఒక వ్యూహాత్మక చర్యకూ, ఒక క్యాంపెయిన్‌కు లేక ఒక యుద్ధ రంగానికి వర్తిస్తుంది. అనుభవం కలిగిన ఒక మిలటరీ ఆఫీసరు అణకువ కలవాడయితే, నేర్చుకోవడానికి సంసిద్ధత కలవాడయితే, తన బలాల స్వభావాన్ని, శత్రు బలాల స్వభావాన్ని (ఇరువైపుల కమాండర్లు, సైనికులు, ఆయుధాలు, సప్లయి వగైరాల మొత్తం పరిస్థితి) అర్థం చేసుకుంటాడు. యుద్ధానికి సంబంధించిన మిగతా అన్ని విషయాలను అంటే రాజకీయ, ఆర్థిక, భౌగోళిక వాతావరణ పరిస్థితిని అర్థం చేసుకుంటాడు. అటువంటి మిలటరీ అధికారి యుద్ధాన్ని నడపడంలో లేక ప్రత్యేక పోరాటాన్ని నడపడంలో ఎక్కువ శక్తి సామర్థ్యాలు చూపించగలుగుతాడు. విజయాలు సాధించ గలుగుతాడు. దీర్ఘకాల అనుభవంలో, శత్రు పక్షం పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకోవడం వల్లనూ, ఈ యుద్ధ చర్య సూత్రాలను అర్థం చేసుకోవడం వల్లనూ, భౌతిక పరిస్థితులకూ, స్వీయాత్మక పరిస్థితులకు మధ్య వున్న వైరుధ్యాన్ని పరిష్కరించుకోగల్గడం వల్లనూ అతడు విజయాన్ని సాధించగలుగుతాడు. అన్ని విషయాలు తెలుసుకునే ఈ అధ్యయన క్రమం అతి ముఖ్యమైనది. ఇటువంటి దీర్ఘకాల అనుభవం లేకుండా, మొత్తం యుద్ధానికి సంబంధించిన సూత్రాలు అర్థం చేసుకోవడం, వాటిపై పట్టు సాధించుకోవడం చాలా కష్టమైన పని. ప్రారంభదశలో వున్నవాడు గానీ, పేపరుపైన మాత్రమే యుద్ధం నడిపేవాడు గానీ, వాస్తవంగా ఉన్నత స్థాయికి చెందిన కమాండర్‌గా అభివృద్ధి చెందలేడు. యుద్ధంలో నేరుగా పాల్గొనడం ద్వారానే అటువంటి అనుభవం సంపాదించుకోగల్గుతాడు.

మిలటరీ సూత్రాలూ, సిద్ధాంతాలు సూత్రబద్ధ స్వభావం కలవి. గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల్లో వచ్చిన అనుభవాన్ని క్రోడీకరించడం వల్ల వచ్చిన ఈ గుణపాఠాలను మనం లోతుగా

అధ్యయనం చేయాలి. ఇది ఒక విషయం మాత్రమే. మనం గమనించాల్సిన మరొక విషయం కూడా వుంది. ఈ గుణపాఠాలను మన అనుభవంలో పరీక్షకు గురిచేయాలి. వుపయోగంలేని దానిని తోసిపుచ్చి ఉపయోగకరమైన దానిని స్వీకరించి నిర్దిష్టమైన మన అనుభవాలను వాటికి జోడించాలి. కడపటి విషయం చాలా ముఖ్యమైనది. లేకపోతే యుద్ధాన్ని నడపలేము.

చదవడం ద్వారానే నేర్చుకోగలుగుతాము. అయితే అమలు జరపడం కూడా నేర్చుకోవడమే. అలా నేర్చుకోవడం అనేది అతి ముఖ్యమైన పద్ధతి. యుద్ధాన్ని యుద్ధం ద్వారా నేర్చుకోవడం మన ముఖ్యమైన పద్ధతి. స్కూలుకు వెళ్లి చదువుకోవడానికి వీలులేని వాడు కూడా యుద్ధ నైపుణ్యం సంపాయించుకోగలడు. అతను యుద్ధంలో నేరుగా పోరాటంలో పాల్గొనడం వల్ల నేర్చుకోగలుగుతాడు. విప్లవ యుద్ధం, ప్రజలు చేసే యుద్ధం. అనేక సందర్భాలలో మొదట నేర్చుకోవడం, తర్వాత చేయడం సాధ్యం కాదు. చేయడం మొదట, తర్వాత నేర్చుకోవడం. ఎందుకంటే, చేయడమే నేర్చుకోవడం. సాధారణ పౌరులకీ సైనికునికి మధ్య అగాధం వున్నమాట వాస్తవమే గానీ ఈ అగాధం చైనా గోడ లాంటిది కాదు. దీన్ని త్వరలోనే అధిగమించగలుగుతాం. విప్లవంలో, యుద్ధంలో పాల్గొనడం ద్వారా ఈ అగాధాన్ని త్వరలోనే అధిగమించగలుగుతాం. నేర్చుకోవడం, దానిని అమలుపర్చడం సులభమైనది కాదు అని మనం అంటున్నామంటే, దాని అర్థం సంపూర్ణంగా నేర్చుకోవడం, నైపుణ్యంగా అమలు జరపడం కష్టమని మాత్రమే. సాధారణ పౌరులు కూడా చాలా త్వరలోనే సైనికులుగా తయారు కావచ్చునని అంటున్నామంటే దాని అర్థం గడపదాటడం కష్టమైన పని కాదని మాత్రమే. ఈ రెండు స్టేట్‌మెంట్లు కలిపితే చైనాలోని ఒక సూక్తికి సరిపోతుంది. ''ఒక దానిని సాధించడానికి దృఢ నిశ్చయుడైన వానికి ప్రపంచంలో సాధించలేనిది ఏదీ లేదు. గడప దాటడం అంత కష్టమైన పని కాదు. ఈ పనిలో పూర్తిగా నిమగ్నుడైతే నేర్చుకునే మంచి స్వభావం వుంటే అందులో నైపుణ్యం సంపాదించడం కూడా సాధ్యమే.

ఇతర అన్ని విషయాలకు సంబంధించిన సూత్రాల మాదిరే యుద్ధ సూత్రాలు కూడా భౌతిక, వాస్తవిక విషయాలకు మన మనస్సు ప్రతిబింబాలు మాత్రమే. మన మనసుకు బాహ్యమైన విషయమంతా భౌతిక వాస్తవమే. కనుక మనం తెలుసుకోవలసినవీ, నేర్చుకోవలసినవీ శత్రు పక్షపు, స్వపక్షపు పరిస్థితులు ఇవి రెండూ అధ్యయనం చేయాల్సిన విషయాలుగా గుర్తించాలి. ఆలోచించగల మెదడు మాత్రమే ఈ అధ్యయనం చేయాల్సిన విషయాలుగా గుర్తించాలి. ఆలోచించగల మెదడు మాత్రమే ఈ అధ్యయనం సాగించగల కర్త. కొంత మంది స్వపక్షాన్ని గురించి బాగా తెలుసుకోగలుగుతారు. శత్రు పక్షం గురించి తెలుసుకోవడంలో బలహీనత కనబరుస్తారు. మరికొంత మంది శత్రుపక్షం గురించి తెలుసుకోగలుగుతారు. స్వపక్షం గురించి తెలుసుకోవడంలో బలహీనత కనబరుస్తారు. యుద్ధ సూత్రాలను నేర్చుకోవడం, అమలు జరపడం అనే సమస్యను వీరిద్దరూ కూడా పరిష్కరించుకోలేరు. చైనా పురాతన చరిత్రలో గొప్ప మిలటరీ శాస్త్రజ్ఞుడిగా ప్రసిద్ధి చెందిన సున్‌జూ ఇలా చెప్పాడు. **"శత్రువు గురించి తెలుసుకో, నిన్ను గురించి తెలుసుకో, అప్పుడు ఓటమి భయం లేకుండా నీవు వంద యుద్ధాలు చేయగల్గుతావు."** నేర్చుకునే దశకూ, అమలు జరిపే దశకు వాస్తవ, భౌతిక పరిస్థితి యొక్క అభివృద్ధి క్రమానికి సంబంధించిన సూత్రాలు తెలుసుకోవడానికి, ఎదుర్కొంటున్న శత్రువును ఓడించడానికి ఈ సూత్రాలపై ఆధారపడి మన పోరాట ఎత్తుగడలను నిర్ణయించుకోవడానికి పై సూక్తి వర్తిస్తుంది. ఈ సూక్తిని మనం తేలికగా తీసుకోరాదు.

జాతుల మధ్య, దేశాల మధ్య, వర్గాల మధ్య, రాజకీయ గ్రూపుల మధ్య సాగే పోరాటపు అత్యున్నత రూపమే యుద్ధం. విజయం సాధించడానికి జాతులు, దేశాలు, వర్గాలు, రాజకీయ గ్రూపులన్నీ యుద్ధ సూత్రాలను అమలు పరుస్తాయి. యుద్ధంలో విజయం లేక ఓటమి అనేది ప్రధానంగా రెండు పక్షాల వైపున వున్న మిలటరీ, రాజకీయ, ఆర్థిక సహజ పరిస్థితులపై ఆధారపడి వుంటుందనేది నిస్సందేహమైన విషయం. అయితే ఇవి మాత్రమే యుద్ధంలో విజయాన్ని లేక, ఓటమిని నిర్ణయించలేవు. యుద్ధాన్ని నిర్వహించడంలో రెండు పక్షాల స్వీయాత్మక ప్రతిభ కూడా దీనిని నిర్ణయిస్తుంది. యుద్ధాన్ని జయించే ప్రయత్నంలో మిలటరీ అధికారి భౌతిక పరిస్థితులు విధించే పరిమితులను దాటిపోతాడు. అయితే పరిమితులకు లోబడే విజయాన్ని సాధించవచ్చు. సాధించడానికి కృషి చేయాలి కూడా. భౌతిక పరిస్థితులపై ఆధారపడి సైనిక నిపుణుడు కార్యాచరణకు అవసరమైన రంగస్థలం నిర్మించుకుంటాడు. అయితే ఆ రంగ స్థలంపైననే శబ్దం, రంగూ, శక్తి, వైభవాలతో కూడిన ఎన్నో నాటకాలను రక్తి కట్టించ గలుగుతాడు. కనుక ప్రస్తుతమున్న నిర్దిష్టమైన భౌతిక పునాదులపై ఆధారపడి అంటే మిలటరీ, రాజకీయ, ఆర్థిక, సహజ పరిస్థితులపై ఆధారపడి ఎర్రసైన్యం కమాండర్లు తమ శక్తి సామర్థ్యాలన్నింటినీ ప్రదర్శించాలి. తమ శక్తులన్నింటినీ కూడగట్టుకొని జాతీయ శత్రువులను, వర్గ శత్రువులను అణచివేయాలి. దుష్ట ప్రపంచాన్ని మార్చాలి. యుద్ధం నడపడంలో మన స్వీయాత్మక శక్తిని ప్రదర్శించవలసింది ఇక్కడే. మన ఎర్రసైన్యం కమాండర్లలో ఎవరూ కూడా తప్పులు చేసే తలబిరుసుదనం ప్రదర్శించడానికి మనం అంగీకరించం. ప్రతి ఎర్రసైన్యం కమాండర్ ఒక వీరుడుగా తయారు కావాలని ఖచ్చితంగా ఆశిస్తాం. అతడు ధైర్యవంతుడు గానూ, వివేకవంతుడుగానూ వుండాలి. అతడు ఎదురులేని సాహసం, యుద్ధంలోని అన్ని దశలలోనూ, మార్పులలోను కూడా పరిస్థితులను తన చేతిలో ఉంచుకోగల శక్తిగలవాడుగా వుండాలి. అంతేకాకుండా, యుద్ధం అనే సముద్రంలో ఈదుతూ మధ్యలో మునిగిపోకుండా నిర్ణీతమైన బారలు వేసుకుంటూ అవతలి ఒడ్డుకు తప్పకుండా చేరుకోగలగాలి. యుద్ధాన్ని నడిపించే సూత్రాలు, యుద్ధం అనే సముద్రంలో ఈత లాంటి కళ. మన పద్ధతులను గురించి ఇక ముగిస్తాను.

✦

సంస్మరణ

# మల్కన్‌గిరిలో అమరురాలైన కా॥ నేలకొండ ప్రమీల (జిలానీ, మీన) జీవిత చరిత్ర

అక్టోబర్ 12న ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లోని బెజ్జింగి దగ్గర ఆంద్రపల్లిలో కామ్రేడ్ ప్రమీలను నిరాయుధంగా పోలీసులు అరెస్టు చేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు. ఆమెతో పాటు ఉన్న మరో ఇద్దరు కామ్రేడ్స్‌ను కూడా అరెస్టు చేసారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తుతం జనగాం జిల్లా, బచ్చన్నపేట మండలం, పోచన్నపేట గ్రామంలో దళిత కుటుంబంలో కా॥ జిలానీ పుట్టింది. పోచన్నపేట గ్రామానికి ఒక చరిత్ర ఉంది. పగిడేరు అమరులు, గొర్రె పోచన్న, భారతక్క అనే పోరు దంపతులు అమరులైనారు. కా॥ జిలానీకి గొర్రె పోచన్న, భారతక్క అన్నావదినలు. చేర్యాల ప్రాంతంలో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వాన సాగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటాల ప్రభావంతో 1993 డిసెంబర్‌లో 13న కా॥ జిలానీ పూర్తికాలం పార్టీలోకి వచ్చి విప్లవ జీవితాన్ని ప్రారంభించింది. కా॥ జిలానీకి ఇంటి దగ్గర పెండ్లి చేసారు. అతిచిన్న వయస్సులో పెండ్లి చేయడం భర్త సరిగా చూసుకునేవాడు కాదు. అందువలన తను విడాకులు తీసుకుంది. కా॥ జిలానీ కుటుంబంలో ముగ్గురు అన్నలు. తను చిన్న అమ్మాయి.



పీపుల్స్‌వార్ పార్టీ ఆ ఏరియాలో బలంగా ఉండేది. దోపిడికి గురయ్యే కులాల నుండి కా॥ జిలానీ వచ్చింది. అప్పటికే కా॥ జిలానీ వాళ్ళ అన్న వెంకన్న కూడా ప్రజాసంఘాలల్లో పనిచేసేవాడు. కా॥ జిలానీ అన్న తర్వాత అకిరాశుపల్లికి వచ్చి ఉన్నాడు. అట్లా కా॥ జిలానీ వచ్చి ఇక్కడ అకిరాశుపల్లిలో ఉండేది. అప్పటికే 1990లోనే గొర్రె పోచన్న, భారతక్క నాయకత్వాన దళాలు తిరిగేవి.

తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం చరిత్ర కొనసాగింపుగా 1990లో ఒక వెల్లువ వచ్చింది. ఆ మైదాన ప్రాంతంలోని ప్రతి ఊరిలో ఒక పెద్ద బురుజు ఉంటుంది. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో రజాకార్లకు వ్యతిరేకంగా కొట్లాడిన బురుజులుంటాయి. ఆ ప్రాంతంలో ఒక్కొక్క గ్రామం వారసత్వం, పోరాట చరిత్ర ఆ బురుజే చెబుతుంది. ఇలాంటివి చేర్యాల ప్రాంతంలో చాలా ఉన్నవి. కా॥ జిలానీ అన్నతో పాటు క్రేన్ నడుపుతుండేది. ఆ క్రమంలో కా॥ జిలానీకి పార్టీతో సంబంధాలు ఏర్పడినాయి. రిక్రూట్ అయిన తరువాత ఏరియా దళంలో పనిచేసింది. ఆ తర్వాత 2 సంవత్సరాలు నెక్కొండ దళంలో పనిచేసింది. తర్వాత తెలంగాణ ప్లాటూన్‌లో పనిచేసింది. అనారోగ్యంతో హస్పటల్‌కి వెళ్లినప్పుడు కా॥ జిలానీ అరెస్టు అయినది. ఒక సంవత్సరన్నర జైలులోనే ఉంది. జైలు నుండి విడుదల అయిన తర్వాత మళ్లీ పార్టీలోకి వచ్చింది. తనని పార్టీ ఏటూరునాగారం బదిలీ చేసింది. ఏటూరునాగారం ఎల్ఓఎస్ కమాండర్‌గా, మహిళా దళ కమాండర్‌గా, మహదేవ్‌పూర్ ఎల్ఓఎస్ కమాండర్‌గా పనిచేసింది. కా॥ జిలానీ లాంటి వాళ్ళను కూడా నైపుణ్యంగల వారిగా పార్టీ ఎలా తయారు చేస్తుందో చాలా స్పష్టంగా కా॥ జిలానీ చరిత్రను చూస్తే అర్థమవుతుంది.

శత్రువు విషయంలో కసితో ఉండేది. చాలా పట్టుదలతో చదువు నేర్చుకుంది. కమాండర్‌గా తను బాధ్యలు తీసుకుని క్యాడర్‌కు సమిష్టి చెప్పేటప్పుడు తను చదివిన విషయాలు, తనకు గుర్తున్న విషయాలు, విశ్లేషణాత్మకంగా చెప్పడానికి ప్రయత్నం చేసేది. న్యూనతా భావానికి గురికాకుండా మాట్లాడే తత్వం జిలానీలో ఉండేది. సుదీర్ఘకాలంగా అనేక ఒడుదుడుకులల్లో, నిర్బంధంలో, అనారోగ్యంగా ఉన్నా కా॥ జిలానీ వెనకాముందాడలేదు. తనకు థైరాయిడ్ వచ్చి చాలా అనారోగ్య సమస్యలకు గురైంది, కొన్ని అనారోగ్య సమస్యలైతే తనకి పరీక్షపెట్టినాయి. కానీ ఎప్పుడూ జిలానీ గుండె చెదరలేదు. మిగతా వారికి ఒక స్పిరిట్‌గా ఉండేది. ఏఓబీలో ఈ గుట్టలు ఎలా ఎక్కగలుగుతున్నావు జిలానీ! అంటే "మనకు ఏదో శక్తిఉండి కాదు ప్రజలు పడే కష్టాలు, ప్రజలు పోరాడుతున్న పరిస్థితులు నడిపిస్తున్నాయి" అనేది. జిలానీలో ఉన్న ఆ మొండితనమే నడిపిస్తుంది.

కా॥ జిలానీ ఇంటి దగ్గర ఉన్నప్పుడు చాలా కష్టపడుతుండేది. బయట మహిళలపై ఉన్న అణచివేత, కట్టుబాట్ల చట్రంలోనే కా॥ జిలానీ జీవితం గడిపింది. పార్టీలోకి వచ్చిన కా॥ జిలానీ తన తెలివితేటలను పెంచుకుంది. మిలటరీలో కూడా చాలా యాక్టివ్‌గా ఉండేది. శత్రువు అంటే తను ఎప్పుడూ వెనక్కి తగ్గేది కాదు. తను అరెస్టు అయినప్పుడు కూడా శత్రువుకు ఎలాంటి సమాచారం చెప్పలేదు. ఉద్యమ ప్రస్థానంలో ఫిబ్రవరి 7, 2005లో కాటారం పోలీసులు మీనాను అరెస్టు చేసారు. ఏప్రిల్ 2006లో బెయిల్‌పై విడుదలై తిరిగి ఉద్యమంలో చేరింది. కా॥ జిలానీ పార్టీలో ఉన్న పితృస్వామ్యాన్ని ఎదిరించేది. తను దళంలో ఉన్నప్పుడు అన్నలతో పోటీపడేది, మీరు చేయగలుగుతారు, మేం చేయలేమా? అని పోటీపడేది. అన్నలతో సమానంగా బరువులు మోసేది. మీరు ఈ పని చేయలేరు అని అంటే, మేం ఎందుకు చేయలేము అని తను ఆ పని చేసి చూపించేది. ఏదైనా సమస్య మీద డైరెక్ట్‌గా, స్పష్టంగా పార్టీ నాయకత్వంతో మాట్లాడేది. తను చేర్యాల, అన్నాసాగర్, నెక్కొండ, నర్సంపేటలలో పనిచేసింది.

ఆమె ఉత్తర తెలంగాణ మొదట పీఎల్‌ల్లో పనిచేస్తూ ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా తిరిగింది. ఉత్తర తెలంగాణ పీఎల్ చేసిన యాక్షన్లలో పాల్గొన్నది. కా॥ జిలానీ ఒక సుదీర్ఘకాలం, అనారోగ్యాన్ని అధిగమిస్తూ, "ప్రజలే గురువులు, ప్రజలే చరిత్ర నిర్మాతలు" అన్న సత్యాన్ని గుర్తించి పనిచేసింది. అన్ని రంగాల్లో మహిళలు రిక్రూట్ అయ్యారు. ఏటూరునాగారం ఏరియాలో నిర్బంధం ఎక్కువ ఉండేది. ఏటూరునాగారంలో ప్రతిఘటన, న్యూడెమోక్రసీ, పనిబాక్షి, వీరన్న గ్రూపులుండేవి. వీటి అన్నిటితో పాటు జనశక్తి పార్టీ ఉండేది. చాలా ఘర్షణలు జరిగేవి. ఇన్ని రకాల పార్టీలకు సహాయపడే ప్రజలు ఉంటారు. అట్లాంటి పరిస్థితి ఏటూరునాగారం, మహాదేవ్‌పూర్ ప్రాంతంలో ఉండేది. ఇక్కడ చాలా చైతన్యవంతంగా ఉండే ప్రజలు ఉంటారు. ఎవరి రాజకీయం ఏంటిది, విప్లవ పార్టీల పేరులో ఉండే రివిజనిస్టు పార్టీలది ఏంది అనేది, పీపుల్స్‌వార్ ఏంది అనేది ప్రజలకు చాలా రాజకీయ స్పష్టత ఉంటుంది. కాబట్టి ఆ ఏరియాలకు కమాండర్‌గా పనిచేయాలంటే వీళ్ళందరి రాజకీయాలను ఓడించగలగాలి. అట్లాయితేనే పార్టీకి నాయకత్వంలో ఉన్న కమాండర్‌లు అక్కడ గెలవగలుగుతారు. మామూలుగా ఉంటే అక్కడ గెలవలేరు. ఏటూరునాగారం, మహదేవ్‌పూర్, కొత్తగూడెం, నర్సంపేట ప్రాంతంలో పనిచేసే ఏ కమాండరైనా ప్రజలు విశ్వసించాలి. అలాంటి విశ్వాసాన్ని కా॥ జిలానీ సంపాదించింది. ఈ సుగుణాలన్నీ ఉన్న జిలానీకి పార్టీ పద్ధతులల్లో కా॥ గణేష్‌తో 1998లో వివాహం జరిగింది.

తెలంగాణలో చాలా ఎదురుకాల్పుల ఘటనల్లో పోరాడుతూ తప్పించుకుంది. ఒక్క నెలలోనే 5,6 ఎన్‌కౌంటర్‌లు జరిగిన సందర్భాలున్నాయి. ఎదురుకాల్పుల్లో గాయపడిన కామ్రేడ్స్ ఒకవైపున ఉంటే మరో వైపున గాయాలయి చనిపోతూ తుపాకులు తీసుకెళ్ళండి అని చెప్పిన పరిస్థితులు ఉండేవి.

నెక్కొండలో ఎన్‌కౌంటర్ అయినప్పుడు కా॥ జిలానీ ఉదయం పూట టిఫిన్ చేస్తున్నది. ఇన్‌ఫర్మేషన్‌తో వచ్చిన పోలీసులు మూడు దిక్కుల నుండి వచ్చి కాల్పులు జరుపుతుంటే, ఒక పెద్ద లోయలో దూకి జిలానీ మరికొంత మంది కామ్రేడ్స్ ఫైరింగ్ చేసారు. పోలీసుల రాపిడ్ ఫైరింగ్‌లో అరుణ పడిపోయింది, మహేష్‌కు తూటాపడ్డది. తీసుకుపోండి మమ్మల్ని అని అంటున్నారు. కమాండర్ కామ్రేడ్ కడారి రాములు అడ్వాన్స్ కాండి అని చెప్పినప్పుడు కా॥ జిలానీ అడ్వాన్స్ అయింది. గాయపడ్డ నారన్నను తీసుకొని వచ్చింది. ఆ కాల్పుల్లో ధైర్యంగా పాల్గొంది. ఇట్లా చెప్పుకుంటూ పోతే చాలా ఎదురుకాల్పుల ఘటనల్లో కా॥ జిలానీ పాత్ర ఉన్నది.

1999 డిసెంబర్ 2వ తేదీన ముగ్గురు కేంద్రకమిటీ సభ్యులను పోలీసులు పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపినపుడు ఏటూర్‌నాగారం మండల కేంద్రంలో డిసెంబర్ 6వ తేదీన పోలీసు జీపుపై దాడిచేసి ముగ్గురు పోలీసులను ఖతంచేసి మూడు తుపాకులు తెచ్చిన ఘటనలో కా॥ జిలానీ క్రియాశీలంగా పాల్గొంది. 2001లో వరంగల్ జిల్లా ఏటూర్‌నాగారం పోలీసు క్యాంపుపై డైరెక్షనల్ మైన్స్‌తో చేసిన దాడిలో క్రియాశీలంగా పాల్గొంది. ఈ ఘటనలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ పోలీసులు చచ్చారు. ఈ ఘటన శత్రు గుండెల్లో రైల్లు పరుగెత్తించింది. ఆ రోజుకు ఏటూరునాగారం ఏరియాలో విప్లవోద్యమం బలం పుంజుకోవడానికి కా॥ జిలానీ అనేక విప్లవ కార్యక్రమాలలో క్రియాశీలంగా పాల్గొంది. నిర్మాణ కృషి చేసింది. ముఖ్యంగా మహిళలను సంఘటితపరుస్తూ సారా వ్యతిరేక పోరాటం, ఇతర పోరాటాలు చేయించింది. ఇలా వివిధ రకాల రాజకీయ, ఆర్థిక పోరాటాలలో ప్రజలను సంఘటితం చేసింది.

2008 నవంబర్‌లో ఏఓబీకి బదిలీ అయింది. డీవీసీ మెంబర్‌గా ఏసీ సెక్రటరీగా పార్టీ పాడియా బాధ్యతలు ఇచ్చింది. ఎన్నో శత్రుదాడుల్లో ధైర్యంగా పనిచేసింది. అనారోగ్య సమస్యలను కూడా లెక్కచేయకుండా తనకు ఇచ్చిన బాధ్యతలు నిర్వర్తించింది. మల్కన్‌గిరి జిల్లాలో పోలీసు అధికారులు లొంగిపోయిన వారితో సమాచారం సేకరించి ఎన్నోసార్లు జిలానీని పట్టుకుంటామని, ఎంతోమంది సవాళ్ళు చేసేవారు. పాడియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జానకి అమరురాలైన ఎదురుకాల్పుల ఘటనలో కా॥ జిలానీ తృటిలో తప్పించుకుంది. దళాన్ని మొత్తాన్ని రిట్రీట్ చేయించింది. గాయాలైన కామ్రేడ్స్‌ని బయటకి పట్టుకుని వచ్చి ట్రీట్‌మెంట్ చేయించింది. ప్రజలకు ధైర్యాన్నిచ్చి ఉద్యమాన్ని నిలబెట్టింది.

శీలకోటలో ఉద్యమాన్ని పునర్నిర్మించిన మీనా:

5సం॥ల క్రిందట ప్రచార వారోత్సవాల సందర్భంగా కలిమెల బ్లాక్ నుండి వచ్చిన సీఎన్ఎమ్ ప్రచార దళం శీలకోట గ్రామంలో మీటింగు జరిపి దగ్గరలోనే ఒకచోట నిద్రపోయారు. అర్ధరాత్రి పూట పోలీసులు దాడిచేసి నిరాయుధులైన పిల్లలపై కాల్పులు జరిపి 16 మందిని పాశవికంగా హత్యచేసారు. అందులో 11సం॥ల బాలిక కూడా ఉందని విస్తృతంగా ప్రచారం జరిగింది. ఏకే 47 ఆయుధాన్ని ఉంచి డీవీసీఎమ్ చనిపోయినట్లు ప్రకటించారు. ఆ ఘటన తాలూకు వాస్తవాలను మీనా బయటి ప్రపంచానికి వెలుగుచూసేలా చేసింది. పోలీసులు సృష్టించిన భయభీతావాహ వాతావరణం నుండి ప్రజల్ని బయటపడవేసింది. ఐక్యంగా ప్రతిఘటించేందుకు సిద్ధపరిచి ఇన్‌ఫార్మర్ల మీద చర్య తీసుకుంది. ఒక ఇన్‌ఫార్మర్ ద్వారా శత్రువును రప్పించి ఆంబుష్‌లో ఇరికించి దెబ్బకొట్టడంలో కీలక భూమికను ప్రదర్శించింది. శీలకోట అమరులకు స్థూపం నిర్మించి చుట్టూ పండ్లు మొక్కలు నాటి తోటను తయారు చేసుకున్నారు ప్రజలు.


ఉద్యమం పట్ల అంచంచల విశ్వాసంతో పనిచేసిన మీనా ఎడల ప్రజలకు, కేడర్‌కు అపార విశ్వాసం ఉండేది. ఆమె ఎక్కడ ఉన్నా అనేక మంది ఆమె చుట్టూ ఉండేవారు. అందరి అవసరాలను పట్టించుకుని, సమస్యలను పరిష్కరించేది. ఆమె చొరవ, పట్టుదల, ఉత్సాహం రాంగూడ అమరుల (31 మంది) సంస్మరణ సభల సందర్భంగా కూడా కనబడింది. సీనియర్ కామ్రేడ్ ప్రమీల అమరత్వం పార్టీకి తీరని లోటు. ఆమె ఆశయ సాధనకు వినమ్రంగా కృషి చేద్దాం. ✦

# విప్లవ విద్యార్థి ఉద్యమ ఆర్గనైజర్, మంచి డాక్టర్

# కామ్రేడ్ సుంకరి రాజకుమార్ (అరుణ్)కు అరుణారుణ జోహార్లు

ఈ దోపిడీని నిర్మూలించేంత వరకు పోరాడుతూనే ఉందాం. నూతన సమాజాన్ని నిర్మించుకుందాం. ఇదే కా॥ అరుణ్ ఆశయం. దీన్ని నిజం చేయడమే మన అసలైన నివాళి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, కుర్నపల్లి గ్రామం వద్ద జులై 24, 2018వ తేదీన నిరాయుధుడుగా ఉన్న కా॥ అరుణ్‌ను తెలంగాణ పోలీసులు పట్టుకొని, కత్తులతో పొడిచి ఆ తరవాత కాల్చిచంపారు.



కా॥ రాజ్‌కుమార్ అలియాస్ అరుణ్ భూపాలపల్లి జిల్లా దూదేకులపల్లి గ్రామం సుంకరి రామక్క-నమ్మయ్య దంపతులకు ఆరో సంతానంగా 35 సంవత్సరాల క్రితం జన్మించాడు. వీరికి ముగ్గురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు అందరిలో చిన్నవాడు కావడంతో రాజ్‌కుమార్ అంటే కుటుంబానికి అమితమైన ప్రేమ. అల్లారు ముద్దుగా పెంచారు.

కా॥ రాజ్‌కుమార్ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. కొన్నాళ్ళు దూదేకులపల్లి గ్రామంలో విద్యా వాలంటీర్‌గా పని చేశాడు. ఇక్కడ ప్రభుత్వాలు పట్టించుకోక, ప్రాథమిక పాఠశాలలో సరైనా సౌకర్యాలు లేక విద్య నిర్లక్ష్యానికి గురైంది. పంతుళ్ళు లేక, పిల్లలకు చదువులు అందకపోవడంతో తానే విద్యా వాలంటీర్‌గా చేరి పిల్లలకు విద్యను బోధించాడు. ప్రజల సహకారంతో విద్యా వసతులను మెరుగుపరిచాడు. పిల్లలకు పాఠాలు బోధించడంతో పాటు, గ్రామ ప్రజలకు వైద్య సేవలు కూడా అందించాడు.

చిన్న వయసు నుండే పార్టీని చూస్తూ పెరిగాడు. గ్రామ రాజ్య కమిటీ ఆధ్వర్యంలో సాగే ప్రజాభివృద్ధి కార్యక్రమాలను చూశాడు. బీజప్రాయంలో వున్న రాజ్యాధికారాన్ని చూశాడు. పీపుల్స్‌వార్ పార్టీ రాజకీయాల ప్రభావంతో బుద్దారం, పంబాపూర్, బోనగిరిపల్లె, దూదేకులపల్లే గ్రామాల ప్రజలు సంఘటితమై భూ పోరాటాలలో, కూలీరేట్ల పోరాటాలలో వెల్లువలా కదులుతుంటే ఉత్తేజం పొందాడు. దూదేకులపల్లె ప్రతి ఇల్లు విప్లవోద్యమంతో అడుగులు వేసింది. పార్టీ కార్యక్రమాలకు కేంద్ర బిందువు అయ్యింది. కా॥ రాజ్‌కుమార్ కుటుంబం కూడా విప్లవోద్యమంలో భాగమై పని చేసింది. కా॥ రాజ్‌కుమార్‌ను ఆ ఉత్సాహమే విప్లవ కారున్ని చేసింది. బాలల సంఘంలో చేరి చురుకైన పాత్ర పోషించాడు. 8వ తరగతి చదువుతున్న సమయంలోనే పార్టీతో సంబంధం ఏర్పడింది. పార్టీ పట్ల, ప్రజలపట్ల తనకున్న విశ్వాసాన్ని చూసి పార్టీ కొరియర్ బాధ్యతను అప్పగించింది. శత్రువు నిర్బంధాల మధ్య అత్యంత ధైర్యసాహసాలతో శత్రువు కండ్లు కప్పి కొరియర్ పనిని చేశాడు. ఈ క్రమంలోనే పార్టీతో, ప్రజలతో మరింత రాజకీయ బంధాన్ని పెనవేసుకొన్నాడు. ప్రజలే చరిత్ర నిర్మాతలని గట్టిగా నమ్మాడు.

తన వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించలేదు. దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం బానిసలుగా మార్చే విద్యావాలంటరీని వదిలేశాడు. సమాజ అభివృద్ధి కోసం శాస్త్రీయ విద్యనందించాలని కోరుకున్నాడు. ఉపరితలంలో మార్పు జరగాలంటే భూస్వామ్య దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాద, వ్యవస్థ పునాదులను పెకిలించి వేయాలని నిర్ణయించుకొన్నాడు. నూతన సమాజ నిర్మాణం కోసం దీర్ఘకాలిక సాయుధ పోరాట బాటలో అడుగులు వేశాడు. 2002 డిశంబర్‌లో పూర్తి కాలం కార్యకర్తగా మునుపటి సి.పి.ఐ.(ఎం.ఎల్) పీపుల్స్‌వార్‌లో దళ జీవితాన్ని ప్రారంభించాడు.

2005లో కా॥ రాజ్‌కుమార్ పార్టీ పనులపై కొరియర్‌గా వెళ్తుండగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అనేక చిత్రహింసలు పెట్టి జైళ్ళో బంధించారు. పోలీసుల క్రూర చిత్రహింసల మూలంగా తన రెండు చెవులు వినికిడి శక్తిని కోల్పోయాయి. తన ఎడమ చెయ్యి విరిగింది. అయినప్పటికీ పార్టీ రహస్యాలు మాత్రం చెప్పలేదు. ఒక సంవత్సరం పాటు జైలు జీవితాన్ని అనుభవించాడు. జైల్లో ఏనాడు నిబ్బరాన్ని కోల్పోలేదు.

2006లో జైలు నుండి బెయిల్‌పై రిలీజ్ అయ్యి మళ్లీ దళంలో చేరాడు. ఒక పక్క శత్రువు నిర్బంధం పెరిగి ఎన్‌కౌంటర్లు జరుగుతున్నప్పటికీ ఊగిసలాడలేదు. వినికిడి శక్తి కోల్పోయినా, చెయ్యి విరిగినా, ఆరోగ్యం క్షీణించడంతో మితంగానే తింటూ బలహీనమైనప్పటికి ఇవేవి గెరిల్లా యుద్ధానికి ఆటంకంగా భావించలేదు. తన రాజకీయ చైతన్యం, మానసిక దృఢత్వాన్ని, ప్రజాయుద్ధ సంకల్పాన్ని మరింత పెంచి తనను ముందుకే నడిపాయి. ఏనాడు వెనక్కి తిరిగి చూడలేదు.

జైలు నుండి విడుదల అయి వచ్చి 2006 మహాదేవ్‌పూర్ దళంలో కొంత కాలం పని చేసి ఆ తరవాత ప్రొటెక్షన్ ప్లటూన్‌లో 2007 వరకు పని చేశాడు. 2008లో ఏటూరునాగారం-మహదేవ్‌పూర్

దళంలోకి బదిలీ చేయడం జరిగింది. 2008 ఆగస్టులో ఏరియా కమిటీ బాధ్యతలు చేపట్టాడు. ఇక్కడే ఒక సంవత్సరం పని చేశాడు. శత్రువు నిర్బంధం పెరుగుతున్న సమయంలో తిరగడానికి అనారోగ్యం ఆటంకం కావడంతో 2009లో దండకారణ్యానికి బదిలీ చేయడం జరిగింది. దండకారణ్యంలో పశ్చిమ బస్తర్ డివిజన్ మద్దేడు ఏరియాలో ఏరియా కమిటీ సభ్యుడుగా 2010 నుండి 2017 వరకు ఏడు సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించాడు. ఇక్కడి ఉద్యమంలో తన వంతు కృషి చేశాడు. అనేక మంది విద్యార్థులను సంఘటితపరిచాడు. ఆదివాసుల మధ్యకు వెళ్ళి భాషను, యాసను నేర్చుకున్నాడు. వారితో మమేకమయ్యి వారిలో ఒక్కడు అయ్యాడు. తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకుంటూ, చురుకుదనంతో సృజనశీలంగా పనిచేసాడు.

2017లో కా॥ అరుణ్ నిర్ణయం మేరకే పార్టీ తెలంగాణకు బదిలీ చేయడం జరిగింది. 2017లో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా చర్ల–శబరి ఏరియా కమిటీలో బాధ్యతలు చేపట్టి ఉద్యమ పునర్ నిర్మాణం కోసం పాటుపడ్డాడు. ఇక్కడ కూడా విద్యార్థి సంఘాల బాధ్యతనే తీసుకొన్నాడు. అనేక మంది విద్యార్థులను కలిశాడు. సంఘాల నిర్మాణాల కోసం శ్రమించాడు. వివిధ పోరాటాలలో ప్రజలను కదిలించాడు. ప్రజల దైనందిన సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ ప్రజల మధ్యనే ప్రజా సమస్యలను పరిష్కరించేవాడు. ప్రజలను ఎప్పుడు పార్టీ వైపు నిలబెట్టడానికి కృషి చేశాడు.

ఏ పనిని అప్పగించిన బాధ్యతాయుతంగా చేసేవాడు. ఏ దళంలో పని చేసిన విప్లవోద్యమ నిర్మాణంతో పాటు డాక్టర్‌గా, టీచర్‌గా సేవలందించేవాడు. చాలా కాలం డాక్టర్‌గా పి.ఎల్.జి.ఎ. బలగాలకు, సాధారణ ప్రజలకు వైద్య సేవలందించాడు. సేవాదృక్పథంతో, ఆదర్శవంతంగా పని చేస్తూ ప్రజల డాక్టరుగా ప్రజల హృదయాల్లో నిలిచాడు. వైద్యం గురించి బాగా తెలిసినందువలన అతని సలహాలు తీసుకోవడానికి, అతనితో వైద్యం చేయించుకోవడానికి కేడర్, ప్రజలు ఇష్టపడేవారు. వైద్యానికి సంబంధించిన సాహిత్యాన్ని పోగుచేసుకుని చదవడం, అందరికీ ఇవ్వడం చేసేవాడు.

2010లో కామ్రేడ్ నవత (సృజన)ను వివాహం చేసుకొన్నాడు. ప్రజాయుద్ధంలో కలిసి పని చేస్తూ ఒక్కరినొక్కరు అర్థం చేసుకొన్నారు. కలిసి జీవించాలని నిర్ణయించుకొని పార్టీకి తెలియజేశారు. పార్టీ ఆమోదంతో ఇద్దరు ఒక్కటయ్యారు. వీరిరువురు వేరువేరు రంగాలలో పనిచేసారు. వారి వైవాహిక జీవితం అన్యోన్యంగా సాగింది. 2016 మార్చి 1వ తేదీన బొట్టెం గ్రామం వద్ద తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు చుట్టుముట్టి చేసిన దాడిలో కామ్రేడ్ సృజన అమరత్వం చెందింది. కా॥ సృజన అమరత్వం తీవ్రమైన బాధను కల్గించినప్పటికీ వర్గ కసితో ముందుకు సాగాడు.

కా॥ రాజ్‌కుమార్ సౌమ్యుడు, మృదుస్వభావి, అందరితో కలుపుగోలుపుగా ఉండేవాడు. తన క్రింది కేడరుకు క్రమశిక్షణతో పాటు, రాజకీయ, సైద్ధాంతిక అవగాహనను కల్పిస్తుండేవాడు. తాను ఒక మంచి కవి కూడా. అమర వీరుల త్యాగాలను ఎత్తిపడుతూ సృజన కలం పేరుతో కవితలు రాస్తుంటాడు. కవితలు రాసే కామ్రేడ్స్‌ను ఉత్సాహపరుస్తూ ప్రోత్సాహిస్తుంటాడు. చాలా మంది కామ్రేడ్స్‌ను తీర్చిదిద్దాడు. కొత్త కొత్త విషయాలు తెలుసుకోవడంలో తృష్ణ కలిగిన విద్యార్థిగా, ప్రజలను, క్యాడర్‌ను చైతన్య పరచడంలో రాజకీయ గురువుగా వున్నాడు.

ప్రజలు, క్యాదరు, నాయకత్వం అందరి వద్ద మంచి విశ్వాసాన్ని, అభిమానాన్ని చూరగొన్నాడు. ఆదివాసీ ప్రజలకు, సహచార కామ్రేడ్స్‌కు ఆత్మీయుడుగా మారాడు. తన విప్లవ జీవితంలో ఎక్కువ కాలం నిరాయుధంగా ప్రజల మధ్యనే ప్రజలతో వుంటూ జీవించాడు. ప్రజల మద్దతును కూడగట్టి ప్రజల రక్షణ పొందాడు. తనను తాను కాపాడుకోవడమే కాదు. దళాలకు కూడా శత్రువు సమాచారాన్ని చేరవేసేవాడు. ఒక మంచి నాయకుడుగా, సేవకుడిగా ప్రజల హృదయాల్లో నాటుకు పోయాడు. మంచి ప్రజాదరణ పొందిన కా॥ రాజ్‌కుమార్ ఈ రాజ్యానికి టి.ఆర్.ఎస్. ప్రభుత్వానికి అసాంఘిక శక్తిగా, సంఘ విద్రోహిగా కనబడ్డాడు. ప్రజల మనిషిగా, విప్లవకారునిగా జీవించడం ఈ రాజ్యానికి గిట్ట లేదు. పగబట్టింది. కుట్ర పన్నింది. కా॥ అరుణ్ నిరాయుధుడిగా ప్రజా పంచాయితీ నిర్వహించడాన్ని తమ ఎంగిలి మెతుకులు తినే ఏజెంట్ల ద్వారా తెలుసుకుంది. ఇదే అదునుగా భావించి హత్య చేయమని ఆదేశించింది.

వేటగాళ్ల రూపంలో మానవ మృగాలైన పోలీసులు సివిల్‌లో చుట్టుముట్టారు. వారికి దన్నుగా వెనుక భాగంలో అధునాతన ఆయుధాలతో పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. పచ్చి రక్తానికి రుచిమరిగిన వేట కుక్కలు తరిమి తరిమి వేట కొడవల్లతో దాడి చేశారు. చిత్రహింసలు పెట్టి చివరికి పిస్తోలుతో కాల్చి చంపారు. నిర్జీవదేహానికి ముందుగానే సిద్ధం చేసి తెచ్చుకున్న వారి మిలటరీ ప్యాంటును తొడిగి 303 తుపాకి పక్కన పెట్టి "రెండు గం॥లు సాగిన ఎదురు కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతిచెందినట్లు" అబద్ధపు ప్రచారం చేసారు. ఈ రాజ్యం. కా॥ రాజ్‌కుమార్‌ను హత్య చేశానని సంబర పడుతుంది. అతని రాజకీయాలను హత్య చేయడం సాధ్యం కాదనేది దానికి తెలియదు. పోరాడితే పోయేది ఏమి లేదు. దోపిడీ సంకెళ్ళు తప్ప అనే జీవిత సత్యాన్ని గ్రహించి పోరాడిన కా॥ రాజ్‌కుమార్ ఇవాళ మన ముందు లేడు కాని త్యాగాల చరిత్రలో ప్రజల గుండెల్లో చిరకాలం వీర కిషోరమై నిలిచి ఉంటాడు.

దోపిడీ ఉన్నంత కాలం ప్రజా పోరాటాలు పుట్టుకొస్తునే ఉంటాయి. దోపిడీ ఎంత తీవ్రంగా వుంటే విప్లవోద్యమం అంత ఎత్తుకు ఎగిసి పడుతునే ఉంటుంది. అందుకే దోపిడీని నిర్మూలించేంత వరకు పోరాడుతునే ఉందాం. నూతన సమాజాన్ని నిర్మిచుకుందాం. ఇదే కామ్రేడ్ రాజ్‌కుమార్ ఆశయం. దీన్ని నిజం చేసి చూపెడుదాం. అమరుడికి నిజమైన నివాళ్ళు అర్పిదాం. ✦

# ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడిన ఆదివాసీ ఉద్యమ నేత శిడం శంభుకు విప్లవ జోహార్లు

ఆదివాసీ ఉద్యమానికి ఊపిరిపోసి, ఆ ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ, ఎదిగి ఎంతో ఆదర్శంగా నిలిచిన కార్యకర్త కా॥ శిడం శంభు. ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ ఉద్యమాలకు పురిటి గడ్డ. కొమరం భీం, రాంజీ గోండ్‌లతో పాటు ఎంతోమంది పోరాట వీరులను కన్న జిల్లా ఆదిలాబాద్. ఈ వీరుల వారసత్వ బాటలోనే కా॥ శిడం శంభు ప్రయాణించాడు. కా॥ శిడం శంభు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం లక్కారం గ్రామ పంచాయితీ పరిధిలోని మత్తడిగూడెంలో అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించాడు. ఆదివాసీ హక్కుల కోసం, చట్టాలకోసం పోరాడుతూ జులై 19, 2018 నాడు అనారోగ్యంతో రాత్రి చివరి శ్వాస వదిలాడు.

కా॥ శిడం శంభు 1997లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) వ్యవస్థాపకుడుగా పనిచేశాడు. ఆదిలాబాద్ (ఉమ్మడి) ఆదివాసీ ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. ప్రజా సంఘాల, విప్లవ సంఘాల మద్దతును కూడగట్టాడు. ఆదిలాబాద్ నుండి శ్రీకాకుళం వరకు 5వ షెడ్యూల్డ్ భూభాగం అంతటా తిరిగి రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమించాడు. 1/70 చట్టాన్ని అమలు చేయాలని పెసా చట్టాన్ని గ్రామ సభల అమలుకు పూనుకోవాలని డిమాండ్ చేసాడు. 2006 అటవీ హక్కుల చట్టం వచ్చింది. ఈ చట్టం ప్రకారం ఆదివాసీలకు అడివిపై పూర్తి హక్కు ఉంటుందని, వాటిని సరిగ్గా అమలు చేయాలని పాలకులపై ఒత్తుడి తేవడం కోసం ఆదివాసీ ప్రజలను చైతన్య పరిచి కదిలించాడు.

ఆదివాసీ ప్రాంతాల్లో 5,6 షెడ్యూల్డ్ అమలు చేయాలి. అటవీ భూమి నరికి సాగు చేస్తున్న ప్రజలకు పట్టాలివ్వాలి. నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి ఆవకాశాలు కల్పించాలి. బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపి వేయాలి. ఆదివాసులపై పోలీసుల అత్యాచారాలను నిలిపి వేయాలి. ఆదివాసులపై ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేయాలి. ఐ.టి.డి.ఎ. అవినీతిని అరికట్టాలి. అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్య తీసుకోవాలి. తదితర డిమాండ్స్ మీదనే 1997 జనవరి 29న ఉట్నూర్‌లోని 60 వేల మంది ఆదివాసులతో బ్రహ్మండమైన ఊరేగింపు, మరియు బహిరంగ సభ జరిగింది. దీనికి కా॥ శిడం శంభు నాయకత్వం వహించాడు.

నిర్వాసిత ఉద్యమంలో కూడా చురుకుగా పాల్గొన్నాడు. 2013న హైదరాబాద్‌లో జరిగిన సభకు అధ్యక్షత వహించాడు. ఆదిలాబాద్ జిల్లాలోని సింగరేణి ఓపెన్‌కాస్టులకు వ్యతిరేకంగా, కవ్వాల్ టైగర్ జోన్‌కు వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజల పక్షాన గట్టిగా నిలబడి నాయకత్వం వహించాడు. "రాంచి డిక్లరేషన్" సభలో పాల్గొని ముఖ్య భూమిక వహించాడు.

ఉమ్మడి రాష్ట్రంలో ఇంద్రవెల్లి అమరుల దినోత్సవం నాడు పాలకులు అమరుల స్థూపం వద్దకు నివాళులు అర్పించేందుకు ఎవరిని అనుమతించని స్థితుల్లో తాను ఒక్కడే ప్రతి సంవత్సరం పోలీసుల వలయాన్ని చేధించుకొని వెళ్లి నివాళర్పించి తన ధైర్యాన్ని చాటుకున్నాడు. 2004లో చర్చల కాలంలో ఇంద్రవెల్లి వద్ద ఏప్రిల్ 20 నాడు భారీ బహిరంగ సభ జరిగింది. దాదాపు జిల్లా అంతటి నుండి ఒక లక్ష మంది ప్రజలు హాజరయ్యారు. ఆ సభను విజయవంతం చేయడంలో కా॥ శిడం శంభు ముఖ్య పాత్ర వహించాడు.

కా॥ శిడం శంభు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) వ్యవస్థాపక సభ్యుడుగా, రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన ఆదివాసీ ప్రజల కొరకు గత 25 సం॥రాలుగా అవిరామ కృషి చేసాడు. జిల్లా రాయి సెంటర్ అధ్యక్షుడుగా, తుడుందెబ్బ అధ్యక్షుడుగా, ఆదివాసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడుగా కూడా పనిని కొనసాగించాడు.

2004 డిసెంబర్‌లో ఆదిలాబాద్ ఎస్.పి. మహేష్ భగవత్, ఎ.ఎస్.పి. స్టీఫెన్ రవీంద్ర కలిసి ఆదివాసీ నాయకుల మీద ఒత్తిడి చేసి మావోయిస్టు పార్టీకి వ్యతిరేకంగా ప్రకటనలు ఇప్పించారు. కానీ కా॥ శిడం శంభు మాత్రం ధైర్యంగా, మానసికంగా ఉండి ప్రకటన ఇవ్వకుండా తిరస్కరించాడు.

కామ్రేడ్ శిడం శంభు 1996 నుండి 2018 వరకు ఉద్యమ కాలంలో అనేక నిర్బంధాలను, చిత్రహింసలను నిర్భయంగా ఎదుర్కొంటూ తన తుదిశ్వాస వరకు ప్రజల పక్షాన ఉండి పనిచేసాడు.

ఉద్యమ సమయంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నా చిరునవ్వుతో ఎదుర్కొన్నాడు. కుటుంబపరమైన ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా ఉద్యమాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చాడు. వివిధ రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే, ఎంపి టికెట్ ఇస్తామని ఆశచూపినా ఆ మార్గంలో ప్రజల సమస్యలు పరిష్కారం కావని భావించి పదవులకన్నా ప్రజా ఉద్యమాలకే అంకితమయ్యాడు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ ప్రజా నాయకుడుగా ఎదిగి వచ్చాడు. "ప్రజాస్వామిక తెలంగాణ" కొరకు ఉద్యమంలో గట్టిగా నిలబడినాడు.

ఆదివాసీ-లంబాడాల సమస్యల మీద 2017లో వచ్చిన ఉద్యమంలో ఆదివాసీల పక్షాన నిలబడినాడు. ఆదివాసీ-లంబాడాల మధ్య ఉన్న సమస్యను మిత్ర వైరుధ్యం పద్ధతిలో పరిష్కరించుకోవాలని చెప్పాడు. ఆదివాసీ సమస్యలపై పత్రికలలో వ్యాసాల ద్వారా ఆదివాసీ ప్రజలను చైతన్య పరిచాడు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ రచయితగా గుర్తింపు తెచ్చుకున్నాడు. చివరి వరకు విలువలకు కట్టుబడి ఆదివాసీ ప్రజల కొరకు ధైర్యంగా పని చేసాడు. ఆదివాసీ యువతకు ఆదర్శంగా నిలిచాడు. ఎప్పుడు చిరునవ్వుతో చిన్నా పెద్దలను పలకరిస్తూ "రాం..రాం" అని నమస్కరిస్తూ ప్రజలకు తలలో నాలుకయ్యాడు. సీదా సాదాగా ఉంటూ ఒక ఆదివాసీ ప్రజా నాయకుడిగా ఎదిగివచ్చాడు. శిడం శంభు ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే, నిజాయితీగా ఉద్యమించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. ✦

# ఆదివాసుల ఉద్యమ నేత జవ్వాజి లక్ష్మీనారాయణకు విప్లవ జోహార్లు.

# అతని ఆశయాన్ని కొనసాగిద్దాం

ఆదివాసుల, పీడిత ప్రజల నాయకుడు కామ్రేడ్ జవ్వాజి లక్ష్మీనారాయణ 6-9-2018 నాడు తీవ్రమైన గుండె పోటుతో తుదిశ్వాస విడిచాడు. అతనికి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర పార్టీ వినమ్రంగా తల వంచి విప్లవ జోహార్లు అర్పించింది. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేసింది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం గుండాల గ్రామంలోనే జవ్వాజి లక్ష్మీనారాయణ జన్మించాడు. ఆదివాసుల పీడిత ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే పరిష్కారమవుతాయనే దృఢ విశ్వాసంతో 1994లో అప్పటి పీపుల్స్‌వార్ పాండవ దళంలో సభ్యునిగా భర్తీ అయినాడు. ఒక సంవత్సర కాలం పీ.ఎల్.జి.ఎ. సభ్యునిగా పని చేశాడు. ఆ సంవత్సరంలో జరిగిన పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికలు ఎంత బూటకమైనవో ప్రజలకు పిలుపునిస్తూ ఎన్నికలను బహిష్కరించాలని పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం చేపట్టాడు. ప్రజలందరిని కదిలించి చింతగూడెం గ్రామంలో ఎన్నికల బూతును ధ్వంసం చేసి ఓటు డబ్బాలను ధ్వంసం చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా గుండాల మండలంలో ఎం ఆర్.ఓ. ఆఫీసును ధ్వంసం చేసిన సంఘటనలో ప్రధాన భూమిక పోషించాడు. అనారోగ్య సమస్యతో దళంలో తిరగలేని పరిస్థితిలో ఇంటికి పోయాడు. విప్లవ రాజకీయాలను పునికిపుచ్చుకున్న కా॥ జవ్వాజి లక్ష్మీనారాయణ శత్రువుకు తలవంచకుండా ఆదివాసుల హక్కుల కోసం తుదిశ్వాస వరకు పని చేయడానికి నిశ్చయించుకున్నాడు. ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ)ని స్థాపించడంలో ప్రధాన భూమికను పోషించాడు. తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శిగా, ప్రచార కార్యదర్శిగా పని చేసాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆదివాసి ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. మంచి ఉపన్యాసకుడు కావడంతో ప్రజలను అట్టే అకట్టుకునేవాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం నుండి ఆదిలాబాద్ వరకు స్వయం పాలన కోసం పోరాటాలు కొనసాగించాడు. పెసా, 1/70 చట్టం, అటవి హక్కుల చట్టం అమలు కోసం, గ్రీన్‌హంట్ పేరుతో ఆదివాసులపై కొనసాగుతున్న క్రూరమైన దాడికి వ్యతిరేకంగా సభలు, సమావేశాలు, ర్యాలీల ద్వారా పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగించాడు. హరితహారం పేరుతో కేసీఆర్ ప్రభుత్వం ఫారెస్టు, వాళ్ళను పోలీసులను పంపి ఆదివాసులు 50 సంవత్సరాల నుండి సాగుచేసుకుంటున్న భూములలో పంట చేళ్ళను ధ్వంసం చేస్తుంటే వాళ్ళకు వ్యతిరేకంగా గుండాల, ఇల్లందు, టేకులపల్లి, పినపాక మండలాల్లో మిలిటెంట్ పోరాటాలను కొనసాగించాడు. పీడిత ప్రజల కోసం, ఆదివాసుల కోసం గత 24 సంవత్సరాలుగా అవిరామంగా, అవిశ్రాంతంగా పని చేశాడు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో జల్, జంగల్, జమీన్ కోసం, 5వ షెడ్యూల్ ప్రాంతంలో స్వయం పాలన కోసం హైదరాబాద్, వరంగల్, భద్రాచలం, ఆదిలాబాద్, ఇల్లందు కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో వేలాది మంది ఆదివాసులతో భారీ బహిరంగ సభలు నిర్వహించాడు. 300 గ్రామాలను, 3 లక్షల మంది ఆదివాసులను సమాధి చేయబోతున్న పోలవరం ప్రాజెక్టు మాకువద్దని అనేక పోరాటాలు కొనసాగించాడు. ఆదివాసులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని, ఆదివాసి మహిళలపై కొనసాగుతున్న అత్యాచారాలపై న్యాయవిచారణ జరపాలని, అభయారణ్యాలు, ఓపెన్‌కాస్టులు, ఇనుపగనులు, భారీ నీటి ప్రాజెక్టుల వలన ఆదివాసులు, పీడిత ప్రజలు నిర్వాసితులవుతున్నారని, వీటిని వెంటనే నిలిపివేయాలని పోరాటాలు కొనసాగించాడు. ఇల్లందు, గుండాల ప్రాంతంలో అన్ని పార్టీలు, సంస్థలతో కలిసి ఓ.సి. వ్యతిరేక కమిటీని నిర్మాణం చేసి సదస్సులు, పోరాటాలు నిర్వహించాడు. కేసీఆర్ ప్రభుత్వం కొత్త జిల్లాల నిర్మాణం చేస్తునప్పుడు ఆదివాసి ప్రాంతాలను చీల్చి వేసి 5వ షెడ్యూల్డ్ ఏరియా లేకుండా కుట్రలు పన్నితే ఆదివాసి ప్రాంతాలను ప్రత్యేక జిల్లాలుగా నిర్మాణాలు చేయాలని పోరాటం కొనసాగించాడు. ఐ.టి.డి.ఎ., జి.సి.సి.లలో అధికారుల అవినీతికి వ్యతిరేకంగా, తునికాకు గిట్టుబాటు ధర కోసం, వడ్డీవ్యాపారానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించాడు.

1995 నుండి ఇప్పటి వరకు పోలీసులు, పాలకులు అనేక మార్లు చంపుతామని బెదిరించినా వాళ్ళ బెదిరింపులను లెక్క చేయకుండా ధైర్యంగా ఆదివాసుల, పీడిత ప్రజల పక్షాన నిలబడ్డ ధీరోదాత్త కార్యకర్త మన జవ్వాజి. బూర్జువా పార్టీలు డబ్బులు, పదవులు ఆశ చూపించినా వాటికి లొంగిపోలేదు. 1995 నుండి 2018 వరకు పార్టీ సభ్యునిగా కొనసాగుతూ పార్టీ ఇచ్చిన అన్ని పిలుపులను అమలు చేసాడు. కొంత మంది నిర్బంధానికి భయపడి వెనుక పట్టుపట్టినా శత్రువు పక్షాన చేరినా తాను మాత్రం పీడిత ప్రజల తరుపున తుదిశ్వాస వరకు నిలిచాడు. అందుకే జవ్వాజి జీవితం చాలా గొప్పది. దానికి వెల కట్టలేము.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆదివాసి ప్రజలకు నాయకత్వం వహించి ప్రజాస్వామిక తెలంగాణ ద్వారానే పీడిత ప్రజలకు, ఆదివాసులకు న్యాయం జరుగుతుందని నినదించాడు. దీన్ని సాధించుకోవడానికి గట్టిగా నిలబడ్డాడు.

2017లో ఆదివాసులు, లంబాడాల మధ్య ఘర్షణలు వచ్చినపుడు ఆదివాసుల పక్షాన నిలబడి పోరాడాడు. ఆదివాసి లంబాడాల మధ్య సమస్య మిత్ర వైరుధ్యంతో కూడుకున్నది, దాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలి, ఈ ఘర్షణకు కారణం పాలక వర్గాలే కారణం, పాలక వర్గాలకు వ్యతిరేకంగా పోరాడుదామని ఆదివాసి ప్రజలకు పిలుపునిచ్చాడు. కా॥ జవ్వాజి గురించి చెప్పుకోవడమంటే 1995 నుండి 2018 వరకు ఆదివాసి ప్రాంతాలలో జరిగిన అన్ని పోరాటాల గురించి చెప్పుకోవడమే అతని చరిత్ర అవుతుంది. ఈ కాలంలో జరిగిన అన్ని పోరాటాలలో తన పాత్ర ఉంది. అతడు ఆదివాసులకే కాదు, ఆదివాసేతర పీడిత ప్రజలకు కూడా ఒక నిజాయితీ కలిగిన ఆదివాసి నాయకుడిగా నిలిచాడు. అందుకే అతని ఆశయాన్ని దృఢసంకల్పంతో కొనసాగిద్దాం. ఇదే మనం అతనికిచ్చే నిజమైన నివాళి. ✦

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాశవిక దాడిని ఖండించండి

# నుల్కతోంగ్ హత్యాకాండలో ప్రాణాలు కోల్పోయిన 15 మంది

# సాధారణ ప్రజలకు విప్లవ జోహార్లు

కేంద్రంలో ఉన్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకోసం అహర్నిశలు శ్రమిస్తూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో కలిసి సమన్వయంతో ఇక్కడ ఉన్న అన్ని రకాల సంపదను, ప్రజల శ్రమను దోచిపెడుతుంది. అది దండకారణ్యంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని అణచడం కోసం 'సమాధాన్ 2022 పేరుతో మావోయిస్టు పార్టీని కూకటి వేళ్ళతో పీకిపారేయాలనే వ్యూహంతో పనిచేస్తున్నది.

దేశంలోనే సుక్మా, దంతెవాడ, బీజాపూర్ జిల్లాలను మావోయిస్టుల ప్రభావ జిల్లాలుగా ఫస్ట్ కేటగిరిలో ఎంపిక చేసి వేల సైన్యాన్ని దించి ప్రహార్ 1,2,3 అని ఆపరేషన్లకు పేర్లు పెడుతూ సాధారణ ప్రజలను పదుల సంఖ్యలో చంపుతూ వాటికి ఎన్‌కౌంటర్ల ముసుగులు వేస్తున్నారు. ఈ దమనకాండలో భాగంగానే దక్షిణ్ బస్తర్ డివిజన్ సుక్మాజిల్లా కుంట ఏరియా బండ పంచాయితీలో జనతన సర్కార్ నాయకత్వంలో ప్రజలు సమిష్టిగా చేసుకునే వ్యవసాయ కార్యక్రమాలను పోలీసులు తమ నెట్‌వర్క్ సమాచారంతో తెలుసుకొన్నారు. ఆగస్టు నెలలో బెజ్జి, కుంట, గొల్లపల్లి పోలీసు క్యాంప్‌ల నుండి బయలుదేరిన వందలాది మంది పోలీసులు బండ పంచాయితీలో ఉన్న నులకతోంగ్ గ్రామంతో పాటు చుట్టు పక్కల ఐదు గ్రామాలను ముట్టడించారు. ఈ ముట్టడి నుండి తప్పించుకున్న ప్రజలు నులకతోంగ్ గ్రామం పక్కన ఉన్న తాడిగొందు గుట్ట దగ్గర జమయ్యి భయంతో ఆ రాత్రి అక్కడే పడుకున్నారు.

మరుసటిరోజు ఉదయం తుప్పిరి-తుప్పిరి జల్లుల వర్షంలో తాడిగొందు గుట్టపై ప్రజలు పడుకున్న స్థలాన్ని మూడు వైపుల నుండి చుట్టు ముట్టిన పోలీసులు సాధారణ ప్రజలు అని తెలిసి కూడ ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఫైరింగ్ ప్రారంభించారు. ఈ ఫైరింగ్‌లో పిల్లల నుండి మొదలుకొని ముసలి వాళ్ళ వరకు భయంతో ఏడుస్తూ పరుగులు తీస్తుంటే అడవిలో జంతువులను వేటాడినట్టు ప్రజలను వెంటాడి వేటాడుతూ జరిపిన ఫైరింగ్‌లో కొంత మంది ప్రజలు ప్రాణాలు వదిలారు. ఇంకా కొంత మంది గాయాలతో ఈ నరరూప రాక్షసుల చేతికి దొరికారు. వీరిని చెప్పనలవిగాని చిత్ర హింసలు పెట్టి బండరాళ్ళతో, కర్రలతో కొట్టి చంపారు. అదే ఫైరింగ్‌లో గాయాలైన ఒక మహిళను ప్రాణాలతోనే పట్టుకపోయారు.

ఈ హత్యాకాండలో ప్రాణాలు కోల్పోయిన వాళ్ళల్లో వజ్జం ఉంగాల్ (వెల్లుం గ్రామం), మడావి బామన్ (ఏటగట్ట), మాడవి ఉంగాల్ (కింద్రేం), సోయం సీతాల్, కడ్తి ఐతాల్, సోయం చంద్రాల్, మాడవి దేవాల్ (గొంపాడు), మడకం టింకు, తాతీ ఉంగాల్, ముచకి ముకాల్, ముచకి హిడుమాల్, ముచకి దేవాలు (నులకతోంగ్), సోడి ప్రభు, ముచకి అడమా, మాడవి నందా మొత్తం 15 మంది సాధారణ ప్రజలు ఉన్నారు.

మానవత్వపు విలువలను కూడా పాటించకుండా జంతువులను ఈడ్చుకుపోయినట్టు శవాలను ఈడ్చుకపోయారు. పోస్టుమార్టంలో కొన్ని శవాలకు కుట్లు వేయకుండా వదిలి పెట్టారు. పోస్టుమార్టం అయినా శవాలను భద్రపర్చకుండా గాలికి వదిలేశారు. ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న బీజేపీ రమణ్‌సింగ్ ప్రభుత్వం గతంలో కూడా సల్వాజుడుం, గ్రీన్‌హంట్ పేర్లతో కొనసాగించిన హత్యాకాండలో భాగంగా సింగారంలో 18, గొంపాడులో 12, సర్కిన్‌గూడలో 17, సింగాన్ మడుగులో 12 మంది సాధారణ ప్రజలను చంపారు. ఇది వాటి కొనసాగింపే.

పక్క దేశంపై దాడి చేస్తున్నట్టుగా బస్తర్‌లో వేలకొలది బలగాలు వచ్చి గ్రామాలపై బడి విచ్చల విడిగా దాడులు చేస్తూ, పగటి దొంగల్లా ఇండ్లల్లో జొరబడి చేతికి దొరికిన వస్తువులన్నా కాజేసారు. వడ్లు, బియ్యం, ఉప్పు కారాలు, చిరు ధాన్యాలను కలిపి బూటుకాళ్లతో తొక్కారు. ప్రజలు కట్టుకునే బట్టలను సైతం బుగ్గి పాలు చేశారు. దొరికిన కల్లు, లంద ఇష్టం వచ్చినట్టు తాగి ప్రజలను కొట్టడం, చంపడం చేశారు. జైల్లో పెట్టి సంవత్సరాల తరబడి ఎలాంటి విచారణ లేకుండా శారీరకంగా, మానసికంగా హింసిస్తూ, అనారోగ్యం పాలయితే ఒక సూది, గోళి ఇయ్యకుండా, కడుపునిండా అన్నం పెట్టకుండా జైళ్లోనే చంపుతున్నారు. ఇంకా మహిళల పరిస్థితి అంటే చెప్పనలవి కానిది పసిపిల్లల తల్లులను పట్టి పాలు పిండి చూడటం, బట్టలు విప్పి నగ్నంగా చేసి ఆనందించడం, సాముహిక అత్యాచారాలు, హత్యలు చేయడం లాంటి హింసలతోనే బస్తర్ గ్రామాలు తెల్లారుతున్నాయి.

బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదులు మోదీ, రమన్‌సింగ్ నియంతృత్వ పాలనలో ఇక్కడ ఆదివాసుల బతుకులు చిద్రమైపోతున్నాయి. ఈ దమనకాండను నిరసించడం, వ్యతిరేకంగా పోరాడడం అన్ని సెక్షన్ల ప్రజల బాధ్యత. దోపిడీ రాజ్యాన్ని వర్గపోరాటం ద్వారా కూల్చడానికి సాయుధమవుదాం. ✦

## చర్ల-శబరి ఏరియా పరిధిలో జులై 28 అమరవీరుల సంస్మరణ సభలు

చర్ల-శబరి ఏరియా పరిధిలో రెండు మీటింగ్‌లు జరిగాయి. పూజారి కాంకేర్ ఆర్‌పీసీ పరిధిలో జులై 28న అమరుల సంస్మరణ సభ జరిగింది. 10 గ్రామాల ప్రజలు, మిలీషియా, భూంకాల్ మిలీషియా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చెన్నాపురం ఆర్.పి.సి. పరిధిలో జులై 28 అమరుల సంస్మరణ సభ జరిగింది. ఈ మీటింగ్‌లలో జననాట్యమండలి కార్యకర్తలు అమరవీరుల పాటలు పాడి, వారి ధైర్య సాహసాలను, ఆదర్శాలను గుర్తు చేస్తూ ప్రజలను చైతన్య పరిచారు. ఈ మీటింగ్ నిర్బంధం, కూంబింగుల మధ్య విజయవంతంగా జరిగింది. ఈ సభలో వక్తలు అమరుల త్యాగాలను, ఆదర్శాలను ఎత్తిపడుతూ మాట్లాడారు. వేలాది మంది అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో నేడు ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయింది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలలో తెలంగాణలో ఎన్‌కౌంటర్లు ఉండవని, దళితులకు మూడు ఎకరాల భూమి, ఆదివాసీల పోడుభూములకు పట్టాలు ఇస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని, నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు ఇస్తామని ఇలా అనేక హామీలిచ్చిన కేసీఆర్ ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. హరిత హారం పేరుతో ఆదివాసుల, దళితుల లక్షలాది భూములను గుంజుకుని టాటా, బిర్లా, అంబానీ వంటి మల్టినేషనల్ కంపెనీలకు, సామ్రాజ్యవాదులకు అప్పగించాడు. మిషన్ కాకతీయ, వాటర్‌గ్రిడ్, రోడ్లు, దేవాలయాలు వివిధ పథకాల పేరు మీద కోట్ల రూపాయలు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకులు ప్రజల ధనాన్ని దోచుకుంటున్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడం లేదు. వాళ్ళ హక్కుల కోసం పోరాటం చేస్తే వాళ్ళ మీద లాఠీ చార్జీలు, అక్రమ అరెస్టులు చేసి జైల్లో నిర్బంధించడం, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, పరువు హత్యలు, వ్యభిచార గృహాలకు అమ్మడం ఇలా అనేక సమస్యలు కేసీఆర్ పాలనలో పెరిగాయి గానీ తగ్గలేదు. ప్రజలు తమ సమస్యలను పోరాట మార్గంలోనే సాధించుకోవలసి ఉంటుంది అని అన్నారు.

భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడుతూ అమరులైన అమరవీరుల ఆశయాలను నెరవేర్చాలని ప్రజలకు పిలుపునివ్వడం జరిగింది. ఈ సభకు మొత్తం 9 గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మిలీషియా సభ్యులు పాల్గొన్నారు. కార్యకర్తలు పాటలు పాడి, ప్రదర్శనలు ఇచ్చారు. కరపత్రాలు, బ్యానర్లు, వాల్‌పోస్టర్లు ద్వారా ప్రచారం జరిగింది. ✦

---

## జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ రద్దుకు వ్యతిరేకంగా పోరాడుదాం

బీజేపీ మద్దతు ఉపహరించుకోవడంతో పీడీపీ - బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కుప్ప కూలిన నేపథ్యంలో జూన్ 19న రాష్ట్రంలో గవర్నర్ పాలన విధించారు. ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఉండేందుకు అసెంబ్లీని సుప్త చేతనావస్థలో ఉంచారు. సరిగ్గా అయిదు నెలలక్రితం పీడీపీ - బీజేపీ కూటమి ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత జమ్మూకశ్మీర్‌లో రాజకీయం వేడెక్కింది. చకచకా జరిగిన పరిణామాల పర్యవసానంగా హఠాత్తుగా నవంబరు 21న బుధవారం అసెంబ్లీ రద్దయింది.

జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో పీడీపీకి 28 మంది, కాంగ్రెస్‌కు 12 మంది, నేషనల్ కాన్ఫరెన్స్‌కు 15 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు పీడీపీ అధ్యక్షురాలు, మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ లేఖ రాసింది.

వాస్తవానికి పీడీపీలో చీలిక తీసుకొచ్చి, తమ సన్నిహితుడు సజ్జాద్ గని లోన్‌కు అధికార పగ్గాలు కట్టబెట్టాలని బీజేపీ కొంతకాలంగా అనుకుంటోంది. ప్రస్తుతం అసెంబ్లీకి గడువు 2020 డిసెంబర్‌తో ముగుస్తుంది. ప్రస్తుతానికి సజ్జాద్‌తో నెట్టుకొచ్చి, ఆ తర్వాత అసెంబ్లీని రద్దు చేయించి ఆర్నెల్లలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలతో పాటు ఇక్కడ కూడా ఎన్నికలు జరిపించాలని బీజేపీ వ్యూహం రచించింది.

గవర్నర్ చెబుతున్న కుంటి సాకులు హేతు విరుద్ధమైనవి. ఎమ్మెల్యేల కొనుగోలుకు బేరసారాలు జరిగే అవకాశం ఉందనడం, విరుద్ధ భావజాలాలున్న పార్టీలు స్థిర ప్రభుత్వాన్ని ఏర్పరచలేవన్న నమ్మకంతోనే అసెంబ్లీని రద్దుచేయాల్సి వచ్చిందని రాజ్‌భవన్ నుంచి ప్రకటన వెలువడింది. మెజారిటీని నిరూపించుకునేందుకు ఒకటి కన్నా ఎక్కువ వర్గాలు ముందకు రావటం ప్రభుత్వ నిలకడపై ప్రభావం చూపుతుందని మరొక కారణంగా పేర్కొంది.

వాస్తవానికి జమ్మూకశ్మీర్‌లో ఇప్పుడు నెలకొన్న పరిస్థితుల్లో గవర్నర్ పాలన కన్నా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం ఉండటం అత్యవసరం. రెండేళ్ల వ్యవధి ఉండగానే అసెంబ్లీ రద్దు, చేయటం తప్పుడు సంకేతాలు పంపుతుంది. అసెంబ్లీ సమావేశపరిచి అక్కడ బలా బలాలు తేలిస్తే ప్రజాస్వామ్యబద్ధంగా ఉండేది. రాజకీయ పక్షాల బలాబలాలు తేలాల్సింది చట్టసభల్లో తప్ప రాజ్‌భవన్‌లలో కాదని పలుమార్లు న్యాయస్థానాలు స్పష్టం చేశాయి.

కాంగ్రెస్ - పీడీపీ - ఎన్సీ కూటమి వెనుక పాకిస్తాన్ హస్తం ఉందని బీజేపీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి కవీందర్‌గుప్త ఆరోపించారు. దుబాయిలో పాకిస్తాన్ ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో ఈ మూడు పార్టీల నేతలు కలిశారన్నారు. ఇవి కుట్రతో చేసే ఆరోపణలు తప్ప మరొకటి కాదు.

కశ్మీర్‌లో మహాకూటమి ఏర్పాటు నేపథ్యంలో బీజేపీ తమ పార్టీ పునాదులు కదిలిపోతాయని భయపడింది. కలవరపాటుకు గురైన కేంద్ర ప్రభుత్వం గవర్నర్ చేత ఏకపక్షంగా అసెంబ్లీ రద్దు చేయించింది. ఇది రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి రాష్ట్ర పతిపాలన తేవడం తప్ప మరొకటి కాదు. ✦

ప్రజా పోరాటాలు

# ఉపాధిని దెబ్బతీసి కార్మికుల కడుపు కొడుతున్న సింగరేణి యాజమాన్యం

తెలంగాణలో అతిపెద్ద పరిశ్రమలలో సింగరేణి పరిశ్రమ ఒకటి. తెలంగాణలోని సింగరేణి పరిశ్రమ బొగ్గు బావులలో ఒక లక్షా 25 వేల మంది కార్మికులకు ఉపాధి కల్పించింది. సింగరేణి బొగ్గు బావులకు దాదాపు 127 సం॥రాల చరిత్ర వుంది. ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలలో గోదావరి పరీవాహక ప్రాంతంలోని 350 కిలోమీటర్ల వరకు భూగర్భంలో 10.528 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. సింగరేణిలో బొగ్గు బావుల తవ్వకాలతో అప్పటి వరకు అడవిగా వున్న ప్రాంతం అంతా గ్రామాల నుండి ఉపాధి కోసం వచ్చిన కార్మికులతో వాడలు, బస్తీలు, కాలనీలు ఏర్పడి పట్టణాలుగా అభివృద్ధి చెందింది.

ఇంతటి సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి దోపిడీకి గురై, దళారీ పాలక వర్గాల కుట్రతో వెలవెలపోతున్నది. కార్మికుల బతుకులు మసి బారిపోతున్నాయి. గత మూడున్నర దశాబ్దాలుగా దేశంలోను, రాష్ట్రంలోను బొగ్గు అవసరాలు పెరిగి సింగరేణి బొగ్గుకు డిమాండ్ పెరిగింది. దీనితో దోపిడీ పాలక వర్గాలకు సింగరేణి నల్ల బంగారంపై కన్నుపడింది.

భూగర్భ గనులలో మానవ శక్తిని ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ బొగ్గును ఉత్పత్తి చేయడం సాధ్యం కాదని పాలక వర్గాలు, సింగరేణి యాజమాన్యం కుట్రతో కార్మికులను తగ్గించి ఆధునిక పనిముట్లను, భారీ యంత్రాలను ప్రవేశపెట్టి నల్ల బంగారాన్ని సామ్రాజ్యవాదులకు కట్టబెట్టి సొంత ఆస్తులను పెంచుకున్నారు. సహజ సిద్ధమైన అడవులను, నదీపరీవాహక ప్రాంతాలను, సారవంతమైన పచ్చని పంట పొలాలను ధ్వంసం చేస్తూ పర్యావరణాన్ని సర్వనాశనం చేస్తూ ఓపెన్ కాస్టులు తవ్వుతున్నారు.

ప్రపంచ బ్యాంకు ఏజెంట్లుగా పని చేస్తున్న దోపిడీ పాలక వర్గాలు అభివృద్ధి జపం చేస్తునే ప్రజా వ్యతిరేక విధానాలతో సాంప్రదాయక బొగ్గు బావులలో, ఓపెన్ కాస్టులలో భారీ యంత్రాలను ఉపయోగిస్తూ కార్మికుల సంఖ్యను తగ్గించడానికి ప్రయత్నం చేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం కుట్రపూరితంగా స్వచ్ఛంద పదవి విరమణ, గోల్డెన్ షేక్ హ్యాండ్ పథకాల పేర్లతో లక్షా ఇరవై ఐదు వేల మంది కార్మికుల నుండి సగానికి పైగా తొలగించి నేడు ఆ సంఖ్యను 56 వేల మంది కార్మికులుగా కుదించివేసింది. ఇంకా తగ్గించడానికి ప్రయత్నం చేస్తున్నది.

**ఉమ్మడి రాష్ట్రం నుండి కూడా సింగరేణికి అన్యాయం జరిగింది.**

ఉమ్మడి రాష్ట్రంలోనే సింగరేణి ప్రాంతం దోపిడీకి కేంద్రంగా మారింది. నల్ల బంగారం మీద కన్ను వేసిన దోపిడీ పాలకులు వందలాది గ్రామాలను, వేలాది కార్మికులను, లక్షలాది సామాన్య ప్రజల జీవితాలను నాశనం చేస్తూ విచ్చలవిడిగా విధ్వంసం సృష్టించి లక్షలాది ప్రజలను నిర్వాసితులను చేస్తూ ఇష్టారాజ్యంగా నల్ల బంగారాన్ని వెలికి తీసి సింగరేణి ప్రాంతాన్ని ఓపెన్ కాస్టులతో బొందలగడ్డగా మార్చి వేశారు. తెలుగు దేశం, కాంగ్రెస్ పార్టీలు రెండూ అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలకు, సింగరేణి ప్రాంతానికి తీవ్రమైన అన్యాయం చేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ జీవితాలు బాగుపడతాయని, ఓపెన్ కాస్టులు రద్దు అవుతాయని, వారసత్వ ఉద్యోగాలు దొరుకుతాయని సింగరేణి ప్రాంతమంత కళకళలాడుతుందని రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొని రాష్ట్రాన్ని సాధించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది. కే.సీ.ఆర్ అధికార పగ్గాలు దక్కించుకున్నాడు. కలలు కన్న కార్మికులకు కన్నీళ్లు మిగిలాయి. ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణలో 37 సాంప్రదాయక బొగ్గు బావులు 17 ఉపరితల గనులు ఉన్నాయి. టీ.ఆర్.ఎస్. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 16 ఓపెన్ కాస్టులను కొత్తగా ప్రారంభించాడు.

1. వెంకటాపూర్ 2. పెద్దాపూర్ 3. సెక్టార్-2 4. కాకతీయఖని 5. తాడిచర్ల బ్లాక్ 6. తాడిచర్ల బ్లాక్-2 7. బ్లాక్ బి.డి.కె బెల్లంపల్లి 8. మణుగూర్ 9. ఖల్యాణిఖని 10. శ్రావణపల్లి 11. కిష్టారం 12. రామకృష్ణ పూర్ 13. జె.వి.ఆర్. కొత్తగూడెం 14. ఇందారం ఓపెన్ కాస్టులకు అనుమతులు మంజూరు చేసాడు. ప్రజలు వ్యతిరేకిస్తున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ పోరాడుతున్న ప్రజలపై ఉక్కుపాదం మోపి వందల గ్రామాలను వల్లకాడుగా మార్చారు. ప్రకృతిని విధ్వంసం చేస్తూ మానవ హననం జరుగుతున్నా లెక్కచేయకుండా దేశంలోని 2000లకు పైగా పరిశ్రమలకు ఇక్కడ నుండి నల్ల బంగారాన్ని ఇష్టా రాజ్యంగా తరలిస్తున్నారు.

**కార్మికుల ఉపాధిని విస్మరిస్తున్నారు.**

సాంప్రదాయక బొగ్గు బావిని తవ్వడానికి 25 కోట్లు ఖర్చు అవుతాయి. అందులో పని చేసే 1500 నుండి 3000 మంది కార్మికులకు ఉపాధి దొరుకుతుంది. ఒక ఓపెన్ కాస్టు బొగ్గు బావిని తవ్వడానికి 250 కోట్లకుపైగా ఖర్చు అవుతుంది. అందులో పని చేయడానికి 250 మంది కార్మికుల కంటే ఎక్కువ మందికి ఉపాధి దొరకదు. పాలక వర్గాలు కార్మికుల ఉపాధిని పట్టించుకోకుండా అధిక లాభాల కోసం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తూ "తెలంగాణ అభివృద్ధి జరగాలంటే విధ్వంసాన్ని భరించాలంటు" కొత్త సూత్రాలను వల్లిస్తున్నారు. ఓపెన్ కాస్టులతో ప్రజలు తీవ్ర నష్టాల పాలవుతున్నా లెక్కచేయకుండ బొగ్గు ఉత్పత్తిని ప్రతి ఏటా 10 శాతం పెంచాలని సింగరేణి చైర్మన్‌కు ఆదేశాలు ఇచ్చారు.

1989లో సింగరేణి శతాబ్ది ఉత్సవాలలో సింగరేణి బొగ్గు బావులలో పని చేస్తున్న ఒక లక్షా16 వేలు వున్న కార్మికుల సంఖ్యను భవిష్యత్‌లో ఒక లక్షా 50 వేలకు పెంచుతామని వాగ్దానాలు చేశారు. దానికి విరుద్ధంగా ఓపెన్ కాస్టులకు శ్రీకారం చుట్టి విదేశాల నుండి ఆధునాతనమైన యంత్రాలను దిగుమతి చేసుకొని గనులలో ఉపయోగిస్తూ రోజు రోజుకు కార్మికుల సంఖ్యను తగ్గిస్తూ 56 వేలకు కుదించివేశారు. భావి తరాలకు భవిష్యత్తు లేకుండా చేశారు.

**నిబంధనలు పాటించకుండా సింగరేణి యాజమాన్యం,**

**ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.**

సింగరేణి గనుల్లో బొగ్గు బ్లాస్టింగ్ చేసిన తరువాత నీళ్ళు చల్లి వేడిని, దుమ్ము, దూళిని తగ్గించాలి. ఆ నియమాన్ని సింగరేణి యాజమాన్యం గాలికి వదిలేసింది. దీంతో ఆ ప్రభావం భూగర్భ జలాలపైన, పంట పోలాల మీద పడి ఆ ప్రాంతాలు ఎడారిగా మారుతున్నాయి. సింగరేణి యాజమాన్యం అధిక లాభాలకోసం ప్రయత్నిస్తూ కనీసం నిబంధనలు పాటించడం లేదు. బొగ్గు బావుల నుండి వెలువడే విషవాయువుల వల్ల భారీగా కాలుష్యం చుట్టుముట్టి భూగర్భ పొరల్లో సమతుల్యం దెబ్బతిని భూమికి పగుళ్ల వస్తున్నాయి. ఈ కాలుష్యం ప్రభావంతో సింగరేణి ప్రాంతంలోని వేల మంది టి.బీ. వ్యాధిన పడ్డారు. వేల మంది వినికిడి శక్తిని కోల్పోయారు. వందల మందికి వెన్ను నొప్పి, హృద్రోగం, ఊపిరితిత్తుల సమస్యలు దీర్ఘకాలిక తల నొప్పులు, క్యాన్సర్, శ్వాసకోశ రుగ్మతలు, నిద్రలేమి, మూత్రపిండ వ్యాధులు చర్మరోగాలు, ఒకటేమిటి అనేక రోగాలు సింగరేణి ప్రాంతాన్ని చుట్టుముట్టి వున్నాయి. వాయుకాలుష్యం, నీటి కాలుష్యంతో వృద్ధులు, మహిళలు, పిల్లలు ప్రతి సం။రం వందల మంది మరణిస్తున్నా సింగరేణి యాజమాన్యం, తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

సింగరేణి ప్రాంతంలో ఇష్టారాజ్యంగా బొగ్గు తవ్వడంతో భూగర్భంలో ఉష్ణోగ్రతలు పెరిగిపోయి వాతావరణం వేడెక్కి నిత్యం మండుతున్న అగ్ని గోళంలా మారింది. తెలంగాణకే తలమానికం సింగరేణి. అలాంటి తలమానికాన్ని పెకిలించాలని పాలక వర్గాలు కుట్ర చేస్తున్నారు. ఓపెన్ కాస్టుల తవ్వకాలతో పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుంది. ప్రకృతి నాశనం అవుతుంది. భారీ యంత్రాల శబ్ధం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుంది. దుమ్ము, ధూళి మట్టి పేరుకపోవడం మూలంగా పంటలు దెబ్బతింటాయి. 10 కిలోమీటర్ల వరకు వ్యవసాయం దిగుబడి సగానికి తగ్గుతుంది. భూగర్భంలో నీటి నిల్వ తగ్గిపోతుంది కుంటలు, చెరువులు, కాలువలు, వాగులు ఎండిపోయాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలు బాధలకు గురవుతున్నారు. పరిసర ప్రాంత ప్రజల సగటు ఆయుర్దాయం తగ్గుతుంది. 11 సం။రాల వయసు పిల్లల్లో తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని నోబెల్ బహుమతి పొందిన ప్రముఖ డాక్టర్లు, వివిధ సంస్థలు, నివేదికలు విడుదల చేసినా పాలక వర్గాలు పెడచెవిన పెట్టి లాభాల కోసం తమ ఇష్టమొచ్చిన రీతిలో బొగ్గు తవ్వకాలు కొనసాగిస్తున్నారు.

ప్రజలు, ప్రజాస్వామిక వాదులు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా వారిపై అభివృద్ధి నిరోధకులు అంటూ, అసాంఘిక శక్తులంటు ముద్రలు వేస్తుంది. పోరాడుతున్న ప్రజలపై ఉక్కుపాదం మోపుతుంది. సింగరేణిని కాపాడుకోవడం కోసం మన హక్కులు సాధించుకోవడానికి, మన వనరులను దక్కించుకోవడానికి పోరాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ పోరాడక తప్పదు.

## డోలమైట్ కర్మాగారాన్ని ప్రైవేటుకు అప్పగించే కుట్ర

ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఉదారీకరణ విధానాలు ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజల్లో పెను సంక్షోభాలు సృష్టిస్తున్నాయి. దేశంలో నూతన ఆర్థిక విధానాల ప్రవేశంతో ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు తలవొగ్గిన భారత పాలక వర్గాలు జీహుజూర్ అంటూ లాభాలతో నడుస్తున్న ప్రభుత్వ సంస్థలను నష్టాల బాట పట్టించి, నష్టాల పేరుతో ప్రైవేట్ పరం చేస్తున్నారు.

నూతన ఆర్థిక సంస్కరణలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే.సీ.ఆర్. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడానికి కంకణం కట్టుకున్నాడు. మాదారం డోలమైట్ కర్మాగారాన్ని టోటల్ మెయింటెనెన్స్ కంట్రోల్ (టీ.ఎం.సీ.) ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసాడు. గత 29 ఏండ్లుగా లాభాలతో నడుస్తున్న పరిశ్రమను ప్రైవేటు సంస్థకు అమ్మేయడానికి కుట్ర చేసాడు. 1989లో ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారంలో అప్పటి ప్రభుత్వం డోలమైట్ కర్మాగారాన్ని ప్రారంభించింది. 395 ఎకరాల భూమిలో వందేళ్లకు సరిపడ డోలమైట్ ఖనిజం ఈ ప్రాంత భూగర్భంలో నిక్షిప్తమై ఉన్నది.

ఈ కర్మాగారంలో 300 మంది కార్మికులు పని చేస్తున్నారు. వందలాది మంది ప్రజలు దీనిపై ఆధారపడి బ్రతుకుతున్నారు. లాభాలతో నడుస్తున్న డోలమైట్ పరిశ్రమను నష్టాల బాట పట్టించి అదే సాక్‌తో ప్రైవేటుపరం చేయడానికి రంగం సిద్ధం చేసింది ప్రభుత్వం. ఈ కర్మాగారం నుండి వెలికి తీసిన డోలమైట్ ముడిఖనిజాన్ని విశాఖ ఉక్కు పరిశ్రమకు సరఫరా చేస్తారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఇనుమును కరిగించే కొలిమిని తయారు చేసేందుకు వాడే ఇటుక తయారీకి ఈ డోలమైట్‌ను వినియోగిస్తారు. ఈ మైనింగ్ ద్వారా ఏడాదికి 5 లక్షల 30 వేల టన్నుల నుంచి 12 లక్షల టన్నుల వరకు ముడి ఖనిజాన్ని వెలికి తీసి విశాఖ స్టీల్ ప్లాంటుకు తరలిస్తారు. నాణ్యతమైన డోలమైట్ ఖనిజాన్ని విశాఖ స్టీల్ ప్లాంటుకు అందిస్తూ హైగ్రేడ్స్‌రా మెటీరియల్ సంస్థగా డోలమైట్ కర్మాగారానికి విశిష్ట స్థానం ఉన్నది.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమాన్ని పక్కకు పెట్టాడు. ఉద్యోగాల భర్తీని నిలిపివేసి ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే చర్యలు చేపట్టాడు. ఈ కర్మాగారాన్ని ప్రైవేట్ పరం చేయడంతో, కర్మాగారంలో పని చేస్తున్న మూడు వందల మంది కార్మికులు, 135 మంది నాన్ ఎగ్జిక్యూట్‌లు, 51 మంది ఎగ్జిక్యూట్ ఉద్యోగులు, ప్లాంటు మెంటెనెన్స్ పనులు చేస్తున్న కార్మికులు, కంపెనీపై ఆధారపడి బ్రతుకుతున్న వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయి.

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు ఈ కర్మాగారాన్ని పట్టించుకోకుండా అశ్రద్ధ చేయడంతో కంపెనీ యాజమాన్యం మైనింగ్ చట్టాలకు వ్యతిరేకంగా అవుట్ సోర్సింగ్ ద్వారా కార్మికుల శ్రమను దోచుకున్నారు. కార్మికుల జీవిత భద్రతను విస్మరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనైన కంపెనీ బాగుపడుతుందని ఆశించిన కార్మికులకు టీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలతో నిరాశ మిగిలింది.

**కార్మికుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ప్రభుత్వం.**

2014 మే 24న గాయిత్రి ప్రాజెక్టు లిమిటెడ్ కంపెనీ రాడ్ బెండింగ్ పనులు చేస్తున్న, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా, ఘమవాద

గ్రామానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు కుమార్ భాస్కర్ కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. అదే నెలలో రేపల్లే రామయ్య వెల్డింగ్ చేస్తూ కరెంట్ షాక్‌కు గురయ్యాడు. మైన్స్ క్రాసింగ్ మరామత్తు పనులు చేస్తూ మాదారం గ్రామానికి చెందిన కార్మికుడు క్రెసింగ్ యూనిట్‌లోపడి మృతి చెందాడు. రియల్‌స్లాబ్ కంపెనీ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు జి. కోటేష్, గద్దే నరేష్ పై అంతస్తు నుండి కింద పడితే కాళ్లు, చేతులు విరిగాయి. ఇంత జరిగినా యాజమాన్యం, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కార్మికులు యాజమాన్యానికి, ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**నిబంధనలు పాటించని యాజమాన్యం**

గతంలో కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కార్మికుల వైద్య సదుపాయాల కోసము హైదరాబాద్‌లోని యశోద, అపోలో హస్పటల్స్‌కు పంపేవారు. కంపెనీలో కార్మికుల కోసం సబ్సిడి క్యాంటిన్‌ను నిర్వహించేవారు. యాజమాన్యం మైనింగ్‌లో డైరెక్టుగా నియామకాలు చేయకుండా కాంట్రాక్టుదారుల ద్వారా కార్మికులను విధులలోకి తీసుకుంటు కార్మికుల సంక్షేమాన్ని పక్కకు పెట్టారు. పక్కకు పెట్టి మైనింగ్ నిబంధనలను గాలికి వదిలేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల స్థితిగతులను, కర్మాగారం భాగోగులను పట్టించుకోకుండా కర్మాగారాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించి కార్మికులను వీధుల పాలు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తుంది.

ప్రభుత్వ తప్పుడు నిర్ణయానికి వ్యతిరేకంగా డోలమైట్ కర్మాగారం కార్మికులందరు ఐక్యమత్యంతో ప్రైవేట్ విధానానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధపడాలి. కార్మికులు రైతులతో, రైతులు కార్మికులతో భుజం, భుజం కలిపి ఐక్యంగా మిలిటెంట్‌గా పోరాడాల్సిన తరుణం ఆసన్నమైంది పోరాడితేనే ఉద్యోగాలు దక్కుతాయి, పోరాడకపోతే ఉద్యోగాలు దక్కవు పరిశ్రమలు ప్రైవేట్‌పరం అయిపోతాయి.

ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన దోపిడి పాలక వర్గాలు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా, వివిధ రంగాలలో ఖాళీగా వున్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులుగా మారుస్తూన్నారు. విదేశీ విష సంస్కృతిని విచ్చలవిడిగా దిగుమతి చేసుకొని మత్తుపానీయాలతో యువతను మత్తులో ముంచుతున్నారు. పోలీసు వ్యవస్థను బలోపేతం చేసుకొని పోరాడుతున్న ప్రజలను అణచివేయడానికి ఉక్కుపాదం మోపుతున్నారు. భారత దోపిడి పాలక వర్గాలు ప్రపంచ బ్యాంకు ఏజెంట్లుగా పని చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలైన సామ్రాజ్యవాద అనుకూల విధానాలు ప్రవేశపెట్టి దేశ అభివృద్ధి నమూన ఇదేనంటూ గొప్పలు చెప్పుకుంటూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్నారు. దేశ ఖనిజ సంపదలను విదేశాలకు తరలిస్తూ సొంత ఆస్తులను పెంచుకోవడంలో తలమునకలవుతున్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాలను వ్యతిరేకిస్తున్న ప్రజలను, ప్రజాస్వామిక వాదులను, మేధావులను అసాంఘీక శక్తులని అభివృద్ధి నిరోధకులంటు ముద్రలు వేస్తున్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థలతో ప్రభుత్వ అధికారుల, పోలీసుల కుమ్మక్కు

జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు ఎక్కువగా ఫీజులు వసూలు చేయటమేకాకుండా యూనిఫామ్స్, టై, బెల్ట్, మరియు పుస్తకాలు, నోట్ బుక్స్, కూడా ప్రైవేటు పాఠశాలలో అమ్ముతున్నారు. అంతేకాకుండా యమ్ఆర్‌పి ధర కన్న ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. బయట దొరికే 20 రూపాయల నోట్‌బుక్ ప్రైవేటు పాఠశాలలో 60 రూపాయలకు విద్యార్థులకు అమ్ముతున్నారు. అమాయకమైన ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ విధంగా క్లాసులు పెరిగే కొద్దీ ధరలు పెంచుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు దోపిడి చేస్తున్నాయి.

ప్రైవేట్ విద్యాసంస్థలలో పుస్తకాలు,నోట్ బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్ట్ పాఠశాలకు మరియు కళాశాలకు సంబంధించినవి ఏ వస్తువులైన పాఠశాలలో అమ్మటం చట్టరీత్యా నేరం అయినా అమ్ముతున్నారు. ఈ విషయం తెలిసిన విద్యార్థి సంఘాలు ఐక్య కార్యచరణ చేపట్టారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు తనిఖీలు చేపట్టారు. అధికారులు చేయవలసిన పనిని విద్యార్థులు చేశారు. ఎనిమిది ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు, నోట్‌బుక్స్, టై, బెల్ట్, యూనిఫామ్స్ అమ్ముతున్నట్లు బయటపడింది. పోలీసు అధికారులకు, జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేయటంతో పాఠశాలలో ఉండే పుస్తకాలు, నోట్ బుక్స్, టై, బెల్ట్, యూనిఫామ్స్ ఉన్న గదిని అందరూ కలిసి సీజ్ చేశారు. కాని అధికారులు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

సీజ్ చేసిన కొన్ని రోజుల తరువాత ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్స్, నోట్ బుక్స్ అమ్ముతున్నట్లు విద్యార్థులు తెలిపారు. విద్యాసంఘాలు ప్రైవేటు పాఠశాలకు వెళ్ళి యాజమాన్యంను ప్రశ్నించారు. కాని యాజమాన్యం ఎలాంటి సమాధానం చెప్పలేదు. విద్యార్థి సంఘాలు డిఇఓ ఆఫీస్ దగ్గరకు వెళ్ళి అధికారులతో ఎందుకు ప్రైవేటు పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోలేదు. చట్టాన్ని తుంగలో తొక్కి అక్రమంగా పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అమ్ముతున్నారు అయిన మీరు ఎందుకు స్పదించటం లేదు అని ప్రశ్నిస్తే అధికారులు విద్యార్థులకు ఎలాంటి సమాధానం చెప్పలేదు. అవినీతి, అక్రమాలు, అన్యాయాలు కాపాడుతున్న పోలీసులు విద్యార్థులపై అరాచకంగా ప్రవర్తిస్తూ, కేసులు పెట్టారు. ప్రభుత్వ ఆఫీసుకు భంగం కల్పించారని బూటకపు కేసులు పెట్టారు. పుస్తకాలు ఇవ్వాల్సిన చేతులకు ఎఫ్ఐఆర్ ఇస్తున్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం అధికార యంత్రాంగానికి లావాదేవీలు ఉండటంతో అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చట్టాలన్ని దోపిడి అధికారుల కాళ్ళ కింద ఉండటం వలన దోపిడీ విచ్చలవిడిగా కొనసాగుతుంది. ఎంతో నమ్మకంగా తమ విద్యా సమస్యలు తీరుస్తారని నియమించిన అధికారులే కార్పొరేటు తొత్తులుగా మారి పేద ప్రజల శ్రమ దోచుకుంటున్నారు. ఎప్పటికైన విద్యార్థులు ఐక్యమై ఈ దోపిడీ పాలక అధికారాలను, కార్పొరేటు వ్యవస్థను విద్యార్థుల పోరాటంతో భూస్థాపితం చేస్తారు.

**బీడు భూములకు జూరాల ప్రాజెక్టు నీటిని పోరాడి సాధించుకున్న రైతులు**

జోగుళాంబ గద్వాల జిల్లాలో గద్వాల నుండి 25 కిల్లో మీటర్ల దూరంలో జూరాల ప్రాజెక్టు ఉన్నది. ఈ ప్రాజెక్టు చుట్టూ ఉన్న గ్రామాలలోని ప్రాజెక్టు నుండి కాలువలకు వచ్చే నీటి నుండి బీడు భూములకు సంవత్సరానికి మూడు నెలల కొక్కసారి నీటిని విడుదల చేస్తారు. ఈ నీటిపై ఎంతో మంది రైతులు ఆధారపడి బ్రతుకుతున్నారు. కాలువకు నీటిని వదలని సమయంలో ప్రజలు వేరే గ్రామలకు వెళ్ళి కూలీలుగా, ఫ్యాక్టరీలలో పని చేస్తారు.

ఈ సంవత్సరం కాలువలకు నీటిని సక్రమంగా వదలటం లేదు. ప్రాజెక్టు నుండి కాలువలకు రెండురోజులకొక్కసారి నీటిని విడుదల చేయాలి. కాని ఐదు రోజులు అవుతున్నా నీటిని విడుదల చేయటం లేదు. అందువలన పంట ఎండిపోవటానికి వచ్చింది. దీనితో రైతులు ఐక్యమయి ఆర్‌డివో ఆఫీస్ ముందు తమ సమస్య చెప్పటంతో అధికారులు జూరాల ప్రాజెక్టులో నీళ్ళు లేవు. ఇప్పుడు వదలటం కష్టం అన్నట్లు మాట్లాడారు. ఎలాగైనా మా సమస్యను పరిష్కరించండి అంటూ 100 మంది రైతులు కలిసి నీటిశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. అయినప్పటికి ఎలాంటి పరిష్కారం దొరకలేదు.

ఏ అధికారికి తెలియజేసినా ఎవరు స్పందించకపోవటంతో రైతులు ఎంతో ఆవేదనతో కుమిలిపోయారు. కష్టపడి పండించిన, చేతి కొచ్చిన పంట నీళ్ళు లేక ఎండిపోతుంది. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేటట్లు లేదు. ఇలాంటి పరిస్థితిలో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు ఆగ్రహం వ్యక్తపరిచారు. గద్వాల జిల్లాలోని కొత్త బస్టాండు వద్ద రోడ్డుపై నిరసన తెలియజేస్తు, మా సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ ఎర్రటి ఎండలో కూర్చున్నారు. నాలుగు నెలలు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యను పట్టించుకోవటానికి ఒక్క అధికారి కూడా రాలేదు. అధికారులకు, దోపిడి దారులకు తొత్తులైన పోలీసులు వచ్చి రైతులపై దౌర్జన్యం చెలాయించి కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ రైతులు పట్టు విడవకుండా అలాగే కూర్చోవటంతో నీటిశాఖ అధికారి వచ్చి మీ సమస్యను పరిష్కరిస్తానని చెప్పటంతో రైతులు అక్కడి నుండి ముందుకు కదిలారు. నీటిని విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రైతుల తిరుగులేని పోరాటం వలన అధికారులు దిగివచ్చి రెండు రోజులలో నీటిని విడుదల చేశారు. ఏ సమస్యకైన పోరాటమే మార్గమని రైతులు మరోసారి నిరూపించారు. పోరాటం ద్వారానే రైతులు తమ పంటలకు నీళ్ళు సాధించుకున్నారు.

**కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా**

సింగరేణిలో కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి సింగరేణి యాజమాన్యం నేరుగా పనుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్టర్లు, కార్మికులను ఇష్టరాజ్యంగా దోచుకుంటున్నారని కాంట్రాక్టు కార్మికులు జీఎం కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. కే.సీ.హెచ్.పి. సి.ఓ.సి. మల్లేపల్లి ఓ.సి. బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులను సెమిస్కిల్డ్ కార్మికులుగా గుర్తించాలి. రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. ఓ.సి. స్టోర్స్, ఓ.సి. దంపర్ సెక్షన్ కార్మికుల మస్టర్లు పెంచాలి. సులబ్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి. స్కిల్డ్ వర్కర్లను, నర్సరీ వర్కర్లకు మస్టర్ లెక్కన జీతాలు చెల్లించాలి. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను కామన్ డ్రెస్‌కోడ్ అమలు చేయాలి. గెస్ట్‌హౌజ్ కొరియర్, ఉద్యావన కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపిఎఫ్ పాస్ పుస్తకాలు ఇవ్వాలి. సొసైటి కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించాలి. కన్వేయన్స్ వాహన డ్రైవర్లకు సీ.ఎం.పి.ఎఫ్. బోనస్, జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏరియా జీఎంకు అందచేసారు.

**యూజీసీ రద్దును వ్యతిరేకిస్తు కళాశాల విద్యార్థుల ఆందోళన**

యూజీసీ రద్దు చేసి దాని స్థానంలో భారత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు చేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేయూ క్యాంపస్ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. యూ.జీ.సీ. ద్వారా విద్యారంగం నిర్మాణానికి విస్తరణకు ఎంతో ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం తీసుక వచ్చే భారత ఉన్నత విద్యా కమీషన్‌తో ఉన్నత విద్య ప్రైవేట్‌పరం అవుతోందని, పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం చేయడమేనని, విశ్వ విద్యాలయాలు తీవ్రమైన సంక్షోభంలో పడ్డాయని విద్యార్థులందరూ క్యాంపస్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలియచేశారు. భారత ఉన్నత విద్యా కమీషన్‌ను (హెచ్.సీ.ఎల్.ఐ.) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**గ్రామ పంచాయితీ కార్మికుల సమ్మె.**

గ్రామ పంచాయితీ కార్మికులు పంప్ ఆపరేటర్లు, గుమస్తాలు, ఎలక్ట్రీషియన్ల, పంచాయితీ వర్కర్లు కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, అర్హత కలవారిని కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయితీ కార్మికులు నిరసన, ర్యాలీ నిర్వహించి మండల పరిషత్ కార్యాలయం చేరుకొని ఎంపిడివోకు వినతి పత్రం అందచేసి సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద సమ్మెను ప్రారంభించారు.

36 సం॥రాలుగా వెట్టిచాకిరి చేస్తూ అరకొర వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్న గ్రామ పంచాయితీ కార్మికులు తమ డిమాండ్స్ సాధన కోసం, రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టారు. పలుమార్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టి పాలకులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ తమ గోడును పట్టించుకోకపోవడంతో విసిగి వేసారి గ్రామ పంచాయితీ కార్మికులందరు విధులను బహిష్కరించి సమ్మెకు పూనుకున్నారు.

గతంలో 2015లో 44 రోజులు సమ్మె చేస్తే ప్రభుత్వం దిగివచ్చి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలుపుకోలేదు. 1982కు ముందున్న

వారందరిని ఆనాటి ప్రభుత్వాలు వాళ్ళ సీనియారిటీ ఆధారంగా ఫర్మినెంట్ చేయడం జరిగింది. అప్పటి నుండి ఇప్పటి వరకు 36 సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేస్తున్న గ్రామ పంచాయితీ కార్మికులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తమ ఉద్యోగాలను తెలంగాణ ప్రభుత్వం ఫర్మినెంట్ చేస్తారని ఆశతో ఎదురు చూసిన గ్రామ పంచాయితీ కార్మికులకు నిరాశే మిగిలింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయితీ కార్మికులు ఉమ్మడి జిల్లాలలో ఒక్కొక్క జిల్లాలో నాలుగు వేల నుండి ఐదు వేల మంది కార్మికులు పని చేస్తారు. కారోబార్లు, ఎలక్ట్రీసియన్లు, పంప్ ఆపరేటర్లు, స్వీపర్లుగా పని చేస్తున్నారు. వీరంతా సర్పంచ్‌ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బ్రతకవలసి వస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయితీలకు మంజూరు అయ్యే నిధులలో నుంచి 30 శాతం కార్మికులకు వేతనాలుగా ఇవ్వాలి. కాని ఈ నిబంధనలను ఏ సర్పంచ్‌లు పట్టించుకోకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

గత 36 సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేస్తున్న గ్రామ పంచాయితీ కార్మికులు ఇంటి పన్నులు, నల్లా పన్నుల వసూలపైనే వీరు జీతాలు తీసుకుంటూ చాలి చాలని జీతాలతో బ్రతుకుతున్నారు. కొన్ని గ్రామ పంచాయితీలలో కార్మికులకు సంవత్సరానికి రెండు మూడు నెలలకు కూడా జీతాలు అందటం లేదు. దీనితో కార్మికులందరు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి, అధికారులకు వినతిపత్రాలు అందచేసినా ఇప్పటి వరకు పట్టించుకోకపోవడంతో విసిగి వేసారిన గ్రామ పంచాయితీ కార్మికులు పంచాయితీల్లో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వామే వేతనాలకు గ్రాంట్ మంజూరు చేయాలి. సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సౌకర్యాలు కల్పించాలి. పంచాయితీ కార్యదర్శి పోస్టులను ప్రస్తుతం పని చేస్తున్న కారోబారు, బిల్‌కలెక్టర్ అర్హులైన ఉద్యోగాలచే భర్తీ చేయాలి. జనాభా ప్రాతిపదికన పోస్టులను ఏర్పాటు చేసి ప్రస్తుతం పని చేస్తున్న వారితో భర్తీ చేయాలి. పి.ఎఫ్., ఇఎస్‌ఐ ఫించన్ సౌకర్యం కల్పించాలి. మరణించిన వారి అంత్యక్రియల ఖర్చును ఐదు వేల నుంచి ఇరవై ఐదు వేలకు పెంచాలి. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ డిమాండ్ పత్రాన్ని అధికారులకు అందజేసి విధులను బహిష్కరించి సమ్మెను చేపట్టారు.

**మణుగూరు ఓ.సీ పనులను అడ్డుకున్న రైతులు.**

తెలంగాణ రాష్ట్రంలో ఓ.సీ.లను రద్దు చేస్తానని అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు 14 ఓ.సీ.లకు అనుమతులు మంజూరు చేసి వందలాది గ్రామాలను వల్లకాడుగా మార్చటానికి దూకుడుగా ఓ.సీ.లను వేగవంతం చేస్తున్నాడు. ఓ.సీ.ల ద్వారా గ్రామాలన్నీ బొందల గడ్డలుగా మారుతాయని రైతులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఓ.సీ.లను అడ్డుకుంటున్నా లెక్కచేయకుండా ప్రభుత్వ అండదండలతో సింగరేణి యాజమాన్యం బొగ్గు తవ్వకాలు మొదలుపెట్టింది. ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వకుండా సింగరేణి యజమాన్యం డజన్ ఓ.సీ.ల బొగ్గు తవ్వకాలు చేపట్టడంతో కోపోద్రిక్తులైన రైతులు సింగరేణి అధికారులను నిలదీసి బొగ్గు తవ్వకాలను అడ్డుకున్నారు.

ఓ.సీ.లో పోతున్న సారవంతమైన భూములకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కోర్టును ఆశ్రయించటంతో, కోర్టు రైతుల పక్షన స్టే ఉత్తర్వులు జారి చేసింది. సింగరేణి యాజమాన్యం కోర్టు ఉత్తర్వులను లక్ష్యపెట్టకుండా పోలీసుల అండతో దౌర్జన్యంగా ఓపెన్ కాస్టులను తవ్వటం మొదలు పెట్టడంతో కోపోద్రిక్తులైన రైతులు సంఘటన స్థలానికి చేరుకొని ఎకరానికి పది లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తవ్వకాలను అడ్డుకున్నారు.

**లారీ డ్రైవర్‌ల, క్లీనర్‌ల సమ్మెతో దిగివచ్చిన యాజమాన్యం.**

సింగరేణిలోని తాండూర్ ఐ.బి. బొగ్గు ఖాంట నుండి ఇతర ప్రదేశాలకు బొగ్గును తరలిస్తున్న లారీ డ్రైవర్స్, క్లీనర్స్ 400 మంది తమ జీతాలను పెంచాలంటూ యాజమాన్యానికి సమ్మె నోటీస్‌ను ఇచ్చి పనులను బందు పెట్టినారు. డ్రైవర్, క్లీనర్‌ల సమ్మెతో బొగ్గు నిలువలు పేరుకొనిపోవటంతో యాజమాన్యం ఐదు రోజుల తరువాత స్థానిక ఎమ్మెల్యేలను పిలిపించుకొని డ్రైవర్, క్రీనర్లతో చర్చలు జరిపినారు. 12 వేల జీతం నుండి 16 వేల ఐదు వందల వరకు పెంచటానికి యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. అలాగే ఈ ఒప్పందాన్ని సింగరేణివ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేయటంతో యాజమాన్యం అమోదించింది.

యాజమాన్యం 15 రోజుల తర్వాత ఒప్పందాన్ని ఉల్లంఘించటంతో లారీ డ్రైవర్లు, క్లీనర్లు పనులను బంద్‌పెట్టి సమ్మెలోకి వెళ్లారు. దీనితో యాజమాన్యం దిగివచ్చి తమ తప్పులను అంగీకరించి గత ఒప్పందాన్ని అమలు చేయడం జరిగింది.

**పోరాడి సాధించుకున్న పారిశుద్ధ కార్మికులు**

కాజిపేట రైల్వే స్టేషన్‌లో పారిశుద్ధ పనులు చేస్తున్న 150 మంది మహిళా కార్మికులు తమ జీతాలు పెంచాలంటూ పీ.యఫ్,ఇ ఎస్.ఐ నెలకు నాలుగు సార్లు (రెస్ట్) ఆఫ్‌లు ఇవ్వాలని ధర్నాలు నిర్వహించారు. కార్మికుల పోరాటాన్ని విచ్చిన్నం చేయటానికి పోలీసులు బెదిరించినప్పటికీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించేంత వరకు పనులలోకి వెళ్లమని సమ్మెను కొనసాగించటంతో రెండు రోజుల తర్వాత రైల్వే కాంట్రాక్టర్ దిగివచ్చి పారిశుద్ధ కార్మికులతో చర్చలు జరిపాడు. చర్చల్లో కార్మికులకు గతంలో ఇస్తున్న నాలుగు వేల జీతానికి బదులు కనీసం 18 వేల రూపాయలు జీతం పెంచాలని డిమాండ్ చేయటంతో కాంట్రాక్టర్ 13 వేల ఐదు వందల రూపాయలు జీతం ఇస్తానని మరియు పి.యఫ్.ఇ.ఎస్ఐ నెలకు నాలుగు ఆఫ్‌లు ఇస్తానని ఒప్పందం చేసుకున్నారు. పారిశుద్ధ కార్మికులు పోరాటం ద్వారా తమ డిమాండ్స్‌ను సాధించుకున్నారు.

**అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడించిన ఆదివాసులు**

హరితహారం పేరుతో పోడు భూములను సాగుచేసుకుంటున్న ఆదివాసులపై భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, జయశంకర్, కోమరం భీం, మంచిర్యాల జిల్లాలలో అటవీ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు చేస్తూ, పంట పొలాలు నాశనం చేస్తూ,

ఆదివాసులపై అక్రమ కేసులు బనాయిస్తున్న అటవిశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ధర్నా నిర్వహించారు. పోడు భూములను అటవిశాఖ, రెవెన్యూశాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి సాగు చేసుకుంటున్న వారికి హక్కుల పత్రాలను ఇవ్వాలి. అలాగే వారికి రైతుబంధు పథకం వర్తింపజేయాలి. దౌర్జన్యంగా పోడు భూములను లాక్కోని కందకాలు తీసినవాటిని పూడ్చివేసి, చుట్టూ ఉన్న కంచెలను పీకివేసి పోడుదారులైన ఆదివాసులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ గేటువద్ద ర్యాలీగా వెళ్లి అటవీ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు.

**విద్యుత్ కార్మికుల సమ్మె**

విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలను ఏండ్ల తరబడి పట్టించుకోకుండా యాజమాన్యం మొండి వైఖరిని ప్రదర్శిస్తుండడంతో తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీని కలిసి ఏడు డిమాండ్లతో కూడిన నోటీసు ఇచ్చి సమ్మెను ప్రారంభించారు. యాజమాన్యాలు డిమాండ్లలోని రెండింటిని కాంట్రాక్ట్ ఉద్యోగులు చనిపోతే ఆయా కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగం, ఈపీఎఫ్ వాటా చెల్లించడానికి అంగీకరించాయి. కార్మికులు అన్నింటిని అంగీకరించాలని డిమాండ్ చేయడంతో యాజమాన్యం మొండిగా ప్రవర్తిస్తూ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి డీ.ఈ కార్యాలయంలో ఆర్టిజన్లు, విద్యుత్తు కార్మికులు వేసుకున్న శిబిరాలను పోలీసులచే తొలిగించారు. కార్మికులు యాజమాన్యం మొండి వైఖరిని నిరసిస్తూ శామీర్ పేటలోని కట్టమైసమ్మ ఆలయం వద్ద ఒక రోజంతా నిరసన తెలిపారు. యాజమాన్యం ఒప్పుకున్న రెండు డిమాండ్లతో పాటు ఆర్టిజన్లకు పేస్కేల్, ఆన్‌మ్యాన్ గ్యాంగులకు కనీస వేతనాలు, పెండింగ్ ఆర్టిజన్ల గుర్తింపు, విద్యుత్తు సంస్థల్లో విలీనం చేసేంత వరకు రోజు రోజుకు వివిధ రూపాలలో సమ్మెను తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

**మణుగూర్ ఓ.సీ.లో. రైతుల దీక్ష**

86 ఎకరాల భూమికి నష్టపరిహారం ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం మణుగూరు ఓ.సీ. ఓబీ పనులు చేపట్టడంతో రైతులు ఆందోళన చేపట్టి ఓ.సీ. పనులు అడ్డుకున్నారు. సర్వం సింగరేణికి అప్పగిస్తే సింగరేణి యాజమాన్య రైతులకు మొక్కుబడిగా నష్టపరిహారం ఇవ్వజూపింది. రైతులు న్యాయం కావాలని కోర్టును ఆశ్రయిస్తే రైతుల పక్షాన కోర్టు స్టే ఉత్తర్వులు జారి చేసింది. సింగరేణి యాజమాన్యం కోర్టు ఉత్తర్వులను లెక్కచేయకుండా ఓ.సీ. పనులు మొదలు పెట్టడంతో రైతులు అడ్డుకొని మణుగూరు ఓ.సీ. గుట్టలపై గుడారాలు వేసుకొని దీక్ష చేపట్టారు. రైతుల కుటుంబాలు ఇందులో పాల్గొని సింగరేణి అధికారుల దౌర్జన్యాలను అడ్డుకునేందుకు పగలు, రాత్రి గస్తీ తిరుగుతున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం మొండి వైఖరిని విడనాడి ఎకారాకు 10 లక్షల నష్టపరిహారం చెల్లించేంత వరకు ఇక్కడి నుండి కదిలేది లేదని హెచ్చరించారు.

**ఆదివాసీల గ్రామాలపై అటవీ అధికారుల దాడులు, గుడిసెల కూల్చివేత**

పశ్చిమ గోదావరి జిల్లా అడవుల్లో 15 సం॥లకు ముందు ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి జీవిస్తున్న ఆదివాసీల గ్రామాలపై అటవీ అధికారులు సిబ్బందితో వచ్చి దాడులు చేస్తూ ఇండ్లను కూలగొడుతూ అడ్డం వచ్చిన మహిళలను, పురుషులను, పిల్లలను కొడుతూ, నోటికి వచ్చినట్లు తిడుతూ, మీరందరు గ్రామాలు ఖాళీ చేసి పోవాలంటూ హెచ్చరికలు చేస్తున్నారు. 15 ఏళ్లకు పైగా ఇక్కడే జీవిస్తున్న మమ్మలను ఖాళీచేసి ఎక్కడకు పోవాలని గోడు చెప్పుకున్నా అటవీ అధికారులు వినకుండా బలవంతంగా వెళ్లగొట్టడంతో దిక్కుతోచని ఆదివాసీలు చెట్ల క్రింద తలదాచుకున్నారు. ఇంత జరుగుతున్నా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదు. విభజన నేపథ్యంలో కొత్తురులోని 7 కంపార్ట్‌మెంట్లలో 3 కంపార్ట్‌మెంట్లు తెలంగాణలో కలిపాయి. మళ్లీ ఇటీవల 1250 హెక్టార్ల భూమి తెలంగాణలో కలవటంతో తెలంగాణ అటవీ అధికారులు దాంపురం ఆదివాసీల గ్రామాలపై దాడులు చేస్తున్నారు.

**పోడు రైతులపై అటవి అధికారుల దాడి, తిరగబడ్డ రైతులు**

ఆదివాసులు నివసిస్తున్న భూమిలోపల విలువైన ఖనిజ సంపదలు ఉండటంతో ఆదివాసులను ఆ భూముల నుండి తరిమివేసి ఖనిజ సంపదలను బహుళ జాతి సంస్థలకు దారాదత్తం చేసేందుకు ప్రభుత్వం ఆదివాసి గూడాలపై దాడులు చేపిస్తున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలోని కోటగడ్డలోని సూమారు 20 హెక్టార్ల పోడు భూముల్లో హరితహారం పేరుతో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటేందుకు సిబ్బందితో వెళ్లడంతో ఆదివాసులు అటవీ అధికారులను, సిబ్బందిని అడ్డుకున్నారు. అధికారులు రెచ్చిపోయి పోడు చేసేవారిపై దాడులు చేస్తూ దుర్భాషలాడుతూ కర్రలతో విచక్షణా రహితంగా కొట్టడంతో కుంజా స్వప్న స్పృహతప్పింది. అయినా వదలకుండా రైతులను గాయపర్చి బలవంతంగా వాహనాలలో ఎక్కించి పోడుదారులను చరవాణీలలో, కొన్ని వాహనాల్లో పాల్వంచ వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి తరలించి గేటుకు తాళం వేశారు. ఎంత సేపటికి అధికారులు తాళం తీయకపోవడంతో రైతులందరు గేటు ఎక్కి బయటకు వచ్చి రహదారిపై ఆందోళన చేసారు.

**విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడి**

**ప్రగతి భవన్ ఎదుట ఎస్.ఎస్.ఏ. ఉద్యోగుల ధర్నా**

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది బారీ స్థాయిలో తరలివచ్చి సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పీ.జీ.టీ.లకు జే.ఎల్. స్థాయి స్కేల్‌ను వర్తింపజేయాలని, సమస్యలు పరిష్కరించాలని నినదించి నిరసన తెలియజేశారు. పోలీసులు వీరిని అరెస్టు చేస్తే ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సర్వశిక్ష అభియాన్ (ఎస్.ఎస్.ఏ.) ఉద్యోగులు ధర్నా చేపట్టారు. కేబినెట్ ప్రారంభమయే 5 నిముషాల ముందు ప్రగతి భవన్ ముందు మూడు గ్రూపులుగా విడిపోయి మూడు దఫాలుగా ధర్నాకు దిగినారు. వీరిని పోలీసులు లాఠీచార్జీ చేసి గాయపరచినా పట్టుదలతో మా సమస్యలు పరిష్కరించే వరకు కదిలేది లేదని నినదించారు. ✦

(....42వ పేజీ తరువాయి)

ఉన్న కాంగ్రెస్‌కు మధ్యనే ప్రధానంగా పోటీ ఉన్నప్పటికీ కాంగ్రెస్‌తో కలిసి టీడీపీ, సీపీఐ, తెలంగాణ జనసమితి ఒక కూటమిగా ఏర్పడి సీట్లు సర్దుబాటు చేసుకున్న మహాకూటమి ఒక బలమైన శక్తిగానే ముందుకు వస్తుంది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా ఈ పార్టీలు ఐక్యమయ్యాయి. ఇదికాక సీపీఎం నీల్‌లాల్ ఐక్యత పేరుతో వివిధ సంస్థలను కలుపుకుని బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్)గా పోటీ పడుతున్నది. టీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకత్వంలోని మహాకూటమి, బీఎల్‌ఎఫ్‌ల గురించి, బీజేపీ గురించి వివరంగా తెలుసుకుందాం.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటే బూర్జువాల ప్రజాస్వామ్యమే. అది ప్రజల పేరుతో ప్రజల్ని మోసగించి, దోపిడీచేసి, అణచివేసే బూర్జువా నియంతృత్వమే. ఈ ఎన్నికల్లో ఏర్పడే కూటములు అవకాశవాద కూటములే. నిన్న పరస్పరం ద్వేషించుకుని, దూషించుక్ను వారే మహాకూటమిలో ఉన్నారు. ఈ ఎన్నికల రాజకీయపొత్తులలో నీతి, నిజాయితి, చిత్తశుద్ధి, జవాబుదారీతనం, కనీస నైతికత, ప్రజాస్వామిక దృక్పథం, విలువలు లేవు. ఏ రోజు ఎవరు ఏ పార్టీలో ఉంటారో కూడా చెప్పలేం.

**4. టీఆర్ఎస్ పార్టీ గురించి వివరంగా చెప్పండి?**

రాష్ట్రంలో నీళ్లు, నిధులు నియామకాలు, భూమి, అధికార వికేంద్రీకరణ, స్వావలంబన, సామాజిక న్యాయం లాంటి ఉద్యమ కాలంనాటి డిమాండ్లలో ఏ ఒక్కటి పరిష్కారం కాలేదు. రైతాంగం ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. రైతు రుణమాఫీ వాగ్దానాన్ని అటకెక్కించింది. రైతుబంధు పథకంతో భూస్వాములు, ధనిక రైతులకు అధిక మొత్తంలో ప్రభుత్వ ఖజానా నుండి ప్రజల డబ్బును వేల కోట్ల రూపాయలు అందించి గ్రామీణ సంపన్న వర్గాన్ని, సంపన్నం చేసిన టీఆర్ఎస్ ప్రభుత్వం అసమానతలు మరింత పెంచింది. చెరువుల పూడికలలో, నీటిపారుదల ప్రాజెక్టులలో అవినీతి, అక్రమాలకు పాల్పడి ప్రజాధనాన్ని పంచుకు తినడమేకాకుండా ఉద్యమ కాలంలో ఏ కాంట్రాక్టర్లను విమర్శించారో వారికే అనుకూలంగా కాంట్రాక్టులను అప్పజెప్పారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు 'బంగారు తెలంగాణ' సాధన తన లక్ష్యం అని ప్రకటించి సామ్రాజ్యవాద ఎజెండాను దూకుడుగా అమలుచేస్తున్నారు. పారిశ్రామికీకరణలో 'టీ-పాస్' పేరిట హైటెక్ పరిశ్రమలకు, ప్రైవేటు పరిశ్రమలకు పెద్దపీట వేస్తున్నారు. వారికి లక్షల ఎకరాల భూములు, నీళ్ళు, విద్యుత్ లాంటి ఉచిత సదుపాయాలతో పాటు అనేక రాయితీలు ఇచ్చారు. ఉపాధి కల్పించడం, నిరుద్యోగ సమస్య పరిష్కరించడం చేయకపోగా, అందుబాటులో ఉన్న ఉద్యోగాలను కూడా భర్తీచేయ లేదు. పోలీసు వ్యవస్థను మాత్రం బలోపేతం చేసుకొని తమ దుష్టపాలనకు రక్షణ కల్పించుకున్నారు.

వాక్‌సభా స్వాతంత్ర్యాలను హరించివేసి, ప్రజాఉద్యమాలను అణచివేయడంతో పాటు విప్లవకారులని బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్యలు చేస్తుంది. ఏక పక్షంగా ధర్నాచౌక్‌ను రద్దు చేసి, ప్రజల నిరసన గళాన్ని తొక్కిపెట్టారు. (ఇటీవలనే హైకోర్టు ప్రభుత్వ చర్యను తప్పుబట్టింది. ధర్నాచౌక్‌ను 6 వారాల పాటు పునరుద్దరించింది)

మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం ఒక లక్షా 80 వేల కోట్ల రూ॥ల రుణగ్రస్త రాష్ట్రంగా మారింది. మల్లన్న సాగర్, హరితహారం, నేరుట్ల లాంటి అనేక సమస్యల్లోను, అలాగే ప్రైవేటు విద్యా సంస్థలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఉద్యమాలపట్ల పోలీసులు పరమ కిరాతకంగా దాడులు చేసి, వేలాది మందిని అరెస్టు చేసారు. సభలు, సమావేశాలపై ఆంక్షలు విధించి దాడులు నిర్వహించారు. ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఆందోళనలు చేస్తున్న ప్రజలపై విచక్షణా రహితంగా దాడిచేసి 20వేల మందిని అరెస్టు చేసారు. రైతాంగ ఆత్మహత్యలు, దళితులపై దాడులు, పరువు హత్యలు పెరిగిపోయాయి. గిట్టుబాటు ధరను అడిగినందుకు రైతులకు బేడీలు వేసిన ఘనత కూడా వీరిదే.

సామాన్య రైతుల భూములను, దళితుల అసైన్డ్ భూములను ప్రభుత్వమే బలవంతంగా గుంజుకున్నది. 2013 భూసేకరణ చట్టం సవరించి తనకు అనుకూలంగా మార్చుకున్నది. కార్పొరేట్ వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తూ నికర సాగు విస్తీర్ణాన్ని తగ్గించి వేసింది. కరువు ప్రాంతాలకు, వెనకబడిన ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించే సమగ్ర పథకం లేదు. వలసలు పెరిగాయి. వ్యవసాయ పంట ధరలు పడిపోయాయి. గిట్టుబాటు కాని వ్యవసాయం రైతాంగ ఆత్మహత్యలకు ప్రధాన కారణం. ఉపాధి హామీ పథకం సరిగా అమలుకాలేదు. అవినీతి కారణంగా రాజకీయ నాయకులు, అధికారులు లాభపడ్డారు. చేతివృత్తులు దెబ్బతిన్నాయి. చేనేతరంగం దెబ్బతింది. చేనేత కార్మికుల ఆత్మహత్యలు పెరిగాయి. బడుగు వర్గాల ప్రజలకు ఇండ్లస్థలాలు లేవు. ఇండ్లు కట్టిస్తామన్న ప్రభుత్వ హామీ అమలుకాలేదు. పరిశ్రమలు మూసివేయడం, ఆధునిక యంత్రాలు తెచ్చి కార్మికుల్ని తొలగించడంతో ఉపాధి దెబ్బతిన్నది. ఒక్క మాటలో కేసీఆర్ నియంతృత్వంలో ప్రజావ్యతిరేక పాలన సాగించాడు.

**5. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని మహాకూటమి అధికారంలోకి వస్తే మార్పు ఉంటుందా?**

కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. అదంతా సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసిన చరిత్ర. బడా భూస్వాములు, దళారీ నిరంకుశ పెట్టుబడుదారులతో కూడిన కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో అనేక సార్లు ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ప్రజా వ్యతిరేకంగా పాలించింది. అనేక అవినీతి కుంభకోణాలలో లక్షల కోట్ల ప్రజాధనాన్ని స్వాహాచేయడం, ప్రజా ఉద్యమాలను, జాతుల ఉద్యమాలను అణచివేయడం, అభివృద్ధి నిరోధకంగా వ్యవహరించడంతో ప్రజలు అధికారం నుంచి తొలగించారు. ఇప్పుడు తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో గెలవడానికి చూస్తుంది. అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేస్తామని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని మాయ మాటలు చెబుతుంది. ఒంటరిగా పోటీ చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయగలిగిన పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి లేదు. అందుకే మహాకూటమిని ఏర్పాటుచేసింది. ఉద్యమ కాలం నాటి డిమాండ్ల పట్ల ఏనాడు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో వ్యవహరించలేదు. ఈ కూటమి అధికారంలోకి వచ్చినా కొత్తగా ప్రజలకు ఒరిగేదేమీలేదు.

**6. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తాం అంటున్నారు. వాళ్ళకాపరిస్థితి ఉందా?**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈ నాలుగున్నర సం॥రాల కాలంలో బ్రాహ్మణీయ హిందూమతోన్మాద పరిపాలనను, ఫాసిస్టు

రాజ్యాన్ని నెలకొల్పింది. రాజకీయ అసహనానికి, కుల మత వైషమ్యాలకి కారణ భూతమైన మోదీ నియంతృత్వ పాలనను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణలో బీజేపీ తన పట్టు పెంచుకొని అధికారంలోకి రావడానికి అబద్ధపు ప్రచారంతో, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సామ్రాజ్యవాదుల ఎజెండాను దూకుడుగా అమలుచేస్తుంది. అందులో భాగంగానే నోట్ల రద్దు, జీఎస్టీ లాంటి నిర్ణయాలతో సామాన్య ప్రజల బతుకులతో చెలగాటమాడింది. పేద, మధ్యతరగతి ప్రజల బతుకులను ఛిద్రం చేసింది. నిరుద్యోగం, అధిక ధరలు, రైతాంగ ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలు, ఆదివాసీ, దళిత మైనారిటీలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయి. డాలర్‌తో రూపాయి మారకపు విలువ పడిపోయింది. మోదీ గ్రాఫ్ కూడా క్రమంగా ప్రజల్లో పడిపోతూ వచ్చింది. ఇక్కడ తెలంగాణలో బీజేపీకి ఉన్న సీట్లు నిలబెట్టుకోవడమే కష్టం కావచ్చు.

**7. తెలుగుదేశం పార్టీని తెలంగాణా ప్రజలు ఆమోదిస్తారా?**

చంద్రబాబునాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా నిలిచింది. ఆ విధంగా తెలంగాణ ప్రజలకు దూరమైంది. ఇప్పుడు టీఆర్ఎస్ పట్ల ఉన్న వ్యతిరేకతను, ప్రభుత్వ వ్యతిరేక ఓటును గెలుచుకుని కొన్ని సీట్లు సంపాదించుకోవడానికే మొదటి నుంచి శత్రు పక్షమయిన కాంగ్రెస్‌తో కలిసి మహాకూటమిలో చేరింది. టీడీపీ నాయకుడు చంద్రబాబు అవినీతికి పెట్టింది పేరు. ప్రజా ఉద్యమాలను, విప్లవోద్యమాలను అణచడంలో ముందుండేవాడు. ఇప్పుడు కూడా రాంగూడా లాంటి భారీ స్థాయి పోలీసు హత్యాకాండను జరిపించిన చరిత్ర ఉంది. అవకాశవాద రాజకీయాలకు నెలవుగా టీడీపీ పార్టీ మారింది. అధికారం తప్ప మరో ఎజెండా లేని పాలకవర్గ పార్టీల్లో ఇది ఒకటి. తెలంగాణ ప్రజలకు టీడీపీ పట్ల వ్యతిరేకత తగ్గలేదు.

**8. సీపీఐ గురించి వివరించండి?**

సీపీఐ రివిజనిస్టు రాజకీయాల్లో తలపండింది. పార్లమెంటరీ రాజకీయాల నిండా మునిగి ఉంది. ప్రజల మౌలిక సమస్యల సాధనకు పోరాటమే మార్గమన్న విషయాన్ని కూడా మర్చిపోయింది. కాంగ్రెస్‌కు తోకగా మిగిలిన బూర్జువా పార్టీలకు అండగా ఉంటూ ప్రజల్ని ఉద్యమ బాటనుండి తప్పించే సాధనంగా మారిపోయింది. కొన్ని సీట్లు, కొన్ని ఓట్లతో సరిబెట్టుకుంటూ ఎర్రజెండాపై ప్రజలకున్న విశ్వాసాన్ని సంస్కరణవాద రాజకీయాలకు బలిచేస్తుంది.

**9. సీపీఎం ఏర్పరచిన బీఎల్ఎఫ్‌కు ఎక్కువ సీట్లు వస్తాయంటారా?**

ఇది కూడా సీపీఐ లాగానే అవకాశవాద రాజకీయాలతో పార్లమెంటరీ పంథాకు కట్టుబడిపోయింది. ఈ నడుమ దళిత ఉద్ధరణ పేరుతో పాదయాత్రలు చేస్తూ పెటీబూర్జువా సెక్షన్స్‌ను ఆకట్టుకునే ఎత్తుగడతో బీఎల్ఎఫ్ పేరుతో ముందుకు వచ్చి లాల్‌నీల్ రాజకీయాలను నడిపిస్తుంది. ఆ శక్తులలోని పెటీబూర్జువా నాయకత్వంతో బీఎల్ఎఫ్ ఏర్పాటుచేసి ఒక ప్రత్యామ్నాయంగా కావాలని ముందుకు వచ్చింది. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి భూమి సమస్య కేంద్రంగా వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని చేపట్టడానికి రాజకీయంగా సిద్ధంగా లేదు. మధ్యేవాద రాజకీయాలతో, రాజీ ధోరణులతో ఉండే వారందరినీ కూడగట్టి ప్రజలను విప్లవం వైపు వెళ్ళకుండా చేస్తుంది.

**10. తెలంగాణ జన సమితి గురించి, కోదండరాం గురించి మీరేమంటారు?**

భౌగోళిక తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమ శక్తులలో కోదండరాం టీఆర్ఎస్‌లో చేరలేదు. ఇప్పుడు తెలంగాణ జన సమితిని ఏర్పాటుచేసి కాంగ్రెస్ పొత్తుతో ఎన్నికల బరిలోకి దిగాడు. ఆ నాటి ఉద్యమశక్తులలో కొందరిని పార్లమెంటరీ భ్రమల్లో పరిష్కారాలను వెతికే దిశలో నడిపిస్తున్నాడు. ఉద్యమ ప్రతిష్టను కాంగ్రెస్, టీడీపీ పార్టీలతో కలవడం ద్వారా దెబ్బతీస్తున్నాడు. తాను ప్రకటించుకున్న లక్ష్యాన్ని, పోరాటాన్ని స్థిరంగా అంటిపెట్టుకుని ఉండడం ద్వారా విజయం సాధించుతాననే నమ్మకాన్ని కోల్పోయాడు. అవకాశవాదానికి, రాజీవాదానికి గుర్తైన అవినీతి పాలనకు, ప్రజావ్యతిరేక దుష్ట పాలనకు పేరుపొందిన వారితో కలిసి జతకట్టి కేసీఆర్ నియంతృత్వాన్ని ఓడిస్తానని ప్రకటించడం తనను తాను మోసం చేసుకోవడమే కాకుండా ప్రజలను కూడా మోసం చేయడానికి సిద్ధపడడమే. సామాజిక విప్లవ నినాదాన్ని ముందుపెట్టి మహాకూటమికి ఓట్లు అడుగుతున్నాడు.

**11. గద్దర్ గురించి మీరేమనుకుంటున్నారు?**

ప్రజా గాయకుడు గద్దర్ విప్లవ బాటను వీడి స్వార్థంతో వ్యక్తిగత ప్రయోజనాలకోసం పార్లమెంటరీ పంథాలోకి మారాడు. ఆ భ్రమల లోకంలోకి తటస్థంగా ఉన్న శక్తుల్ని తరలించడానికి ప్రయత్నిస్తున్నాడు. పార్లమెంటరీ రాజకీయాల అసలు స్వభావం దోపిడీ వర్గ ప్రయోజనాలు తెలియనంత అమాయకంగా, నాటకీయంగా వ్యవహరిస్తున్నాడు. దోపిడీ వర్గ పార్టీల నేతల ఆశీస్సులు పొందడానికి తన రాజకీయ జీవితం, విప్లవాదర్శం, ప్రజల్లో ఉన్న గౌరవం ఏవీ ఆయనకు ఆటంకం కాకుండా పోయాయి. ఈ ఎన్నికల్లో పోటీకి నిలబడడం లేదని ప్రకటించాడు. భవిష్యత్‌లో ఏం చేస్తాడో వేచి చూడాలి.

**12. బీజేపీ-టీఆర్ఎస్‌లు విడివిడిగా ఎందుకు పోటీ చేస్తున్నాయి?**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, టీఆర్ఎస్ కలిసి ఎందుకు పోటీ చేయడం లేదు అంటే రెండు పార్టీలకు ఒకరిపట్ల ఒకరికి గెలుపు విషయంలో అపనమ్మకం ఉన్నది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎక్కువగా ఉంటుందని ఇద్దరికీ తెలుసు కాబట్టి బీజేపీ–మోదీ ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత అసెంబ్లీ ఎన్నికల్లో పడకుండా టీఆర్ఎస్ జాగ్రత్త పడినట్లే, కేసీఆర్ వ్యతిరేక ప్రభావం బీజేపీ మీద పడకుండా ఉండడానికి విడివిడిగా పోటీ చేస్తున్నారు. పార్టీ నేతల మధ్య ఇది కూడా ఒక అంగీకారమే. రేపు జరగబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో పరిస్థితులను బట్టి కలిసి పోటీ చేయవచ్చు లేదా విడిగా పోటీచేసి సంకీర్ణంలో భాగం కావచ్చు. ఇది కూడా పరస్పర అంగీకారంలో భాగమే తప్ప వేరుకాదు. ప్రజా వ్యతిరేక పాలన కారణంగా సీట్లు తగ్గి అధికారంలోకి రావడం కష్టమవుతుందన్న భయాలు ఇరు పార్టీల్లోను బలంగానే ఉన్నాయి. అందులో భాగంగానే ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడంలో పరస్పరము సహకరించుకోవాలని నిర్ణయానికి వచ్చారు.

**13. ఏ పార్టీ గెలుపు ప్రజలకు ఉపయోగకరం?**

72 సం॥రాల "స్వతంత్ర భారతంలో", "అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో" ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజల మౌలిక

సమస్యలను ముఖ్యంగా మెజారిటీ ప్రజల ఉపాధికి ఆధారమైన భూమి సమస్యను ఏ పార్టీ కూడా పరిష్కరించలేదు. భూమి సమస్య కేంద్రంగా వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్తున్న సీపీఐ మావోయిస్టు మాత్రమే ప్రజల మౌలిక సమస్యలకు పోరాట మార్గాన్ని ముందుకు తీసుకువెళ్తుంది. పార్లమెంటరీ పార్టీలకు, రివిజనిస్టులకు, సామాజిక విప్లవం ముందు అంటున్న వారికి నిర్దిష్టమైన లక్ష్యంగాని, ప్రజా కార్యక్రమం గాని లేవన్నది స్పష్టం కాబట్టి దోపిడీ పాలక వర్గ పార్టీలు అధికారాన్ని మార్చుకుంటాయి. ప్రజలను పీడించడానికి వాటాలువేసుకుని పంచుకుతినడానికి పోటీలు పడుతున్నాయి. నిజాయితీతో, చిత్తశుద్ధితో ప్రజలకోసం పాటుపడడం లేదు. వీరందరి చరిత్ర ప్రజలకు స్పష్టమే. ఈ వ్యవస్థ ఇలాగే ఉన్నంత వరకు ఎవరినో ఒకరిని ఎన్నుకునే పరిస్థితులే కొనసాగినంత వరకు దుష్ట రాజకీయాలు, బూటకపు ఎన్నికలు కొనసాగుతూనే ఉంటాయి. దానికి పావులుగా ఓటర్లను బలిచేస్తూనే ఉంటారు.

**14. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్, చంద్రబాబు సెక్యులర్ ఫ్రంట్ రేపు పార్లమెంటు ఎన్నికల్లో కొనసాగేవేనా?**

దేశంలో కాంగ్రెస్, బీజేపీలే దేశవ్యాపిత నిర్మాణాలు కలిగి బలంగా ఉన్న జాతీయపార్టీలు. రాజకీయాల్లో ప్రస్తుత దశలో ఈ రెండే కీలక భూమికను నిర్వహించనున్నాయి. ప్రాంతీయ పార్టీలన్నీ కలిసి ఈ రెండింటినీ సవాల్ చేయగలిగిన పరిస్థితులు కనబడడంలేదు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), ఒడిశాలో నవీన్ పట్నాయక్ (బీజేడీ), ఢిల్లీలో కేజ్రీవాల్ (ఏఏపీ), బీహార్‌లో నితీష్ కుమార్ (యునైటెడ్ జనతాదళ్), తమిళనాడులో స్టాలిన్ (డీఎమ్‌కే), కర్నాటకాలో కుమారస్వామి (సెక్యులర్ జనతాదళ్), ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు (టీడీపీ) వీరంతా ప్రాంతీయ పార్టీలను నడుపుతున్నారు. ఒక స్టాలిన్ తప్ప మిగిలిన వారంతా ఆయా రాష్ట్రాలలో అధికారంలో ఉన్నారు. వీరికి బీజేపీ వ్యతిరేక ఐక్య కూటమి అవసరం ఉంది. సీపీఐ, సీపీఎంలకు కూడా ఆ అవసరం ఉంది. కానీ వీరి మధ్య ఐక్యతలేదు. కాంగ్రెస్ మీద నమ్మకం కుదరడం లేదు. దీన్ని బట్టి ప్రాంతీయ పార్టీల్లో చీలికలను ఈ రెండు పార్టీలు వినియోగించుకుని రెండు అవకాశవాద కూటములుగా కొనసాగవచ్చు. అందులో భాగంగానే కేసీఆర్ బీజేపీకి అనుకూలంగా ఒక లోపాయికారి ఒప్పందంతో ఫెడరల్ ఫ్రంట్ నినాదంతో కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లే కసరత్తు మొదలుపెట్టాడు. కేంద్రం అనుసరించిన అనేక విషయాలలో మద్దతు ప్రకటించడంలో, ప్రత్యేక హోదా విషయంలో ప్రవేశ పెట్టిన మోదీపై అవిశ్వాస తీర్మాణాన్ని ఓడించి మోదీకి మద్దతు ఇవ్వడం లాంటి అనేక విషయాల్లో కేసీఆర్ రంగు బయట పడడంతో ఫెడరల్ ఫ్రంట్ రాజకీయం తెరమరుగయింది. ఇప్పుడు చంద్రబాబు నాయుడు కాంగ్రెస్‌తో కలిసి బీజేపీ వ్యతిరేక సెక్యులర్ ఫ్రంట్ కూడా ఇటువంటి అవకాశవాదంతో కూడినదే. వీళ్ల నైజాలు, మోసకారితనం అందరికీ తెలుసు కాబట్టి సెక్యులర్ ఫ్రంట్ కూడా బలం పుంజుకోవడం కష్టమే.

**15. సామ్రాజ్యవాద అనుకూల పాలకవర్గ పార్టీల ఆర్థిక, రాజకీయ విధానాలు ఎలా ఉన్నాయి.**

పాలకవర్గ పార్టీలన్నీ తమమధ్య తరతమ భేధాలున్నా దేశంలో దోపిడి, అణచివేతలకు అనుకూలమే. సామ్రాజ్యవాద అనుకూల ఉదారవాద ప్రపంచీకరణ విధానాలను కొనసాగించేవారే. ప్రైవేటీకరణను అనుమతించిన వాళ్ళే. అసమానతలను పెంచినవాళ్ళే. కార్మికుల హక్కులను కాలరాసినవాళ్ళే. నిరుద్యోగాన్ని పెంచిన వాళ్ళే. వ్యవసాయరంగంలో సంక్షోభాన్ని తెచ్చినవాళ్ళే. ప్రజల సంక్షేమాన్ని అటకెక్కించిన వాళ్ళే. రుణమాఫీ, ఉపాధికల్పన, గిట్టుబాటు ధరలు అన్నీ గాలికొదిలేసారు. అవినీతి, భూ దురాక్రమణలు, కులవివక్ష, మతఛాందసం, పితృస్వామిక దాడులు, స్త్రీలపై అత్యాచారాలు, పరువు హత్యలు రోజు రోజుకు పెరిగిపోయాయి. విస్థాపన సమస్య దేశవ్యాపిత సమస్యగా మారింది. విప్లవోద్యమాన్ని, జాతుల ఉద్యమాన్ని అణచివేయడానికి సాయుధ బలగాలతో హత్యా కాండకు పాల్పడడం కొనసాగుతుంది. బ్యాంకుల కుంభకోణాలు. రాఫెల్ ఒప్పందాల వంటి కుంభకోణాలు సర్వసాధారణ మయ్యాయి. లక్షల కోట్ల రూ॥ మొండి బకాయిలు రద్దుచేసి, లక్షల కోట్ల రూ॥ తిరిగి వారికే రుణాలివ్వడం. అన్నీ చూస్తే దోపిడీ వర్గాల సేవకే పాలకులు అంకితమయినట్లు అర్థమవుతుంది.

**16. విప్లవ ప్రజాకమిటీల ద్వారా ఏర్పడే ప్రజల రాజ్యాధికారం ఏ విధంగా ఉంటుంది?**

ఇది జనతా ప్రజాస్వామిక రాజ్యాంగం పునాదిపైన ఏర్పడి, దానికి అనుగుణంగా అన్ని స్థాయిలలో ప్రజల పరిపాలనా కౌన్సిల్స్ ఏర్పాటు చేస్తుంది. ఎన్నికయ్యే ప్రతినిధులను వెనక్కిపిలిచే అధికారంతో సహా రాజ్యాధికారంపై ప్రజలకు పూర్తి నియంత్రణ ఉంటుంది. దేశంలోని ఎవరిపట్ల తెగ, కుల, మత, జాతి, లింగ, భాష, ప్రాంతాల పరంగా, విద్య, పదవి, హోదాలపరంగా రాజ్యం వివక్ష చూపదు. కార్మికవర్గ నాయకత్వంలో జనతా ప్రజాస్వామిక నియంతృత్వం క్రింద సోషలిజానికి మారే పరిణామ క్రమంలో ఉండే సమాజపు ఆర్థిక వ్యవస్థ ఇది.

విశాల శ్రామిక ప్రజానీకపు అన్ని రకాల స్వేచ్ఛలకు, హక్కులకు, ప్రజాస్వామ్యానికి జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం హామీ ఇస్తుంది. అన్ని సమయాల్లోను ప్రజల ప్రయోజనాలను పరిరక్షిస్తుంది. అన్ని రకాల వివక్షతలను రద్దు చేయడానికి, పితృస్వామ్యాన్ని, పురుషాధిక్యతను అంతం చేయడానికి పూనుకుంటుంది. కార్మికులందరికీ సామాజిక భద్రతను, సురక్షితమైన పనిపరిస్థితులను, కనీస సౌకర్యాలను కల్పిస్తుంది. జనతన సర్కార్ ఏర్పడినచోట అందరికి భూమి, ఇల్లు, కనీస ఉపాధికి గ్యారంటీ ఏర్పరుస్తుంది. విద్య, వైద్యం, అందుబాటులోకి తీసుకువస్తుంది. ప్రజల భాష, సంస్కృతుల వికాసానికి తోడ్పడుతున్నది. ప్రజలకు చెందిన ప్రకృతి సహజ వనరుల పరిరక్షణకు బాధ్యతపడుతుంది.

యావత్తు విప్లవ కాలంలోనూ ప్రజలను ప్రజా సైన్యంలో చేరడానికి ప్రత్యేకంగా ఉత్సాహవంతులను చేస్తూ ప్రోత్సహిస్తుంది. ప్రజా సైన్యానికి అవసరమైన వనరుల పట్ల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది.

భారతదేశంలో ఇప్పటిదాకా ఏర్పడ్డ రాజ్యాధికారాలన్నిటితో పోలిస్తే ఈ విప్లవ ప్రజాకౌన్సిళ్లు, వాటి ఆర్‌పీసీలు అత్యున్నతమైన, నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థలు. ఇవి నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో, తమ ప్రాంతమంతటా కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక–కర్షక మైత్రి పునాదిగా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక శక్తులన్నిటి ఉమ్మడి నియంతృత్వాన్ని స్థాపించే దిశగా పనిచేస్తాయి.

**17. అసలు ఏది ప్రజా ప్రభుత్వం? ప్రజా ప్రభుత్వం ఏం చేయాలి?**

ఎవరి శ్రమ వల్ల సమాజ చలనానికి వీలు కలుగుతుందో, సమాజ సంపద పోగుపడడానికి అవకాశం వస్తుందో వారే ప్రజలు. ఇతరుల శ్రమ ఫలితాన్ని అనుభవించేవారు ప్రజలు కాజాలరు. శ్రామికులకు ఓటు హక్కు ఇచ్చినప్పటికీ వారి నిజమైన ప్రతినిధులు అధికారానికి వచ్చే అవకాశం ఈ వ్యవస్థలో లేనందువల్ల అలా ఏర్పడేవి ప్రజా ప్రభుత్వాలు కాజాలవు. బూటకపు ఎన్నికల ద్వారా మౌలిక మార్పులు రావు. మౌలిక సమస్యలు పరిష్కారం కావు. ఇవి ప్రజా ప్రభుత్వాలు కాజాలవు.

తెలంగాణలో సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాసంక్షేమంల గురించి, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, వికేంద్రీకరణలను ఆకాంక్షించేవారు. శ్రమను గౌరవించడం, పని పరిస్థితులు మెరుగుపరచడం, శ్రమకు తగ్గ ఫలితాన్నివ్వడం, జీవన ప్రమాణాలు అభివృద్ధి పరచడం. వ్యవసాయానికి అవసరమైన వసతులు కల్పించడం, సాగునీరు, విద్యుత్, విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తేవడం, కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం, రుణమాఫీ, ప్రైవేటు రుణాలపై నియంత్రణ, బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాల పంపిణీ, కార్మిక హక్కులను కాపాడడం, రక్షణ చట్టాలు అమలు చేయడం, వలస కార్మికులకు రక్షణ కల్పించడం. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడడం, ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించడం, భూసంస్కరణలు అమలు చేయడం, పేదలకు భూములు ఇవ్వడం లాంటివి చేయాలి.

**18. ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం పట్ల విప్లవోద్యమ అవగాహనను వివరించండి?**

'విప్లవోద్యమం తెలంగాణ పునర్నిర్మాణం విషయంలో స్పష్టమైన అవగాహన కల్గి వుంది. 1996 నుండి విప్లవోద్యమం ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌ను ప్రజల ముందుంచింది. నూతనంగా ఏర్పడే రాష్ట్రం భౌగోళికమైనదే కాక అది ప్రజాస్వామికీకరింప బడాలనీ ప్రచారంచేసింది. అందుకు ప్రజల ముందు కనీస కార్యక్రమాన్ని ఉంచింది. అట్లాగే తెలంగాణ రాష్ట్రం పోరాటం ద్వారానే సాధించుకోగలమని స్పష్టంగా చెప్పింది. పార్లమెంటులో బిల్లు పెట్టాలని, తెలంగాణ వనరులను కాపాడుకోవాలని ముఖ్యమైన పిలుపులనిచ్చింది. ఈ కాలమంతటా విప్లవోద్యమం చూపించిన రాజకీయ దార్శనికత నిజమని రుజువయింది. కాబట్టి తెలంగాణ సమాజం ఈ రోజు తెలంగాణ పునర్నిర్మాణం ప్రజాస్వామికంగా ఉండాలని నినదిస్తున్నది.

'తెలంగాణ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమయ్యేది కార్మిక వర్గం నాయకత్వంలో విప్లవకర వర్గాలైన రైతాంగం, కార్మికవర్గం, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలు ఐక్యమై నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాయుధంగా విజయవంతం చేసుకోవడం ద్వారానే', బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల దోపిడీ పాలనను కూలదోయడం ద్వారానే' వారి చేతుల్లో ఉన్న కోట్లాది రూపాయల ప్రజల సంపద, భూమి, ఫ్యాక్టరీలు, సహజవనరులు, పెట్టుబడి స్వాధీనం చేసుకోవడం ద్వారానే' వేల కోట్ల రూపాయల అప్పుల్ని రద్దు చేయడం ద్వారానే తెలంగాణ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయి. సామ్రాజ్యవాదులపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము స్వతంత్రంగా నిలబడి దున్నేవారికే భూమి ప్రాతిపదికపై వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారానే, వ్యవసాయంపై ఆధారపడి పారిశ్రామిక అభివృద్ధిని కొనసాగించడం ద్వారానే, ప్రజల జీవన పరిస్థితుల్ని క్రమంగా మెరుగు పర్చడం ద్వారానే తెలంగాణ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల ప్రజల, మొత్తం దేశ ప్రజల మౌలిక సమస్యలు కూడ ఈ విధంగానే పరిష్కారమవుతాయని విప్లవోద్యమ కార్యక్రమం చెబుతున్నది.

**19. ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమ శక్తులకు పిలుపు.**

ప్రజాస్వామిక తెలంగాణ సాధనకోసం మొదలైన మలిదశ ఉద్యమం కొనసాగుతున్నది. భౌగోళిక తెలంగాణ సాధించినంత మాత్రాన సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వాతంత్రం రాదు. సమాజం వర్గాలుగా ఉన్నంత వరకు, దోపిడీ వర్గాల పాలన కొనసాగినంతకాలం ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు. భూమి, ఉపాధి వనరులు కొద్ది మంది చేతుల్లో ఉన్నంత వరకు అసమానతలు తొలగిపోవు. అందరికి తిండి, గూడు, గుడ్డ కావాలన్నా ప్రజలంతా ప్రజాస్వామిక హక్కులను సమానంగా అనుభవించాలన్నా ప్రాంతేతరుల పాలన పోవడం ఒక్కటేచాలదు. ఈ ప్రాంతంలోని దోపిడీ వర్గాల పాలన అంతం కావాలి. అప్పుడే దోపిడీ, అణచివేతలు లేని ప్రజలందరి ప్రజాస్వామిక పాలన సాధ్యం అవుతుంది. ప్రజాస్వామిక తెలంగాణ సాధన లక్ష్యం. అందుకు అన్ని సెక్షన్ల ప్రజలు సమైక్యంగా పోరాడాలి.

ప్రజలు పోరాడి సాధించిన భౌగోళిక తెలంగాణను దళారీ టీఆర్‌ఎస్ పార్టీ పరాయి పాలకులకు ఒప్పచెబుతుంది. కాంగ్రెస్, టీడీపీతో సహా అన్నీ అదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. కాబట్టి ప్రజలు ప్రజా ఐక్య కార్యాచరణ ద్వారా పోరాడి ప్రజాస్వామిక తెలంగాణ సాధించాలి. అదే తెలంగాణ పోరాట విద్రోహులకు హెచ్చరిక. దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలను నెరవేర్చే ఈ బూటకపు ఎన్నికలను బహిష్కరించి ప్రజాస్వామిక తెలంగాణ కోసం ఉద్యమించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**20. ఎన్నికల సందర్భంగా ప్రజలకు మీ సందేశం ఏమిటి?**

ఆంగ్ల దినపత్రిక 'ఎకనమిక్ టైమ్స్' బ్యూరో ప్రతినిధి సీఆర్ సుకుమార్‌కు కేసీఆర్ ఇచ్చిన ఇంటర్వ్యూలో వంద శాతం ఎన్నికల ప్రణాళికను అమలుచేసామని, మ్యానిఫెస్టోలో లేని 76 పథకాలను అందించామని కల్లబొల్లి కథలు చెప్పాడు. సంస్కరణలు అంటేనే అసలు సమస్యలు పరిష్కరించలేక పక్కదారి చూపే ఒక సౌలభ్యం అని అందరికీ తెలుసు. సంస్కరణలు ఎంత ఎక్కువ సంఖ్యలో ఉంటే అంత పెద్ద ఎత్తున పేదరికం, అసమానతలు ఉన్నాయని చెప్పకనే చెప్పడం. మరో మాటలో పేదరికాన్ని శాశ్వతం చేసి సంస్కర్తగా ఫోజ్ కొట్టడం. ఇదే పార్లమెంటరీ రాజకీయాల్లో అందరూ అనుసరిస్తున్నది. ప్రజల సంపదను దోపిడీ పాలకవర్గాలు పంచుకు తింటూ, పీడిత ప్రజలు ఉద్యమించకుండా జోకొట్టేవే ఈ పథకాలన్నీ. కనీసం వాటిని అమలుచేసే దానిలో కూడా వీరికి చిత్తశుద్ధి లేదు. ఈ పేరుతో ప్రజల మధ్య పోటీ పెంచి క్రింది స్థాయిలో తమ పార్టీ బలాన్ని పెంచుకుంటున్నారు. ఈ ఎన్నికల విధానమే ఒక బూటకపు తతంగం. బూటకపు ఎన్నికల రాజకీయాలను బహిర్గతం చేయండి. ముందస్తు ఎన్నికలను బహిష్కరించండి. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయండి. సర్వసంపదలు సృష్టించే ప్రజలే చరిత్ర నిర్మాతలు. తెలంగాణ ప్రజలు నూతన చరిత్ర సృష్టించాలి. ✦

# తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ పూర్తి పాఠం

**1. ఈ ప్రజాస్వామ్యం-ఎన్నికలు బూటకం అంటున్నారు కదా! ఎందుకు?**

భారత రాజ్యాంగంలో ప్రజాలందరికి స్వేచ్ఛ, జీవనాధారాలు, పౌర ప్రజాతంత్ర హక్కుల కల్పన, ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వం సాధించడంతో పాటు దేశానికి సార్వభౌమత్వం, స్వావలంబన ప్రధానమని చెప్పబడింది. 72 సం॥ల 'స్వతంత్ర భారతం'లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పేరిట జరిగిన ఎన్నికలు, అధికారం నడిపిన రాజకీయ పార్టీలు ఎటువంటి మార్పును తీసుకురాలేదు. ఆర్థికంగా, సామాజికంగా ఉన్న అసమానతలు పెరిగాయి. మన చట్టాలు, పాలనా విధానాలతో దోపిడీ, అణచివేతలు పెరిగాయి. వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీసురంగం పూర్తిగా సామ్రాజ్యవాదుల చెప్పు చేతల్లో నడుస్తున్నాయి. సార్వభౌమత్వం, స్వావలంబన కనుమరుగైపోతున్నాయి.

ప్రజల మౌలిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డ అందుబాటులో లేవు. భూమి, ఉపాధి లాంటి ముఖ్యమైన ఆర్థిక సమస్యలు పరిష్కరించబడలేదు. ప్రజల ప్రాథమిక హక్కులతో పాటు పౌరహక్కులయిన వాక్‌సభా స్వాతంత్ర్యాలు కూడా హరించబడుతున్నాయి. దేశంలో ఫాసిజం, అప్రకటిత ఎమర్జెన్సీ అమలు జరుగుతున్నాయి. రాజకీయ అసహనం పెరిగిపోయింది. ఈ దేశంలో పీడితుల పక్షాన నిలబడి రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు దానికి భిన్నంగా కొద్దిమంది దోపిడీదారుల ప్రయోనాల కోసం పరిపాలిస్తున్నాయి.

ప్రజా ప్రభుత్వాల పేరుతో కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ దోపిడీ వర్గ పార్టీలు అధికారంలోకి వస్తూనే ఉన్నాయి. కానీ మెజారిటీ ప్రజల మౌలిక సమస్యలేవీ ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం, తాగునీటి, సాగునీటి లేమి దేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడం పేరుతో ప్రభుత్వాలు ముందుకు తెస్తున్న కార్పొరేటు అనుకూల ఆర్థిక విధానాలు ప్రజలకు మరింత ప్రాణాంతకంగా మారాయి. వాళ్ల జీవన ప్రమాణాలను మరింతగా దిగజార్చుతున్నాయి.

ప్రజారాశులను సామాజిక సమీకరణలుగా, ఓటు బ్యాంకులుగా చూస్తున్నారు. ప్రజాస్వామ్యం అంటే ఓట్లు-సీట్లు పంచుకునే ఎన్నికలుగా చూస్తున్నారు. ఈ ఎన్నికలలో ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేయడం లేదు.

ఎన్నికల ముందు విచ్చలవిడిగా కుమ్మరించే డబ్బు సంచులు, ప్రజలను మోసపుచ్చే రాజకీయ నాయకుల వాగ్దానాలు, హంగూ ఆర్భాటంతో కూడిన ప్రచారం, కుల, మత, ప్రాంతీయ సమీకరణాలు, లక్షల సాయుధ బలగాల మోహరింపు, ఎన్నికల బూత్‌ల ఆక్రమణలు, రిగ్గింగ్, హింస, భౌతిక దాడులు, హత్యలు, డబ్బులు పంచడం ఇవన్నీ ఎన్నికలు ఎంత స్వేచ్ఛగా, ప్రజాస్వామికంగా జరుగుతున్నాయో పట్టిచూపుతున్నాయి. ఇంత అప్రజాస్వామికంగా ఉన్నాయి కనుకనే ఈ ఎన్నికలను బహిష్కరించాలి. వర్గ సమాజంలో ప్రజాస్వామ్యం వర్గ ప్రజాస్వామ్యమే. ఇప్పుడు అమలు జరుగుతున్నది దోపిడీ వర్గాల ప్రజాస్వామ్యమే. దోపిడీ వ్యవస్థను నాశనం చేయకుండా ప్రజల ప్రజాస్వామ్యం అమలుకాదు.

**2. తెలంగాణలో ముందస్తు ఎన్నికలు-ఆపద్ధర్మ ప్రభుత్వంలను మీరు సమర్థిస్తున్నారా?**

కేసీఆర్ 9 నెలల ముందుగానే అంసెంబ్లీని రద్దుచేసి ముందస్తు ఎన్నికలకు సిద్ధమయ్యాడు. కేసీఆరే సర్వం కాబట్టి ఆయన పథకాలకు, ప్రణాళికలకు, వ్యూహాలకు ఎదురు చెప్పేవాళ్లు ఉండరు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో లాబీయింగ్ రాజకీయాలు నడిపి, అధికారంలోకి వచ్చిన కేసీఆర్ మరోసారి అధికారాన్ని చేజిక్కించుకోవడానికి, తన కుటుంబ పాలనను మరో ఐదుఏళ్లు కొనసాగించడానికి తహతహలాడుతున్నాడు. తెలంగాణ రాష్ట్రంలో వేగంగా మారుతున్న ప్రభుత్వ వ్యతిరేక పవనాలను, బలపడుతున్న ప్రతిపక్షాన్ని చూసి భయపడిన కేసీఆర్ పడవ పూర్తిగా మునగక ముందే ముందస్తు ఎన్నికలకు సిద్ధపడ్డాడు. ఉద్యమ నినాదాలనే 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన కేసీఆర్ వాటిని వేటినీ అమలు చేయలేదు. ప్రజల మౌలిక సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించాడు. కేసీఆర్ మీద మధ్యతరగతి ప్రజలకు కూడా నమ్మకం పోయింది. కుల ప్రాతిపదికన ఇచ్చిన పథకాలన్నీ ప్రజలను చీల్చడం, తాత్కాలికంగా చిన్న చిన్న ప్రయోజనాలను నెరవేర్చడం ద్వారా, కొద్ది మందిని టీఆర్ఎస్‌కు అనుకూలంగా ఆకట్టుకోవడమే దాని వెనుక ఉన్న కుట్ర అని అందరికీ అర్థమైంది. అవినీతి, అక్రమాలు, దురహంకారంలతో ప్రజాద్రోహిగా, నియంతగా నాలుగున్నర సం॥రాలు పాలించిన కేసీఆర్ పట్ల ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతుంది. అది మరింత సంఘటితం కాకముందే జిమిక్కులతో మరోసారి గెలవాలని తొందరపడుతున్నాడు. మోదీతో పార్లమెంటరీ ఎన్నికల్లో సహకరిస్తాననే చీకటి ఒప్పదంతో అసెంబ్లీ రద్దును, ముందుస్తు ఎన్నికలను సానుకూలం చేసుకున్నాడు. ఇది ప్రజలను, ప్రతిపక్షాన్ని, సొంత పార్టీని ఆఖరికి మంత్రి వర్గాన్ని సంప్రదించి చేసిన నిర్ణయం కాదు. మోదీ సూచన మేరకే గవర్నర్ అసెంబ్లీని రద్దు చేసాడు. ఎన్నికల కమీషన్ ముందస్తు ఎన్నికలకు అనుకూలంగా నిర్ణయం చేసింది. తాత్కాలిక ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగడం రాజ్యాంగ విరుద్ధమే అయినప్పటికీ మోదీ, కేసీఆర్‌ల ప్రయోజనాల కోసం ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారు. వాటిని మేం సమర్ధించడం లేదు.

**3. తెలంగాణ ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ కూటముల మధ్య పోటీని ఎలా అర్థం చేసుకోవాలి?**

ఈ ఎన్నికల్లో అధికారంలో ఉన్న టీఆర్ఎస్‌కు, ప్రతిపక్షంగా

(మిగతా 38వ పేజీలో....)